స్థానిక రిజర్వేషన్లు ఖరారు నేడు!



బీసీలకు 42%, ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం!

జీవో జారీ చేయనున్న సర్కార్?

తర్వాత జిల్లాలవారీగా జాబితా

› 2

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

మంగళవారం TUESDAY 23.9.2025 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 15 ‖ సంచిక (Issue): 109 ‖ వెల (Price) రూ.6.50 | విదియ

మంగళవారం, సూర్యోదయం: 6-05, సూర్యాస్తమయం: 6-11. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం శరదృతువు ఆశ్వయుజ మాసం శుక్ల పక్షం తిథి: విదియ తెల్లవారుజామున 4-52 వరకు. నక్షత్రం: హస్త పగలు 1-40 వరకు, తదుపరి చిత్త. వర్జ్యం: రాత్రి 10-31 నుంచి రాత్రి 12-17 వరకు. రాహుకాలం: పగలు 3-09 నుంచి సాయంత్రం 4-39 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-30 నుంచి ఉదయం 9-19 వరకు, పునర్ దుర్ముహూర్తం: రాత్రి 10-56 నుంచి రాత్రి 11-44 వరకు. అమృతకాలం: ఉదయం 7-05 నుంచి ఉదయం 8-50 వరకు. ముద్దపప్పు బతుకమ్మ.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

• గూడు చెదిరె.. గోడు మిగిలె!



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గాజులరామారం బస్తీలో హైడ్రా కూల్చివేతల ఒక్కరోజు తర్వాతి దృశ్యమిది. ఒక్కసారే 260 ఇండ్లు హైడ్రా బుల్డోజర్ల దెబ్బకు ఇలా నేలమట్టమయ్యాయి. తలదాచుకునేందుకు ఉన్న ఒక్క గూడునూ కండ్లముందే సర్కారు కర్కశంగా కూల్చేస్తే.. ఎవరిని నిందించాలో, ఎవరిని నిలదీయాలో తెలియని పరిస్థితి ఆ పేదలది. రోడ్డున పడ్డ కుటుంబాన్ని చూసుకుని రోదిస్తున్న ఓ మహిళ.

• బొమ్మరిల్లూ జాగ్రత్త బిడ్డా!



ఇల్లు కూలింది. దర్వాజ ఒరిగింది. గాజులరామారంలో ఛిన్నాభిన్నమైన శిథిలాల మధ్య చిన్నారులు అమాయకంగా ఆడుకుంటున్నారు. 'ఇనుప రెక్కల గద్ద' ఉన్న గూడును కూల్చేస్తే.. ఇలా ముక్కలైన కలలను పేర్చుకుని 'బొమ్మరిల్లు' కట్టుకునే పనిలో నిమగ్నమై ఉన్నారు. జాగ్రత్త పిల్లలూ.. పేద బతుకులపై పగబట్టే బుల్డోజర్లకు ఇక్కడ కొదువే లేదు. ఏలినవారి కాఠిన్యానికి వయోభేదమూ గుర్తుకురాదు.



పండుగైనా, పబ్బమైనా

కూల్చుడే!

ఆదివారాలు, సెలవురోజుల్లో మేమెందుకు ఆగాలె?

గాజుల రామారంలో 260 నిర్మాణాలు కూల్చినం

మరో 640 ఇండ్లు కూలుస్తం

అక్కడ పేదలెవరూ లేరు.. రౌడీషీటర్లవే తొలగించినం

› 2

మేం కష్టపడుతున్నం.. మిగతా శాఖలు కూడా పని చేయాలి

తుది నోటిఫికేషన్ ఇచ్చాకే సల్కం చెరువులో కూల్చివేతలు

హైడ్రా కమిషనర్ రంగనాథ్

ప్రైవేటు జాగ.. పెద్దల పాగా

కీసరలో 50 కోట్ల విలువైన భూమిపై కాంగ్రెస్ నేతల కన్ను



నకిలీ డాక్యుమెంట్‌తో ఎన్నారై భూమి కబ్జా

రంగంలోకి దిగిన మంత్రి.. చక్రం తిప్పిన పేషీ

తెర వెనుక ఎంపీ, కాంగ్రెస్ యువ నాయకుడు

ఖాళీ చేయాలని యజమానులకు బెదిరింపులు

కబ్జాదారుడికి వంత పాడుతున్న అధికారులు

వివాదం చెలరేగడంతో ఎట్టకేలకు పోలీస్ కేసు

ప్రభుత్వ, అసైన్డ్, సీలింగ్ భూములను ఇష్టం వచ్చినట్టు మింగేస్తున్న కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ప్రైవేటు భూములపై కన్నేశారు. ఖాళీ జాగ కనిపిస్తే చాలు నకిలీ డాక్యుమెంట్లతో పాగా వేస్తున్నారు.

మంత్రులు, వారి పేషీలు వెనుక ఉండి నడిపిస్తుండటంతో అధికారులు సైతం కబ్జారాయుళ్లకు అండగా నిలుస్తున్నారు. మేడ్చల్ జిల్లా కీసర మండలం రాంపల్లి గ్రామంలో ఓ మహిళా ఎన్నారై రెండెకరాల భూమి పరిస్థితి ఇదే. ఓ మంత్రి స్వయంగా అధికారులకు ఫోన్ చేసి కబ్జా రాయుళ్లకు సహకరించాలని ఆదేశించడంతో బాధితురాలు దిక్కుతోచని పరిస్థితుల్లో సొంత భూమిని కాపాడుకునేందుకు తిప్పలు పడుతున్నారు.

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర మండలం రాంపల్లి గ్రామ పరిధిలో సర్వే నంబర్ 385లో ఎకరం భూమిని 1999లో జమ్మల నగేశ్ అనే వ్యక్తి రజితారెడ్డి, రేఖారెడ్డి కుటుంబానికి విక్రయించారు. రెవెన్యూ రికార్డుల్లో వీరిద్దరితో పాటు వారి కుటుంబానికి చెందిన మరో ఇద్దరి పేర్ల మీద ఆ భూమి కొనసాగుతున్నది. 2016లో నిబంధనల ప్రకారం నాలా మార్పు (వ్యవసాయ భూమి నుంచి నివాసయోగ్యం) చేసుకున్నారు. 2019లో సర్వే చేయించుకొని హద్దులను గుర్తించిన తర్వాత చుట్టూ ఫెన్సింగ్ వేసుకున్నారు. అంటే 26 సంవత్సరాల నుంచి ఆ భూమి వారి ఆధీనంలోనే ఉన్నది. ఆరేండ్ల కిందట కొందరు వ్యక్తులు గేటు మీద ఉన్న యజమానుల పేర్లను తొలగించి › 8వ పేజీలో



మా భూమిని కాపాడండి

రాంపల్లి సర్వే నం.385లో 26 ఏండ్ల కిందట భూమిని కొని, సాగు చేసుకుంటున్నాం. 2016లో ఒకసారి, 2019లో మరోసారి సర్వే చేశాం. హద్దులు గుర్తించి గోడ కట్టినం. కొందరు తమ పేర్లు తొలగించి సుబ్బారెడ్డి అని రాసుకుంటే.. దానిపై 2023లో పోలీసులకు ఫిర్యాదు చేసినం. విషయం కోర్టులో ఉండగానే మూడ్రోజుల క్రితం సుబ్బారెడ్డి 50 మందితో వచ్చి ప్రహరీ తొలగించి, చెట్లను ధ్వంసం చేశారు. మా భూమికి నకిలీ పత్రాలు సృష్టించి కబ్జాకు ప్రయత్నిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాకు న్యాయం చేయాలి.

- భూమి యజమానులు రజితారెడ్డి, రేఖారెడ్డి



వైద్యశాఖలో అవినీతి వైరస్!

విభాగాధిపతి కనుసన్నల్లో యథేచ్ఛగా వసూళ్ల దందా

ఫైల్‌కో రేట్ చొప్పున ఆమ్యామ్యాలు

ఉద్యోగుల ప్రమోషన్ల నుంచి సర్వీస్ రెగ్యులరైజేషన్ వరకూ ఇదే తంతు

మంత్రి పేషీకన్నా ఆయన సిబ్బందే అధికం

గతంలో ఏడుగురికి షోకాజ్ నోటీసులు

తనపై చర్యల్లేకుండా విభాగాధిపతి స్కెచ్

పీఎంవోలో పనిచేసే సోదరుడితో చక్రం

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ఉద్యోగుల క్రమబద్ధీకరణకు 1,200 మంది నుంచి రూ.5 వేల చొప్పున రూ.60 లక్షల వరకు అక్రమ వసూళ్లు.. 20 ఏండ్లకు పైగా పరారీలో ఉన్న ఓ అధికారి వద్ద రూ.5 లక్షలు తీసుకొని ఇష్టారీతిన మళ్లీ పోస్టింగ్.. ప్రమోషన్లలో భారీగా వసూళ్లు.. ఇవీ రాష్ట్ర వైద్యారోగ్య శాఖలో జరిగే అవినీతి, అవకతవకలకు మచ్చుతునకలు. ఆ శాఖ కీలక విభాగాధిపతి కనుసన్నుల్లోనే అధికారులంతా ఒక్కటై యథేచ్ఛగా ఇలాంటి అక్రమ వసూళ్లకు › 8వ పేజీలో

మోసం చేసిన కాంగ్రెస్‌ను

గల్లా పట్టి అడగాలె

ఐక్యంగా ఉండండి..ప్రభుత్వాన్ని నిలదీయండి

ట్రిపుల్ ఆర్ బాధిత రైతులకు అండగా ఉంటం

చట్టసభల్లో నిలదీస్తం..కోర్టులో కొట్లాడుతం

న్యాయం కోసం స్థానిక ఎన్నికలు బహిష్కరించండి

ప్రియాంకతో మాట ఇప్పించి తప్పడం దుర్మార్గం

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

గోడు వెల్లబోసుకున్న 400 మంది భూ బాధితులు



కాంగ్రెస్ పార్టీ.. నమ్మి ఓటేసిన పేద రైతుల భూములను గుంజుకుంటూ నోటి కాడి బుక్కను ఎత్తగొడుతున్నది. అధికార నేతల కోసం బక్క రైతులను అరిగోస పెడుతున్నది. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చవద్దని ఎన్నిసార్లు కోరినా పెడచెవిన పెడుతున్నది. ఎకరాకు రూ.26 లక్షల పరిహారం ఇస్తామని చెప్పి రూ.6 లక్షలకు కుదించింది.

-కేటీఆర్

› 3

డెక్కన్ ఫ్యాక్టరీలో ఉద్రిక్తత

› 8

సూర్యాపేట సిమెంట్ పరిశ్రమలో తిరగబడిన యూపీ కార్మికులు

సెక్యూరిటీ గది, పోలీస్ వాహనం ధ్వంసం.. పలువురికి గాయాలు



రాజు దాదా, కోసా దాదా

ఎన్‌కౌంటర్

మావోయిస్టులకు ఎదురుదెబ్బ

ఛత్తీస్‌గఢ్ కాల్పుల్లో నేలకొరిగిన ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు

› 7

మృతులు సత్యనారాయణరెడ్డి, రామచంద్రారెడ్డి తెలంగాణవాళ్లే

ఒక్కొక్కరిపై 40 లక్షల రివార్డు



సింగరేణిలో బోనస్.. బోగస్

కార్మికులకు మరోసారి ప్రభుత్వం ధోకా

37శాతం బోనస్ ఇస్తున్నట్టు ప్రకటన

ఇచ్చింది మొత్తం లాభంలో 12 శాతమే

2,173 కోట్లకు.. ఇస్తున్నది 819 కోట్లే

అభివృద్ధి పేర నిధులు పక్కన పెట్టడం వంచించడమే: కార్మిక సంఘాలు

హైదరాబాద్, కరీంనగర్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/గోదావరిఖని: సింగరేణి కార్మికులను కాంగ్రెస్ సర్కారు వంచించింది. లాభాల్లో వాటా, బోనస్ విషయంలో మోసం చేసింది. మొత్తం లాభాల్లో వాటా ప్రకటించకుండా... అందులో వేలకోట్ల రూపాయలను పక్కన పెట్టి, మిగిలిన మొత్తంలో వాటాను ప్రకటించింది. దీంతో కార్మికులకు దక్కాల్సిన భారీ బోనస్ › 11వ పేజీలో



ఫిరాయింపుదార్లపై వేటు వేయాల్సిందే!

గోడదూకిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాల్సిందే

అడిగిన, అవసరమైన అన్ని ఆధారాలను ఇస్తున్నాం

శాసన సభాపతి తక్షణమే విచారణ ప్రారంభించాలి

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, సంజయ్, కౌశిక్

అసెంబ్లీ కార్యదర్శికి అఫిడవిట్లు అందజేసిన నేతలు

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ తక్షణం చర్యలు తీసుకోవాల్సిందేనని, అనర్హత వేటుకు సంబంధించి ప్రత్యక్ష విచారణ చేపట్టాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల బృందం డిమాండ్ చేసింది. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కౌశిక్‌రెడ్డి తదితరులు సోమవారం స్పీకర్ కార్యాలయంలో ఫిరాయింపు ఎమ్మెల్యేలకు › 2వ పేజీలో

వంద ప్లాట్లకు వేలం..

అమ్మింది మూడే!

రాజధానిలో 'రియల్టీ' డౌన్

హెచ్ఎండీఏ వేలంతో బయటపడ్డ డౌన్ ట్రెండ్

వేలంలో గరిష్ఠ ధరకన్నా పెరిగింది రూ.2 వేలే

కాంగ్రెస్ పాలనలో కుప్పకూలిన రియల్‌ఎస్టేట్



హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 22(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగరంలో భూముల వేలం అంటే అంచనాలకు మించిన పోటీ.. రికార్డు ధరలు.. లెక్కకు మించిన ఆదాయం.. కానీ ఎకరం రూ.100 కోట్లు పలికిన ఇదే రాజధానిలో.. ఇప్పుడు చదరపు గజానికి రూ.2 వేలు పెరగడమే గగనంగా మారింది. వంద ప్లాట్లను వేలానికి పెడితే 3 ప్లాట్లు అమ్మేందుకే ముప్పుతిప్పలు పడే పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్‌లో అట్టడుగుకు చేరిన రియల్ ఎస్టేట్ ట్రెండ్‌కు ఇది ప్రత్యక్ష ఉదాహరణ. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ నగరం › 8వ పేజీలో

• ఏదీ బతుకమ్మ సంబురం..



గాజులరామారంలో హైడ్రా కూల్చివేసిన ఇండ్ల శిథిలాల వద్ద కూర్చున్న బాధిత కుటుంబాల మహిళలు, పిల్లలు

• రాజధాని నగరంలో ఆకలి రాజ్యం



కూలిన తమ ఇండ్ల శిథిలాలపై కూర్చొని ఆకలికి అల్లాడుతున్న చిన్నారులు.. విషాదంలో కుటుంబసభ్యులు

పండుగైనా.. పబ్బమైనా కూల్చుడే!

- ప్రతి తప్పిదాన్ని హైడ్రాకు ఆపాదిస్తున్నారు
- మిగతా శాఖలు కూడా తమ పనిచేయాలి
- ఎవరి పనులు వారు చేస్తే ఇబ్బందులుండవు
- గాజులరామారంలో 260 నిర్మాణాల్ని కూల్చాం
- త్వరలోనే మరో 640 ఇండ్లను కూల్చివేస్తాం
- అక్కడ పేదల్లేరు.. రౌడీషీటర్లవే తొలగించాం
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టీకరణ
- కర్ణాటక రాష్ట్ర ఇంజినీర్లు తమ పనితీరును మెచ్చుకున్నారని మీడియా సమావేశంలో వెల్లడి



హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): కూల్చివేతలకు పండుగలు, ఆదివారాలతో సంబంధం లేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. సెలవు రోజుల్లోనూ కూల్చివేతలు చేపట్టవచ్చని హైకోర్టు అనుమతి ఇచ్చిందని గుర్తు చేశారు. బతుకమ్మ పండుగ రోజున కూడా సెలవే నని, అందుకే గాజుల రామారంలో కూల్చివేతలు చేపట్టామని తెలిపారు. సోమవారం హైడ్రా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రంగనాథ్ మాట్లాడుతూ ఆక్రమణల నుంచి భూములను రక్షించడం చాలా కష్టమని, అందుకోసం కొన్ని కఠిన నిర్ణయాలను కూడా తీసుకోవాల్సి ఉంటుందని తమ చర్యలను సమర్థించుకున్నారు. కూల్చివేతలకు తాము ఎంచుకున్న విధానాన్ని కర్ణాటక నుంచి వచ్చిన ఇంజినీర్లు కూడా మెచ్చుకున్నారని తెలిపారు. తాము నిబద్ధతతో పనిచేస్తున్నామని చెప్పారు. ఆక్రమణలని తేలితే పూర్తయిన నిర్మాణాలను కూడా కూల్చడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు.

ప్రతి దానికీ మమ్మల్నే నిందిస్తున్నారు

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జరిగే ప్రతి తప్పిదాన్ని హైడ్రాకే ఆపాదిస్తున్నారని, ఏం జరిగినా తమనే నిందిస్తున్నారని రంగనాథ్ అసహనం వ్యక్తం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్తు, పోలీసు శాఖలు కూడా ఉన్నాయని, ఎవరి పని వారు సక్రమంగా చేస్తే ఇబ్బందులు తలెత్తవని వ్యాఖ్యానించారు. అన్ని శాఖల పనులు చేయడానికి తమకు వంద చేతులు లేవని, ప్రతిదీ తమనే చేయమంటే ఎలా? అని ప్రశ్నించారు. అన్ని శాఖల తప్పిదాలకు తమనే బాధ్యులను చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నగరంలో నాలాలు ఉప్పొంగకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారని విలేకరులు ప్రశ్నించగా, నాలాల పునరుద్ధరణ బాధ్యత తమది కాదని సమాధానమిచ్చారు. పూడికతీత పనులు నిరంతరం కొనసాగించాలని, ఇందుకు జీహెచ్ఎంసీ అధికారులు సహకరించాలని కోరారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నలుగురు వ్యక్తులు వరదలో కొట్టుకుపోవడానికి కారణాలేంటని అడగ్గా, ఆ ప్రాంతాల్లో వర్షం వచ్చిన ప్రతిసారి భారీగా వరద వస్తుందని చెప్పారు. వరద వస్తుందని తెలిసినా వారు ఆ దారిలో వెళ్లారని, అందుకే కొట్టుకుపోయినట్టు తేల్చారు. నగరంలోని పలు బస్తీలు, కాలనీల్లో పేదల ఇండ్లు చిన్నగా, తక్కువ ఎత్తుతో ఉండటం వల్లనే వర్షపు నీరు ఇండ్లలోకి చేరుతుందని చెప్పారు. బస్తీల్లో కొద్దిపాటి స్థలంలో తక్కువ ఎత్తుతో నిర్మాణం చేపడతారని అందుకే మునుగుతున్నాయని, వరద ప్రభావంతో ఎక్కువగా నష్టపోతున్నారని తేల్చారు. నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారడం, నాలాల పరిమాణం తగ్గడం వల్లే అవి పొంగి పొర్లుతున్నాయని చెప్పారు.

గాజులరామారంలో పేదలు లేరు

హైడ్రా ఏర్పడిన 15 నెలల నుంచి ఇప్పటిదాకా 581 నిర్మాణాలను కూల్చివేశామని రంగనాథ్ ప్రకటించారు. గాజులరామారంలో ఆదివారం 260 నిర్మాణాలు కూల్చామని మరో 640 నిర్మాణాలను కూలుస్తామని చెప్పారు. వాటిలో ప్రజలు నివాసం ఉంటున్నారని ఆగామని, ఆక్రమణకు గురైందని తేల్చిన తర్వాత కూల్చివేతలు కొనసాగిస్తామని చెప్పారు. గాజులరామారం భూముల్లో పేదలెవరూ లేరని, అక్కడ కూల్చినవన్నీ రౌడీ షీటర్లవేనని తెలిపారు. ఆక్రమణదారుల్లో పెద్ద ఎత్తున రాజకీయ నేతలున్నారని పేర్కొన్నారు. వారిలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కుటుంబం ఉందా? లేదా? అనేది చెప్పలేమని తెలిపారు. రాజకీయ నేతలు ఎవరెవరు ఉన్నారనే వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. బుల్డోజర్లను అడ్డుకుని నిరసన తెలిపిన వారు కూడా ఆక్రమణదారుల భూములకు కాపలాగా ఉండేవారేనని చెప్పారు. కూల్చిన నిర్మాణాలన్నీ అసంపూర్తిగా ఉన్నవేనని, విద్యుత్తు మీటర్లు, తలుపులు బిగించిన ఇండ్లను కూల్చబోమని హామీ ఇచ్చారు. విద్యుత్తు కనెక్షన్‌కు అనుమతి ఇచ్చిన అధికారులపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. హైడ్రా కూల్చివేతల్లో చాలావరకు అనుమతులతో నిర్మించినవే ఉంటున్నాయని మీడియా ప్రతినిధులు గుర్తుచేయగా.. అనుమతులు ఇచ్చిన సంబంధిత శాఖల అధికారులపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

తుది నోటిఫికేషన్ ఇచ్చాకే సల్కం చెరువులో కూల్చివేతలు

సల్కం చెరువులోని ఫాతిమా స్కూల్ భవనానికి ఇప్పటివరకు ప్రాథమిక నోటిఫికేషన్ మాత్రమే ఇచ్చామని రంగనాథ్ తెలిపారు. తుది నోటిఫికేషన్ వచ్చాక నిర్మాణాలను కూలుస్తామని పేర్కొన్నారు. అక్కడ పేద పిల్లలకు ఉచితంగా చదువు చెప్తున్నారా? లేదా? అనేది తమ పరిధిలోని అంశం కాదని స్పష్టం చేశారు. చెరువులను ఎవరు కబ్జా చేసినా నిబంధనల ప్రకారమే చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రేటర్ వ్యాప్తంగా 150 చెరువులకు నోటిఫికేషన్ ఇచ్చామని చెప్పారు. నగరంలో 6 ప్రధాన చెరువులను పునరుద్ధరించి, దాదాపు 70 ఎకరాల భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు. ఇందుకోసం మరిన్ని నిధులు అవసరం అవుతాయని, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద ప్రముఖ కంపెనీలు ముందుకొస్తే బాగుంటుదని అభిప్రాయపడ్డారు.

• చట్టానికి కళ్లు లేవు.. న్యాయానికి ఇల్లు లేదు!




గాజులరామారంలో కూల్చివేసిన తమ ఇండ్ల వద్దే వంటపాత్రలను శుభ్రం చేసుకుంటున్న ఓ మహిళ

• ముల్లే సర్దుకున్న.. మూట సర్దుకున్న..



గాజులరామారంలో హైడ్రా కూల్చివేసిన తన ఇంటి నుంచి మిగిలిన సామగ్రిని తెచ్చుకుంటున్న వ్యక్తి

లోకం పోకడ



వానా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	35.9°c	23.1°c
రంగారెడ్డి	34.9°c	19.7°c
మెదక్	33.8°c	22.9°c
నిజామాబాద్	32.8°c	23.2°c
ఖమ్మం	31.0°c	23.0°c
హైదరాబాద్	30.2°c	21.2°c
కరీంనగర్	30.0°c	25.0°c
మహబూబ్‌నగర్	30.0°c	24.0°c
వరంగల్	29.0°c	23.0°c
నల్లగొండ	28.5°c	22.4°c

నేడు స్థానిక రిజర్వేషన్లు ఖరారు!

బీసీలకు 42%, ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు!

జీవో విడుదల చేయనున్న ప్రభుత్వం?

తర్వాత జిల్లాలవారీగా జాబితా ప్రకటన

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమైంది. బీసీలకు 42% రిజర్వేషన్లను కేటాయిస్తూ జీవో జారీ చేయాలని నిర్ణయించింది. ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలని సూచించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ జిల్లాలకు మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మేరకు కలెక్టర్లు 31 జడ్పీ, 565 జడ్పీటీసీ, 5,763 ఎంపీటీసీ, 12,760 సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్లను ఖరారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం అధికారికంగా ఆదేశాలు జారీచేసిన వెంటనే కలెక్టర్లు జిల్లా స్థాయిలో రిజర్వేషన్లను వెల్లడించనున్నట్టు సమాచారం. హైకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 30లోగా ఎన్నికల ప్రక్రియను ప్రారంభించి అక్టోబర్‌లో ఎన్నికలు ముగించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. రాష్ట్రంలోని 12,760 పంచాయతీలు, 1,12,534 వార్డులు, 565 జడ్పీటీసీ స్థానాలు, 5,763 ఎంపీటీసీ స్థానాలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆ తర్వాత 565 మండల పరిషత్, 31 జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ల ఎన్నికలు పరోక్ష పద్ధతిలో జరుగుతాయి. ఆదివారం కలెక్టర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, జిల్లా పంచాయతీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మంగళవారం సాయంత్రంలోగా స్థానిక సంస్థల రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

బీసీలకు ఇలా.. ఎస్సీలకు అలా!

రిజర్వేషన్లపై సర్కారు ద్వంద్వవైఖరి

బీసీలకు 2024 కులగణన ప్రకారం

ఎస్సీ, ఎస్టీలకు 2011 ప్రాతిపదికన

అమలుకు ప్రభుత్వ సూత్రప్రాయ నిర్ణయం

రెండు అంశాలకూ రాజ్యాంగపర ఇబ్బందులు

హైదరాబాద్, సెప్టెంబర్ 22(నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్ సర్కారు ద్వంద్వవైఖరి అవలంబిస్తున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బీసీలకు 2024లో కాంగ్రెస్ సర్కారు చేపట్టిన కులగణన లెక్కల ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఎస్సీ, ఎస్టీలకు మాత్రం 2011 జనాభా లెక్కల ప్రకారం పాత రిజర్వేషన్లు అమలు చేయాలని యోచిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో బీసీల మాదిరిగానే ఎస్సీ, ఎస్టీలకు సైతం 2024 కులగణన లెక్కలను ఎందుకు పరిగణనలోకి తీసుకోవడం లేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నది. కాంగ్రెస్ సర్కారు చేపట్టిన కులగణనలో బీసీలతోపాటు ఎస్సీ, ఎస్టీల జనాభాను సైతం లెక్కించింది. అలాంటప్పుడు బీసీలతోపాటు ఎస్సీ, ఎస్టీలకూ కొత్త లెక్కల ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయొచ్చు కదా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. 2024 కులగణన లెక్కల ప్రకారం రాష్ట్రంలో బీసీలు (ముస్లింలు కాకుండా) 46.25 శాతం ఉండగా, ఎస్సీలు 17.43 శాతం, ఎస్టీలు 10.45 శాతం ఉన్నట్టు తేలింది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఎస్సీ జనాభా 15.45 శాతం, ఎస్టీ జనాభా 9.08 శాతంగా ఉన్నది. అంటే 2011తో పోల్చితే 2024లో ఎస్సీ జనాభా 2 శాతం పెరగగా, ఎస్టీ జనాభా 1.37 శాతం పెరిగింది. అంటే బీసీలతోపాటు ఎస్సీ, ఎస్టీ జనాభా సైతం పెరిగిందని సర్కారు కులగణనలోనే తేలింది. అలాంటప్పుడు బీసీల మాదిరిగానే ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు ఎందుకు పెంచడం లేదనేది ప్రశ్న. బీసీ రిజర్వేషన్ల పెంపునకు, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల పెంపునకు రెండింటికీ రాజ్యాంగ పరమైన అడ్డంకులు ఉన్నాయి. అయినా బీసీల రిజర్వేషన్ల పెంపునకు ముందుకెళ్తున్న కాంగ్రెస్ సర్కారు.. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల పెంపును మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎమ్మెల్యే గాంధీ కుటుంబానికి అక్రమంగా ప్రభుత్వ భూమి బదిలీ!

- హైకోర్టులో బీఆర్ఎస్ పార్టీ నేత లక్ష్మారెడ్డి పిటిషన్
- తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయాలన్న న్యాయమూర్తి

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారం సర్వే నంబర్ 307లో దాదాపు రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని అక్రమంగా బదిలీ చేశారని, స్వయంగా రాష్ట్ర ప్రభుత్వమే 'ధరణి' పోర్టల్‌లో ఆ భూమిని ఎమ్మెల్యే గాంధీ కుటుంబసభ్యుల పేరిట చేర్చిందని బీఆర్ఎస్ నేత ఆర్ లక్ష్మారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని తీవ్రమైన చర్యగా పరిగణించాలని, ఆ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. సర్వే నంబర్ 307లోని 441 ఎకరాల్లో సీలింగ్ కింద ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నదని, మిగిలిన ప్రైవేట్ భూమిలో ఇప్పటికే పూర్తిగా ఇండ్లు వెలిశాయని పిటిషనర్ వివరించారు. ప్రస్తుతం అక్కడ ప్రైవేట్ భూమి లేదని, తమ పేరిట ఉన్న 11 ఎకరాలు ఎప్పుడో విక్రయించి వెళ్లిన జా హెద్ బేగం, షేక్ ఇమామ్, ఇశాన్ అమీన్‌ను తీసుకొచ్చి వారి భూమిని కొన్నట్టు చూపుతూ మోసానికి తెర తీశారని తెలిపారు. వాస్తవంగా ఆముగ్గురి పేరిట ఎలాంటిభూమి లేకపోయినా అక్రమ రిజిస్ట్రేషన్లతో 11 ఎకరాలను స్వాహా చేసేందుకు పథకం రచించారని వివరించారు. ఆ 11 ఎకరాలు ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వ భూమేనని పేర్కొంటూ.. 'ధరణి'లో అక్రమంగా చేర్చిన పేర్లను తొలగించాలని, ఇటీవల ఆర్డీవో జారీచేసిన నాలా ప్రొసీడింగ్స్‌ను రద్దు చేయాలని, ఆ 11 ఎకరాల్లో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం జరగకుండా అడ్డుకోవాలని కోరారు. పిటిషన్‌లో ఎమ్మెల్యే గాంధీ భార్య శ్యామలదేవి, కుమార్తె నందిత, మరో ఏడుగురు ప్రైవేట్ వ్యక్తులతోపాటు రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా కలెక్టర్, ఆర్డీవో, కుత్బుల్లాపూర్ తహసీల్దార్‌ను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై సోమవారం విచారణ చేపట్టిన జస్టిస్ లక్ష్మణ్.. అక్రమ భూబదిలీపై కుత్బుల్లాపూర్ ఎమ్మార్వోకు ఫిర్యాదు చేయాలని, ఒకవేళ ఆయన చర్యలు చేపట్టకపోతే కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపారు. అనంతరం ఎమ్మార్వోకు ఫిర్యాదు చేసే నిమిత్తం తమ పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని పిటిషనర్ తరపు న్యాయవాది తెలపడంతో అందుకు అనుమతిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

ఫిరాయింపుదార్లపై వేటు వేయాల్సిందే!

మొదటిపేజీ తరువాయి...

సంబంధించిన అఫిడవిట్లను సమర్పించారు. స్పీకర్ అందుబాటులో లేకపోవడంతో శాసనసభ కార్యదర్శికి అందజేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలె యాదయ్య, డాక్టర్ సంజయ్‌కుమార్, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డికి సంబంధించి స్పీకర్ కార్యాలయం సూచించిన మేరకు అఫిడవిట్ల రూపంలో సమాధానాలను పొందుపరిచి ఇచ్చారు. ఫిరాయించిన మరో ఇద్దరు ఎమ్మెల్యేలైన అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్‌కు సంబంధించి స్పీకర్‌కు సమర్పించిన సమాధానాలపై రిజాయిండర్లను కూడా అందజేశారు. దానం నాగేందర్, కడియం శ్రీహరికి ఇంకా స్పీకర్ నోటీసులు ఇచ్చారా.. లేదా అన్న విషయంపై స్పష్టత లేదు.

చెప్పు దెబ్బలకు సిద్ధమా?

నీటి కేటాయింపుల విషయంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అన్యాయాలను నిరూపించేందుకు తాము సిద్ధమని, ఒకవేళ నిజం నిరూపితమైతే చెప్పుదెబ్బలకు సిద్ధంగా ఉంటారా అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి జగదీశ్‌రెడ్డి సవాల్ విసిరారు. తెలంగాణ ఏర్పాటును తొలి నుంచి అడ్డుకున్నదే కాంగ్రెస్ అని, 1969 అయినా, 2009లో ఇచ్చిన తెలంగాణను వెనక్కు తీసుకోవడంలో అయినా.. ఇక్కడ జరిగిన యువత బలిదానాలకైనా కాంగ్రెస్సే కారణమని, దీనిపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని చెప్పారు. ఆల్మట్టిపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బనకచర్లపై కూడా బీఆర్ఎస్ మాట్లాడేవరకు ఎందుకు ఉలుకూపలుకూ లేకుండా ఉన్నదని నిలదీశారు. తెలంగాణ ప్రయోజనాలను ఏనాడైనా కాపాడేది ఒక్క కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీనే అని జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు.

స్పీకర్ విచారణ చేపట్టాలి

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్పీకర్ విచారణ చేపట్టాలని, వీలైనంత త్వరగా ఈ ప్రక్రియను స్పీకర్ చేపడ్తారని జగదీశ్‌రెడ్డి ఆశాభావం వ్యక్తంచేశారు. పది మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ పార్టీ బీ-ఫాంపై గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లారని, వాళ్లు ముమ్మాటికీ పదవులను కోల్పోక తప్పదని తెలిపారు. ఆ పది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారడంపై అనేక సాక్ష్యాధారాలను అఫిడవిట్ల రూపంలో స్పీకర్‌కు అందజేశామని చెప్పారు. స్పీకర్ వీలైనంత త్వరగా ఈ అంశంపై ప్రత్యక్ష కార్యాచరణకు ఉపక్రమించాల్సి ఉంటుందని అన్నారు. ప్రత్యక్ష విచారణ సందర్భంగా ఫిరాయింపు ఎమ్మెల్యేల ద్రోహాన్ని పూర్తి ఆధారాలతో బయటపెట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. స్పీకర్ నిష్పక్షపాతంతో వ్యవహరిస్తారనే ఆశిస్తున్నామని, ఫిరాయింపు ఎమ్మెల్యేలు అనర్హత వేటు నుంచి తప్పించుకోవడానికి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని, బుకాయింపులు, అబద్ధాలాడుతున్నారని ఆరోపించారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏకంగా తాను ఏ పార్టీలో ఉన్నానో తనకు తెలియదని, స్పీకర్ చెప్తాడని అంటున్నాడని పేర్కొన్నారు. మనం మాట్లాడేది ప్రజలు వింటున్నారన్న సోయి కూడా ఆయన మరిచిపోయినట్టున్నారని విమర్శించారు. అసంబద్ధమైన వాదనలు చేస్తే ప్రజలు ఈసడించుకుంటున్నారని, మంత్రులుగా, అంతకన్నా ఉన్నతమైన పదవులు అనుభవించినవాళ్లు కూడా నిస్సిగ్గుగా, నిర్లజ్జగా అబద్ధాలు మాట్లాడుతున్నారని, వారి మాటలను చూస్తుంటేనే ఎంతటి నైరాశ్యంలో ఉన్నారో అర్థమవుతున్నదని వ్యాఖ్యానించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు ప్రజల దృష్టిలో ఎప్పుడో పతనమయ్యారని చెప్పారు. ప్రజలకు, స్పీకర్‌కు, న్యాయస్థానాల కండ్లకు గంతలు కడ్తామనుకుంటే మూర్ఖత్వమే అవుతుందని వ్యాఖ్యానించారు. ఫిరాయించిన పది స్థానాల్లో మళ్లీ ఎన్నికలు రావడం ఖాయమని, ఫిరాయింపు ఎమ్మెల్యేలు మట్టికరవక తప్పదని తెలిపారు. తప్పుచేసిన వారిని శిక్షించాలన్న కోరిక ప్రజల్లో ఎక్కువగానే ఉన్నదని అన్నారు.

ఫిరాయింపులు మొదలయ్యిందే కాంగ్రెస్ నుంచి

దేశంలో ఎమ్మెల్యేలు, ఎంపీలను పార్టీల నుంచి ఫిరాయించేలా ప్రోత్సహించిందే కాంగ్రెస్ పార్టీ అని, ఆనాడు జనతాపార్టీ మొదలు ఇప్పటి తెలంగాణలో ఎమ్మెల్యేల ఫిరాయింపు వరకు పాపం మొత్తం కాంగ్రెస్‌దేనని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీ కూడా తక్కువేమీ తినలేదని, సాయంత్రం వరకు ఒక పార్టీలో ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తిని తెల్లారేసరికి చేర్చుకున్నదని విమర్శించారు. దేశ రాజకీయాలను భ్రష్టుపట్టించడంలో కాంగ్రెస్, బీజేపీలు పోటీపడ్డాయని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీలతోనే ఫిరాయింపు చట్టం సరిగ్గా అమలుకావడంలేదని ఆరోపించారు.

నీటి పంపకాల్లో అన్యాయం చేసిందే కాంగ్రెస్

రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి బుర్రలేదని అంటుంటారని, అది నిజమే అనిపిస్తున్నదని విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా జగదీశ్‌రెడ్డి చెప్పారు. తెలంగాణకు నీటివాటాల విషయంలో అన్యాయం చేసిందే కాంగ్రెస్ పార్టీ అని, రాష్ట్ర విభజన చట్టాన్ని చదువుకోవాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి హితవు చెప్పారు. కృష్ణా నీటిలో ఆంధ్రకు 511, తెలంగాణకు 299 కేటాయించింది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అప్పుడు కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీయే అధికారంలో ఉన్నదని గుర్తుచేశారు. రాష్ట్రానికి వచ్చిన వాటా నీళ్లను కూడా సరిగ్గా వాడుకోలేని అసమర్థ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నడుపుతున్నదని విమర్శించారు. ఈ విషయాన్ని కేఆర్ఎంబీనే చెప్పిందని అన్నారు.



గ్రూప్-1 పరీక్షలను మళ్లీ నిర్వహించాలని కోరుతూ సంతకాలు సేకరిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

రేవంత్ చేతకానితనంతో పరీక్షల్లో అక్రమాలు


గ్రూప్-1 రీఎగ్జామినేషన్ కోసం లక్ష సంతకాల సేకరణ : శ్రీనునాయక్

హైదరాబాద్, సిటీ బ్యూరో, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి చేతకానితనంతోనే గ్రూప్-1 రాత పరీక్షల్లో అక్రమాలు జరిగాయని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనునాయక్ విమర్శించారు. ప్రభుత్వం గ్రూప్-1 రాత పరీక్షను రద్దు చేసి.. రీ ఎగ్జామినేషన్ నిర్వహించాలని బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో లక్ష సంతకాల సేకరణ చేపట్టినట్టు ఆయన వెల్లడించారు. సోమవారం చిక్కడపల్లి సిటీ సెంట్రల్‌లో కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు గ్రూప్-1 పోస్టులను అమ్ముకోవడంతో ఎన్నో ఏండ్లుగా పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు తీవ్ర నష్టం జరిగిందని మండిపడ్డారు. కేసులో నిందితులను శిక్షించడానికి లక్ష మంది నిరుద్యోగుల సంతకాలను సేకరించి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి అందించనున్నట్టు పేర్కొన్నారు.

అశోక్ దీక్షకు మద్దతుగా నిరుద్యోగుల ధర్నా

ప్రభుత్వం స్పందించాలని డిమాండ్

సుల్తాన్‌బజార్,సెప్టెంబర్ 22: నిరుద్యోగులకు ఉద్యోగాలను కల్పించడమే లక్ష్యంగా 9 రోజులుగా అశోక్ చేపడుతున్న నిరాహార దీక్షకు సిటీ సెంట్రల్ లైబ్రరీ నిరుద్యోగులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం ఉస్మానియా దవాఖాన ఆవరణలో నిరుద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈక్రమంలో నిరుద్యోగులు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా పలువురు నిరుద్యోగులు మాట్లాడుతూ.. అశోక్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నదని, 9రోజులుగా దీక్ష చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. తక్షణమే ప్రభు త్వం అశోక్‌తో చర్చలు జరిపి, ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. అశోక్ ప్రాణాలకు హాని జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఆ తర్వాత పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో నిరుద్యోగులు వెంకటేశ్, శంకర్‌నాయక్, గణేశ్, ప్రత్యూష, ఇంద్ర, అనిల్, అప్పు, సురేశ్, సంపత్, మధు పాల్గొన్నారు.



దీక్ష చేస్తున్న అశోక్‌కు మద్దతుగా ఉస్మానియాలో ధర్నా నిర్వహిస్తున్న సిటీ సెంట్రల్ లైబ్రరీ నిరుద్యోగులు



సోమవారం తెలంగాణ భవన్‌లో ట్రిపుల్ ఆర్ బాధితుల సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బొల్లం మల్లయ్య, చిరుమర్తి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, బీఆర్ఎస్ నాయకులు సుర్వి యాదయ్యగౌడ్

మోసం చేసిన సర్కార్‌ను గల్లా పట్టి అడగాలె

ఐక్యంగా ఉండండి.. ప్రభుత్వాన్ని నిలదీయండి

- ట్రిపుల్ ఆర్ బాధిత రైతులకు అండగా ఉంటం
- చట్టసభల్లో నిలదీస్తాం.. కోర్టులో కొట్లాడుతం
- న్యాయం కోసం స్థానిక ఎన్నికలు బహిష్కరించండి
- ప్రియాంకతో మాట ఇప్పించి తప్పడం దుర్మార్గం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం
- కేటీఆర్‌ను కలిసి గోడు వెళ్లబోసుకున్న 400 మంది

> ప్రాజెక్టులు, వివిధ అభివృద్ధి పనులకు ఏ ప్రభుత్వమైనా భూ సేకరణ చేయాల్సి ఉంటది. కేసీఆర్ పాలనలో మల్లన్నసాగర్‌తో పాటు అనేక ప్రాజెక్టుల నిర్మాణ సందర్భాల్లో రైతులను ఒప్పించి, మెప్పించి, మెరుగైన పరిహారమిచ్చి, పునరావాసం కల్పించి భూములు సేకరించినం. మంత్రులు, ప్రజాప్రతినిధులు రాత్రింబవళ్లు చర్చించి రైతులకు నచ్చజెప్పి ముందుకెళ్లిండ్రు. ఏనాడూ దౌర్జన్యం చేయలే.. -కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ట్రిపుల్ ఆర్ బాధితుల కష్టాలు..కన్నీళ్లు తమకు తెలుసుననీ, వారికి బీఆర్ఎస్ తరఫున అండగా ఉంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసా ఇచ్చారు. పార్లమెంట్, అసెంబ్లీలో సర్కారును నిలదీస్తామని, అవసరమైతే న్యాయపోటం చేస్తామని, ప్రజాక్షేత్రంలోనూ బరిగీసి కొట్లాడుతామని స్పష్టంచేశారు. బాధితులు చెల్లాచెదురు కావద్దని, మోసం చేసిన సర్కారును గల్లాపట్టి అడగాలని హితబోధ చేశారు. ఐక్యంగా ఉండి రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తే సర్కారు దిగొస్తుందని తేల్చిచెప్పారు. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్ మార్పుతో నష్టపోయిన సూర్యాపేట, నల్లగొండ, గజ్వేల్, సంగారెడ్డి నియోజకవర్గాలకు చెందిన సుమారు 400 మంది బాధితులు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి నేతృత్వంలో సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. కాంగ్రెస్ సర్కారు ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చడంతో తమకు జీవనాధారమైన భూములను కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. తమకు అండగా నిలిచి ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరగా కేటీఆర్ సానుకూలంగా స్పందించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ట్రిపుల్ ఆర్ కోసం రైతుల భూములు గుంజుకోబోమని కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంక గాంధీతో హామీ ఇప్పించారని గుర్తుచేశారు. ఓట్లు డబ్బాలో పడగానే రేవంత్ సర్కారు అరాచకానికి తెరలేపిందని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో రూపొందించిన అలైన్‌మెంట్‌ను మార్చి రైతులకు తీరని అన్యాయం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. నామమాత్రపు పరిహారమిచ్చి విలువైన భూములు గుంజుకొనేందుకు యత్నిస్తున్నదని ఫైర్ అయ్యారు.

నాడు ఒప్పించి మెప్పించి తీసుకున్నం

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మల్లన్నసాగర్‌తో పాటు అనేక ప్రాజెక్టుల కోసం రైతులను ఒప్పించి, మెప్పించి, మెరుగైన పరిహారం, పునరావాసం కల్పించి భూములు సేకరించామని కేటీఆర్ గుర్తుచేశారు.ఎంతో శ్రమకోర్చి నీటిపారుదల ప్రాజెక్టులు నిర్మించడం వల్లే రైతుల భూముల విలువ పెరిగిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ గద్దెనెక్కిన తర్వాత అన్నివర్గాల తరహాలోనే రైతులను కూడా అతలాకుతలం చేస్తున్నదని నిప్పులు చెరిగారు. 'ఒడ్డెక్కే దాకాఓడ మల్లన్న.. ఒడ్డెక్కినంక బోడమల్లన్న' అన్న చందంగా నమ్మి ఓటేసిన పేద రైతుల భూములను గుంజుకుంటున్నదని మండిపడ్డారు. ఎకరాకు రూ. 26 లక్షల పరిహారం ఇస్తామని చెప్పి ఇప్పుడు రూ.6 లక్షలకు కుదించిందని, ఓటేసిన పాపానికి పచ్చని విలువైన భూములను లాక్కొని రైతుల బతుకులను ఛిద్రం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఎన్నికలు వద్దని తీర్మానించండి

ట్రిపుల్ ఆర్ బాధిత గ్రామాల రైతులంతా ఏకమై వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. గ్రామ చావిడి వద్దకు అన్ని పార్టీల నాయకులను పిలిచి వారి అభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు. తద్వారా ఈ విషయం కేంద్రం, కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టికి వెళ్తుందని చెప్పారు. బాధిత రైతుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

పార్లమెంట్‌లో లేవనెత్తుతం

ట్రిపుల్ ఆర్ బాధితుల సమస్యలను రాజ్యసభలో తమ నలుగురు బీఆర్ఎస్ సభ్యులు లేవనెత్తుతారని కేటీఆర్ హామీ ఇచ్చారు. సర్కారు అసెంబ్లీ నిర్వహిస్తే తాము సైతం బాధితుల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. కాంగ్రెస్ నేతల మాయమాటలను నమ్మితే నిండా మునిగేది బాధితులేనని హెచ్చరించారు. శాస్త్రబద్ధమైన అలైన్‌మెంట్ రూపొందించేదాకా రైతుల తరఫున పోరాడతామని స్పష్టంచేశారు. 'తెలంగాణ భవన్ జనతా గ్యారేజీలా మారింది..బాధితులు ఎప్పుడైనా రావొచ్చు..మా లీగల్ టీంను సంప్రదించి న్యాయ సహాయం పొందవచ్చు' అని స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు దుర్గం చిన్నయ్య, బొల్లం మల్లయ్య, కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, బీఆర్ఎస్ నాయకులు సుర్వి యాదయ్య గౌడ్, శుభప్రద్ పటేల్, అబ్రెట్ రాములు, లీగల్ సెల్ మెంబర్ లలిత పాల్గొన్నారు.

> కాంగ్రెస్ సర్కారు నమ్మి ఓటేసిన పేద రైతుల భూములను గుంజుకుంటూ నోటికాడి బుక్కను ఎత్తగొడుతున్నది. అధికార నేతల కోసం బక్క రైతులను అరిగోస పెడుతున్నది. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చవద్దని ఎన్నిసార్లు చెప్పినా పెడచెవిన పెడుతున్నది. ఎకరాకు రూ.26 లక్షల పరిహారం ఇస్తామని చెప్పి రూ.6 లక్షలకు కుదించింది. -కేటీఆర్

జెండా కాంగ్రెస్‌ది.. ఎజెండా బీజేపీది

- రాష్ట్రంలో బడే..చోటే భాయ్‌ల జాయింట్ వెంచర్
- తెలంగాణలో బుల్డోజర్ రాజ్‌తో అరాచకాలు
- పథకాలకు చరమగీతం.. ప్రజలకు నిలువునా మోసం
- పెద్దలకో న్యాయం.. పేదోలకు మరో న్యాయం
- రేవంత్ సర్కారు అసమర్థతో అన్ని వర్గాలు ఆగం
- మోసం చేసిన మోదీ పండుగ చేసుకోవాలంటుండు
- బోరబండ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ధ్వజం

> ఇందిరమ్మ రాజ్యం తెస్తానన్న రేవంత్ బుల్డోజర్ రాజ్యం తెచ్చిండు. హైకోర్టు ఆదేశాలను ధిక్కరించి శని, ఆదివారాల్లో పేదల ఇండ్లపైకి హైడ్రా బుల్డోజర్లను పంపుతూ అరాచకం సృష్టిస్తున్నడు. చెరువు శిఖం భూముల్లో ఉన్న ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతిరెడ్డి, మంత్రులు వివేక్, పొంగులేటి, కాంగ్రెస్ నేతలు కేవీపీ, మహేందర్ రెడ్డి ఇండ్లను వదిలి పేదల నివాసాలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్నరు. -కేటీఆర్



సోమవారం తెలంగాణ భవన్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమావేశంలో కేటీఆర్ ఎదుట తమ గోడు వెల్లబోసుకుంటున్న సర్దార్ కుటుంబ సభ్యులు, చిత్రంలో వివేకానంద, శంభీపూర్‌రాజు, మాగంటి సునీత తదితరులు

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వం.. హస్తం పార్టీ ముసుగులో ఆర్ఎస్ఎస్ పాలన నడుస్తున్నదని, జెండా కాంగ్రెస్‌దైతే ఎజెండా బీజేపీదని, బడే భాయ్, చోటే భాయ్ జాయింట్ వెంచర్ ప్రభుత్వం కొనసాగుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 11 ఏండ్లుగా అధికారంలో ఉంటూ, ఎనిమిదేండ్లుగా జీఎస్టీ పేరిట ప్రజలకు వాతలు పెట్టిన మోదీ..ఇప్పుడు తగ్గించి పండుగ చేసుకోవాలనడం విడ్డూరంగా ఉన్నదని ధ్వజమెత్తారు. అంతర్జాతీయస్థాయిలో చమురు ధరలు తగ్గినా మనదేశంలో మాత్రం మోదీ చమురు ధర తగ్గించలేదని చెప్పారు. సోమవారం తెలంగాణ భవన్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బోరబండ డివిజన్ బూత్‌స్థాయి మీటింగ్‌కు కేటీఆర్ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ రెండేండ్ల పాలనలో అన్ని రంగాలు, సబ్బండ వర్గాలు మోసపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ఆచరణలో మాత్రం విఫలమైందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 700 రోజులైనా యువతులకు స్కూటీలు ఇవ్వలేదని, పింఛన్లు పెంచలేదని ఫైర్ అయ్యారు. నిధుల్లేవని సాకులు చెప్తూ తప్పించుకొనే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. కరోనా కష్టకాలంలోనూ కేసీఆర్ ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా ఆపలేదని కేటీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క పథకం కూడా అమలు కావడం లేదని విమర్శించారు.

మొక్కిన దర్గానే కూల్చిన ఘనుడు రేవంత్..

ఓట్ల కోసం పచ్చని తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ చిచ్చు పెడుతున్నాయని కేటీఆర్ మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో ఏ చిన్న మతకలహాలు జరగలేదని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కొడంగల్‌లో ఆయన గతంలో మొక్కిన దర్గానే కూల్చివేయించారని దుయ్యబట్టారు. బీజేపీ మెప్పు కోసమే ఈ దుర్మార్గానికి ఒడిగట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పీఆర్సీ ఇవ్వాలని అడిగిన ఉద్యోగులతో తనను కోసుకొని తిన్నా నయాపైసా రాలదని చెప్పడం ఆయన కుసంస్కారానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇలాంటి సీఎంకు ఓటుతో జూబ్లీహిల్స్‌లో బుద్ధి చెప్పాలని ఓటర్లకు పిలుపునిచ్చారు.

ఏం ఉద్ధరించారని పండుగ?

జీఎస్టీ తగ్గించినం పండుగ చేసుకోండని మోదీ చెప్పడం విడ్డూరంగా ఉన్నదని, మోదీ ఏం ఉద్ధరించారని పండుగ చేసుకోవాలని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రధాని మోదీ మాటలు చెప్పడం తప్ప చేసిందేమీలేదని విమర్శించారు. ఆయనకు నిజంగా ఈ దేశంపై ప్రేమ ఉంటే అమెరికా పెంచిన హెచ్-1బీ వీసా దరఖాస్తు రుసుంపై ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. ఎనిమిదేండ్లుగా జీఎస్టీ పేరిట పన్నుల భారం మోపి పేదలను మోసం చేసిన ఆయన ఇప్పుడు తగ్గించి ఏదో సాధించినట్టు చెప్పుకోవడం సిగ్గుచేటని, నిజంగా ప్రధానికి చిత్తశుద్ధి, నిజాయతీ ఉంటే గ్యాస్ సిలిండర్, పెట్రోల్‌పై ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

అక్టోబర్‌లో భూసేకరణ పూర్తిచేయాలి

- కోర్టు కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టండి
- ట్రిపుల్ ఆర్‌పై సమీక్షలో కలెక్టర్లకు సీఎం ఆదేశం



హైదరాబాద్, సెప్టెంబర్ 22(నమస్తే తెలంగాణ): రీజినల్ రింగ్‌రోడ్డు (ట్రిపుల్‌ఆర్) ఉత్తర, దక్షిణ భాగాలతోపాటు రేడియల్ రోడ్ల నిర్మాణానికి అక్టోబర్ చివరిలోగా భూసేకరణ పూర్తిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కోర్టు పరిధిలో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ప్రాజెక్టులపై సీఎం సోమవారం సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ జిల్లాలకు చెందిన కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని, భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని కలెక్టర్లను ఆదేశించారు. ట్రిపుల్‌ఆర్ ఉత్తర, దక్షిణ భాగాలతో పాటు రేడియల్ రోడ్ల నిర్మాణంపై అధికారులకు పలు సూచనలు చేశారు. హైదరాబాద్ నుంచి బందరు పోర్టు వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం అంశంపై మాట్లాడుతూ, వీలైనంత త్వరగా రూట్‌మ్యాప్‌పై తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. అలాగే, హైదరాబాద్- శ్రీశైలం హైవేలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్రం నుంచి వీలైనంత త్వరగా అనుమతులు తీసుకోవాలని చెప్పారు. ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు తదితరులు సమీక్షలో పాల్గొన్నారు.

25 వేలు ఇస్తేనే ఇందిరమ్మ ఇల్లు!

సిర్సవాడలో కాంగ్రెస్ నేత డిమాండ్

తాడూరు, సెప్టెంబర్ 22 : ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు ఓ కాంగ్రెస్ నాయకుడు రూ.25 వేలు డిమాండ్ చేసిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకున్నది. తాడూరు మండలం సిర్సవాడకు చెందిన నిరుపేద ఏదుల భీమమ్మ పాత రేకుల ఇంటిలో నివాసం ఉంటున్నది. ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నది. ఆ తర్వాత ఇల్లు మంజూరైందని కాంగ్రెస్ నాయకుడు మల్లేశ్ ఆమెకు ఫోన్ చేసి చెప్పడంతోపాటు 25వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. డబ్బులు అడుగుతుండటంతో 10 వేలు మల్లేశ్‌కు ఇచ్చింది. తర్వాత ఇల్లు బేస్‌మెంట్ వరకు నిర్మాణం జరిగింది. ఈ స్థల విషయమై భీమమ్మ, ఆమె బావకు గొడవ జరిగింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నేత ఆమె బావతో కలిసి మిగతా 15 వేలు ఇవ్వాలని, లేకుంటే పనులను అడ్డుకుంటామని బెదిరిస్తున్నారని ఆమె వాపోయింది.

రేవంత్ పాలనలో మైనార్టీలకు రక్షణ కరువు

- కొడంగల్‌లో దర్గాలు, శ్మశానవాటికల కూల్చివేత దుర్మార్గం
- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మైనార్టీ నేత ముఖీద్‌చాందా



హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో మైనార్టీలకు రక్షణ కరువైందని బీఆర్ఎస్ నేత ముఖీద్‌చాందా ఆందోళన వ్యక్తంచేశారు. కొడంగల్‌లో దర్గాలు, ముస్లింల శ్మశానవాటికలు కూల్చడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం నియోజకవర్గంలోనే ఈ పరిస్థితి ఉంటే రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో పరిస్థితి ఏంటి? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ సెక్యులరిజాన్ని మంటగలుపుతున్నదని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక రాష్ట్రంలో 50చోట్ల మతకలహాలు జరిగాయని ఆరోపించారు. కాంగ్రెస్ మైనార్టీ డిక్లరేషన్ కూల్చివేత డిక్లరేషన్‌గా మారిందని ఎద్దేవా చేశారు. మొయినాబాద్‌లో మసీదు కూల్చినవారిపై, సంగారెడ్డి, మెదక్, నారాయణపేట, వనపర్తి జిల్లాల్లో మదర్సాలపై దాడులు చేసినవారిపై చర్యలు లేవని మండిపడ్డారు. కొడంగల్‌లో కూల్చివేతలపై సీఎం రేవంత్‌రెడ్డి మైనార్టీలకు క్షమాపణ చెప్పి కూల్చిన కట్టడాలను వెంటనే పునర్నిర్మించాలని, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ సలీం మాట్లాడుతూ.. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే ముస్లింల పవిత్రస్థలాలపై అధికార యంత్రాంగం దాడి చేసి వక్ఫ్ చట్టాన్ని ఉల్లంఘించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో కొత్త దేవాలయాలు, మసీదులు కడితే రేవంత్‌రెడ్డి పాలనలో కూలుస్తున్నారని మండిపడ్డారు.

రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలి: జాన్‌వెస్లీ



షాద్‌నగర్ రూరల్, సెప్టెంబర్ 22: రీజినల్ రింగ్ రోడ్డు కొత్త అలైన్‌మెంట్ మార్చాలని.. లేదంటే రైతులతో కలిసి విస్తృతంగా ఆందోళనలు చేపడుతామని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్‌వెస్లీ హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా ఫారుక్‌నగర్ మండలంలోని అయ్యవారిపల్లి, చించోడ్, బీమారం, ఉప్పరిగడ్డ తండా పరిసర ప్రాంతాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. రీజినల్ రింగ్‌రోడ్డు కోసం మొదటిసారి చేసిన అలైన్‌మెంట్ ప్రకారమైతే రైతులు తమ భూములను నష్టపోయే పరిస్థితి లేదని అన్నారు. అయితే కాంగ్రెస్ నాయకులు వారి స్వలాభాల కోసం అలైన్‌మెంట్ మార్చడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. కొత్తగా ఇచ్చిన మార్కింగ్‌తో 300 మంది చిన్న,సన్నకారు రైతులు నష్టపోతున్నట్టు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పాత అలైన్‌మెంట్ ప్రకారం భూసేకరణ జరపాలని కోరారు.

ట్రిపుల్ ఆర్‌కు కొత్త లైన్‌మెంట్ వద్దు

- రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టీ సాగర్ డిమాండ్
- రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో భూనిర్వాసితుల సదస్సు



ఆమనగల్లు, సెప్టెంబర్ 22: గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిన అలైన్‌మెంట్ ప్రకారమే ట్రిపుల్ ఆర్ నిర్మించాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టీ సాగర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలోని ఓ గార్డెన్‌లో సోమవారం ఆమనగల్లు, తలకొండపల్లి, మాడుగుల మండలాల్లో రీజినల్ రింగ్ రోడ్డు భూనిర్వాసితుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. పెద్దల భూములు కాపాడటం కోసం, రియల్ ఎస్టేట్ వ్యాపారుల లబ్ధికోసం కాంగ్రెస్ ప్రభుత్వం అలైన్‌మెంట్ మార్చడం సరికాదన్నారు. రింగ్ రోడ్డు అంటే రింగులాగా ఉండాలి కాని వంకర, వంకరలుగా ఎందుకు మారిందో రేవంత్‌రెడ్డి బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు రక్షణగా ఉండకుండా పెట్టుబడిదారులకు మద్దతుగా నిలబడటం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగారెడ్డి మాట్లాడుతూ.. రైతులంతా ఐక్యంగా ఉంటూ ప్రభుత్వంపై పోరాడాలని పిలుపునిచ్చారు.

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

హెచ్-1బీ వీసా సంక్షోభం

అమెరికా ఉద్యోగానికి రాజ ద్వారం వంటి హెచ్-1 బీ వీసా చిక్కుల్లో పడింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ వీసా ఫీజును ఉన్న పళంగా ఇరువై రెట్లకు పైగా, అంటే లక్ష డాలర్లకు పెంచడం ఒకరకంగా భారతీయ నిపుణులకు అమెరికా తలుపులు మూసివేసే చర్య కిందకు వస్తుందని చెప్పవచ్చు. ట్రంప్ భారత్‌పై అస్త్రాలు సంధించడం ఇదే మొదటిసారి కాదు. రెండో విడత అధికారం చేపట్టినప్పటి నుంచీ ఆయన భారత్‌ను లక్ష్యంగా చేసుకొని మెడలు వంచే చర్యలు చేపడుతున్నారు. హెచ్-1 బీ వ్యవహారం ఆ పరంపరలోనిదే అయినప్పటికీ కొంచెం భిన్నమైంది. ఇతర దేశాలపైనా దీని ప్రభావం ఉన్నప్పటికీ ఇది ప్రత్యేకించి భారతీయులను లక్ష్యంగా చేసుకొని ప్రయోగించిన అస్త్రమనేది పైకి తెలిసిపోతూనే ఉన్నది. ఎందుకంటే హెచ్-1బీ వీసా లబ్ధిదారుల్లో సింహభాగం భారతీయులే. కంపెనీ వ్యాపారం, పరిమాణం బట్టి 2,000 నుండి గరిష్టంగా 5,000 డాలర్ల వరకు చెల్లిస్తున్న ఫీజును లక్షకు పెంచుతూ జారీచేసిన ఫర్మానా భారతీయ ఆశావహులకు దడ పుట్టించి, చెమటలు పట్టించి, పరుగులు పెట్టించింది. ఈసరికే హెచ్-1బీ వీసా మీద ఉద్యోగాలు చేస్తున్నవారు గందరగోళానికి, భయాందోళనకు గురయ్యారు. సెలవుపై ఉన్నవాళ్లు, ఉద్యోగాలు కాపాడుకోవడానికి అమెరికాకు పరుగులు తీశారు. వారి తత్తరపాటు ఫలితంగా విమానాలు ఆలస్యం కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. భారతదేశంలో వృత్తి విద్యను అభ్యసించేవారు లేదా అమెరికాలో పై చదువులు చదివి అక్కడే ఉద్యోగం సంపాదించాలని ఆశించేవారికి హెచ్-1 బీ అనేది నిన్నటిదాకా ఓ అందమైన కల. ట్రంప్ ఫర్మానాతో అది పీడకలగా మారింది.

అమెరికా ప్రభుత్వం ఈ క్యాటగిరీలో 2004 నుంచి ఏటా 85 వేల వీసాలు జారీ చేస్తున్నది. ఈ కోటాలో 72 శాతం భారతీయులే సొంతం చేసుకుంటారు. ఎన్నారైలు పంపిన డాలర్ భారతీయ ఆర్థికవ్యవస్థకు ఊతమిస్తున్నది. జీడీపీలో అది 3 శాతం వరకు ఉంటుంది. 2023లో ఎన్నారైలు రూ.12,500 కోట్ల డాలర్లు పంపారు. భారతీయ ఆర్థికవ్యవస్థకు, కోట్లాది కుటుంబాలకు ఇది జీవనాధారంగా మారింది. ఇప్పుడా డాలర్ల ప్రవాహానికి అడ్డంకులు ఎదురయ్యే ప్రమాదమున్నది. ఫీజు పెంపు తీవ్ర గందరగోళానికి దారితీసిన నేపథ్యంలో ట్రంప్ సర్కారు పాతవారికి ఫీజు పెంపు ఉండదని, కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు మాత్రమే లక్ష డాలర్ల ఫీజు చెల్లించాలని వివరణ ఇచ్చింది. హెచ్-1 బీ వీసాదారుల్లో 60 శాతం మంది వార్షిక వేతనం లక్ష డాలర్లలోపే ఉంటుంది. అలాంటివారి వీసా కోసం లక్ష డాలర్లు చెల్లించమంటే కంపెనీలు ఎక్కడి నుంచి తెస్తాయి? కంపెనీలు వారిని ఎంచుకోవాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిందే. దీంతో ఇక విదేశీయులు, ముఖ్యంగా భారతీయులు, హెచ్-1 బీ వీసా గురించి మరిచిపోవాల్సిన పరిస్థితి ఎదురవుతున్నది.

భారత విదేశాంగ శాఖ ఈ వ్యవహారంపై స్పందిస్తూ, ఫీజు పెంపు వల్ల 'మానవీయ విపరిణామాలు' ఎదురవుతాయని బేలగా చెప్పడం మోదీ ప్రభుత్వం గత పదేండ్లుగా అనుసరిస్తున్న దౌత్య విధానాల వైఫల్యాన్ని ఎత్తి చూపుతున్నది. ఎంతో దూరదృష్టి, చాకచక్యం అవసరమయ్యే దౌత్యనీతిని వ్యక్తిగత ప్రచార సాధనంగా మార్చడం, 'విశ్వగురు'గా ఊదరగొట్టుకోవడం అనేవి ఏ మాత్రం ఫలితాలివ్వకపోగా ప్రతికూలంగా పరిణమించడాన్ని మనం చూస్తున్నాం. మోదీ ఖరీదైన అంతర్జాతీయ పర్యటనలు సాధించిందేమీ లేదు. కరచాలనలు, కౌగిలింతలు, ఫొటోలు దిగడాలు దౌత్యం కాదు. ఇవాళ దక్షిణాసియాలోని ఇరుగు పొరుగు దేశాల మధ్యన ఇండియా ఏకాకిగా మిగిలింది. శ్రీలంక, నేపాల్, మాల్దీవ్స్, బంగ్లాదేశ్.. ఇలా ఒక్కొక్క దేశమే దూరమవుతున్నది. మనకిప్పుడు మిగిలిన మిత్రదేశం తాలిబన్ల పాలనలోని అఫ్ఘానిస్థాన్ మాత్రమే. చాప కింద నీరులా చైనా ప్రభావ పరిధి పెరిగుతూ భారత్ స్నేహ సంబంధాలు నానా టికీతీసికట్టుగా తయారయ్యాయి. ఇక అగ్రరాజ్యం అమెరికా విషయానికి వస్తే, 'అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్' అని గతంలో మోదీతో ప్రచారం చేయించుకున్న ట్రంప్ ఇప్పుడు భారత్‌ను నానారకాలుగా ఇబ్బందుల పాలు చేస్తున్నారు. 50 శాతం ప్రతీకార టారిఫ్ విధించడం పెద్ద సమస్యే. ఇలాంటి సంక్షోభాలు ఎదురైనప్పుడు ప్రభుత్వాలు చర్చల ద్వారా సామరస్యపూర్వక పరిష్కారాన్ని కనుగొనాలి. గతంలో అణుఒప్పందాల కోసం అమెరికాతో అప్పటి మన్‌మోహన్ సింగ్ ప్రభుత్వం జరిపిన లోతైన సంప్రదింపులు ఈ సందర్భంగా గుర్తు చేసుకోవచ్చు. కానీ ట్రంప్ టారిఫ్ లు బాదినప్పుడు ప్రధాని మోదీ చర్చలు జరిపేందుకు బదులుగా చైనా, రష్యాలకు దగ్గరైన భావన కల్పించడంతో ట్రంప్ మరింత రెచ్చిపోయారు. దాని ఫలితమే ప్రస్తుత పరిణామాలు. అంతర్జాతీయ దౌత్య సంబంధాలకు వాణిజ్యమే కీలకం. అసలైన అర్థంలో ఏ దేశమూ మరో దేశానికి మిత్రదేశం కాదు, శత్రుదేశమూ కాదు. స్వీయ ప్రయోజనాలే సర్వోన్నతమైనవి. దీర్ఘకాలిక దృష్టితో దౌత్య విధానాలు రూపొందించుకొని, ప్రత్యామ్నాయాల గురించి కేంద్రం ఆలోచించకపోతే హెచ్-1 బీ తరహా విఘాతాలు ఎదురవుతూనే ఉంటాయి.

అలెగ్జాండర్ దాడి కేసీఆర్ వల్లే!

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నిసార్లు ఢిల్లీకి వెళ్లారో తెలియదు గాని, తన ప్రతి ప్రయాణం ఎంతో వినోదాన్ని కలిగిస్తుంటుంది. అక్కడ ఆయన మాట్లాడే తీరు ఇక్కడ స్వరాష్ట్రంలో మాట్లాడేదానికి భిన్నం. అటువంటి భిన్నత్వాలకు మూలం తన సైకాలజీలో కనిపిస్తుంది. ఒక నాయకుని సైకాలజీ, మాటల తీరుపై ఆయన ఎక్కడ మాట్లాడుతున్నారనే స్థల ప్రభావం కూడా కొంత ఉంటుంది. ఆ విధంగా చూసినప్పుడు రేవంత్ రెడ్డి స్వరాష్ట్రంలో, ఇక్కడి నేల, గాలి, ప్రజలు, పార్టీవారు, నాయకులు, ప్రత్యర్థుల మధ్య ఉన్నప్పుడు ఎంతో ధైర్యంగా, పూర్తిగా తన సహజ స్వభావానికి అనుగుణంగా, ఎంతైనా రెచ్చిపోయి మాట్లాడగలరు. కానీ, ఢిల్లీ వంటి చోట్ల భావార్థాలు అవే అయినా కొంత భిన్నంగా మాట్లాడవలసి వస్తుంది.



టంకశాల అశోక్

ఇటువంటి కోణాలపై పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్లు పరిశోధిస్తాయో లేదో తెలియదు. కానీ వారు, సైకాలజీ డిపార్ట్‌మెంట్ వారు కలిసి అధ్యయనం జరిపితే ఆసక్తికరమైన విషయాలు చాలా తెలుస్తాయి. ఒక చిన్న ఉదాహరణను చూద్దాం. ఆయన ఈ నెల 19న ఢిల్లీలో పబ్లిక్ అఫైర్స్ ఫోరం ఆఫ్ ఇండియా (పీఏఎఫ్ఐ) 12వ వార్షిక సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అక్కడ తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్ గురించి, ఫ్యూచర్ సిటీ గురించి, అటువంటి మరికొన్ని విషయాల గురించి సదస్యులకు వివరించారు. ఆ స్థాయి వారికి ఇటువంటివి తెలియపరచటం ఎంతో అభినందించదగినది. కనీసం తన ఆలోచనల ప్రకారం అవన్నీ తాను ఉద్దేశిస్తున్నవీ, మరొక రెండు పర్యాయాలు అధికారానికి వచ్చి అమలు చేయ గోరుతున్నవీ అయినందున అటువంటి వివరణలు తప్పక అవసరమైనవే. కనుక ముఖ్యమంత్రిని అభినందించాలి.

ఆ విషయం అట్లుంచితే, ఢిల్లీ వంటి చోట్ల మాట్లాడటం, ప్రముఖ కంపెనీల ఉన్నతాధికారుల మధ్య ప్రసంగించటం అనే స్థల ప్రభావాలు రేవంత్ రెడ్డి సైకాలజీపై ప్రభావం చూపటమన్నది గమనించాల్సిన విషయం. అక్కడ ఆయన అకస్మాత్తుగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గురించిన ప్రస్తావన చేశారు. ట్రంప్ విధానాలు, వాటిలోని పరస్పర వైరుధ్యాలు, ప్రధాని మోదీ గురించి ఆయన రకరకాల వ్యాఖ్యలు, సుంకాల విధింపు పద్ధతుల గురించి విమర్శనాత్మకంగా వ్యాఖ్యానించారు. అవన్నీ బాగున్నాయి. ముఖ్యంగా ట్రంప్ సుంకాలను ప్రస్తావించటం ఆ వాణిజ్య వర్గాల వారికి మెచ్చదగినదిగా తోచవచ్చునని తనతో పాటు తన సలహాదారులైన అధికారులు భావించి ఉంటే అది మంచిదే. కానీ సరిగా అక్కడ, రేవంత్ రెడ్డి ఆ సభ, ఆ సదస్యులను బట్టి కృత్రిమంగా తెచ్చి పెట్టుకున్న సంస్కారయుతమైన ముఖోటా నుంచి తన నిజ సంస్కారం వెలికి వచ్చింది. అట్లా రావటంతో ఆయన, తెలంగాణలోనూ ఒక ట్రంప్ ఉన్నారని, తనను ప్రజలు ఇంటికి పంపారని సదస్యులకు తెలియపరిచారు.

> **రేవంత్ రెడ్డి ఉద్దేశించిన తెలంగాణ ట్రంప్ ఎవరో చెప్పనక్కరలేదు. అట్లా పోల్చినందుకు యథాతథంగా ఆక్షేపించనక్కరలేదు. ఆ పోలికకు సమర్థనగా ఏవైనా వివరణలు ఇచ్చినట్టయితే. వాటిని ఎవరైనా ఆమోదించవచ్చు, ఆమోదించకపోవచ్చు. కానీ వివరణలు అంటూ ఇవ్వాలి. ఆ తరహా పోలికను రేవంత్ రెడ్డి చేయటం ఇది మొదటిసారి. అందువల్ల, ఒకవేళ ఢిల్లీ సదస్సులో అందుకు సమయం లేకపోతే ఆ పని ఇప్పటికైనా చేసినట్టయితే మనం కేసీఆర్ గురించి కొత్త అవగాహనలు తెచ్చుకోవచ్చు.**

ట్రంప్, కేసీఆర్‌ల మధ్య ఇటువంటి పోలికలు ఉన్నాయన్న మాట అనుకోవచ్చు. ప్రస్తుతానికి ఒకటి కనిపిస్తున్నది. రేవంత్ రెడ్డికి ట్రంప్ గురించి, ఆయన విధానాల గురించి, వాటి నేపథ్యాల గురించి పైపైన ఏవో నాలుగు ముక్కలు వినటం మినహా అవగాహన లేదు. కేసీఆర్ పట్ల పట్టరాని విద్వేషం, దానితో పాటు లోలోపల ఆయనంటే భయం కూడా ఉన్నాయి గనుక సందర్భం ఉన్నా లేకపోయినా, అతికినా, అతకకున్నా, ఆ విద్వేషాన్ని కక్కుతూ ఉండాలి. మనిషి ఒక స్థితికి బందీ అయి పోయినప్పుడు బలహీనుడిగా మారి, అంతకన్న భిన్నంగా వ్యవహరించలేడు. బలహీనతలే తనను నియంత్రించి నడుపుతాయి.

ఇందులో సైకాలజీ ఎక్కడ వస్తున్నదంటే, ఒక వ్యక్తికి మరొక వ్యక్తి పట్ల సకారణంగానైనా, నిష్కారణంగానైనా వ్యతిరేకత, భయం అన్నవి ఒక పరిమితిని దాటినప్పుడు విద్వేషంగా మారుతాయి. ఆ విద్వేషం పెరిగే క్రమంలో విచక్షణను కోల్పోతాడు. అట్లా కోల్పోయినప్పుడు స్థల, కాల సందర్భ విచక్షణ ఉండదు. భాషా విచక్షణ ఉండదు. పైన పేర్కొన్నటువంటి సదస్సుల సమయంలో అవసరార్థం కొంత స్వీయ నియంత్రణను తెచ్చిపెట్టుకున్నా, అది చివరి దాకా నిలవదు. బహుశా తమకు తెలియకుండానే, అప్రయత్నంగానే కావచ్చు భంగపడిపోతుంది. తగిన సంస్కారం, విజ్ఞత గలవారు మాత్రమే స్వీయ నియంత్రణను నిలుపుకోగలరు. ఇందులో భాగంగానే అటువంటి వారికి సందర్భ శుద్ధి, సభ్యత అన్నవి ముందుకు వస్తాయి. తన మాటలు విన్నవారు ఏమనుకుంటారోననే జ్ఞానం పనిచేస్తుంది. రేవంత్ రెడ్డి ఇవన్నీ కోల్పోయారంటే తన వ్యక్తిత్వాన్ని తేలికగా అర్థం చేసుకోవచ్చు.



తన ధోరణి ముందుందు ఇదేవిధంగా కొనసాగితే ఇంకా ఏమి మాట్లాడవచ్చునా అనిపిస్తున్నది. ఉదాహరణకు ప్రస్తుతం యూరియా కొరతతో రైతులు ఎంతగా ఆందోళన చెందుతున్నారో చూస్తున్నాము. ముందుచూపు లేమివల్ల ఆ సమస్యను సృష్టించిన రేవంత్ రెడ్డి, తీరా సమస్య వచ్చిపడిన తర్వాత ఆ నిందను తప్పించుకునేందుకు, బీఆర్ఎస్, బీజేపీలు కుట్ర పన్ని యూరియా కొరతను సృష్టించాయంటున్నారు. ఆ మాట ఎవరూ నమ్మటం లేదని అర్థమైనా, అంతకన్న సాకులు తోచనందున అదే మాట పదే పదే చెప్తున్నారు. కానీ, ఒక కొత్త సాకు ఎవరైనా ఆయనకు చెప్పినట్టయితే ఉపయోగం ఉండవచ్చు. అది డొనాల్డ్ ట్రంప్ - కేసీఆర్ కలిసి కుట్ర పన్నారని. వారి వల్లనే ఉక్రెయిన్ యుద్ధం, పాకిస్థాన్‌తో యుద్ధం వచ్చి ఎరువుల సరఫరా తగ్గిందని. ఆ జాబితాకు ఇప్పుడు ఖతార్‌పై ఇజ్రాయెల్ దాడిని చేర్చవచ్చు.

రేవంత్‌రెడ్డి ఎందుకో మొహమాట పడి, ఆరు గ్యారెంటీలు, మేనిఫెస్టో అమలు వైఫల్యాలను కేసీఆర్ ప్రభుత్వం అప్పులకు మాత్రం పరిమితం చేసి మాట్లాడుతున్నారు. ఇప్పుడు మొన్నటి ఢిల్లీ సదస్సుతో ట్రంప్ ప్రస్తావనతో ఆరంభించి తన మహత్తర దార్శనికత అంతర్జాతీయంగా మారినందున, దార్శనికతలలో ఎప్పుడైనా చరిత్ర కూడా మేళవించి ఉంటుంది గనుక, కేసీఆర్ తన పూర్వ జన్మల కాలంలో క్రీస్తు పూర్వం 326లో మేసిడోనియా రాజు అలెగ్జాండర్‌తో చేతులు కలిపి భారతదేశంపై దండయాత్ర జరిపారని, అదే పరంపరలో వేర్వేరు జన్మలలో వేర్వేరు విదేశీయులతో కలిసి దండయాత్రలు సాగిస్తూ పోయారని, అది ప్రస్తుతం ఉక్రెయిన్ యుద్ధం, పాకిస్థాన్ యుద్ధం రూపాల వరకు కొనసాగి యూరియా కొరతను సృష్టించిందని రాష్ట్ర రైతులకు బోధించవచ్చు.

> **భవిష్యత్తులో రాగల సమస్యలకు కూడా ఈ విధంగా అలెగ్జాండర్‌తో కలిసి కేసీఆర్ ఆరంభించిన దేశద్రోహుల పరంపరతో నాంది జరిగిందనుకోవచ్చు. తాను అప్పటి జన్మలో యూరియా కోసం అలెగ్జాండర్‌తో పురుషోత్తముని వలె వీరోచిత పోరాటం సాగించగా, కేసీఆర్ మాత్రం యూరియా కొరత సృష్టించేందుకు అంభిరాజు వలె మారారని, అదే సంప్రదాయం నేటికీ కొనసాగిస్తున్నారని గొంతెత్తి ప్రకటించవచ్చు.**

సాధారణంగా ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి వంటి స్థాయికి చేరినవారు స్వయంగానే తగు విద్యా సంస్కారాలు, అనుభవం కలిగినవారై ఉంటారు. వారి పార్టీలూ వారికి సలహాలనిస్తుంటాయి. అవసరమైనప్పుడు సరిదిద్దుతుంటాయి. అదీగాక కొందరికి స్పిన్ డాక్టర్లని ఉంటారు. వారు ఆ నాయకుని గురించి మీడియాకు, ఇతరులకు సదభిప్రాయం కలిగే సమాచారాలు, నిర్వచనాలు ఇస్తూ, వ్యతిరేక అభిప్రాయం కలుగకుండా చూస్తుంటారు. రేవంత్ రెడ్డి విషయంలో ఈ మూడింటిలో ఏదీ ఉన్నట్టు తోచటం లేదు. స్వతహాగా తనకు ఉండవలసినవి ఎట్లాగూ లేవు. పార్టీ వైపు నుంచి రాష్ట్రస్థాయిలో గాని, ఢిల్లీ వైపు నుంచి ఏమీ జరగటం లేదన్నది స్పష్టం. సోనియాగాంధీ ఆరోగ్య సమస్యల వల్ల క్రియాశీలంగా లేరు. పార్టీ అధ్యక్షుడు నామకార్థం మాత్రమే. ఇక మకుటం లేని మహారాజు ఆ కుటుంబం పేరిట చెలామణిలో ఉండటం మినహా నిజమైన సమర్థతలు ఏవీ లేవని గత 20 ఏండ్లలో తేలిపోయింది. రాష్ట్రస్థాయిలో చూసినప్పుడు రేవంత్ రెడ్డి చుట్టూ పార్టీలో గాని, ప్రభుత్వంలో గాని స్వీయ ప్రయోజనాభిలాషులు తప్ప తన శ్రేయోభిలాషులు లేరు. రేవంత్ సహా అందరికీ అధికార నిబద్ధతలు తప్ప, కాంగ్రెస్‌కు ఈ రోజున గల సిద్ధాంతమేమిటో తెలియదు గనుక సైద్ధాంతిక నిబద్ధతలేమీ ఒకప్పటి వలె లేవు.

అటువంటి పరిస్థితుల మధ్య రేవంత్ రెడ్డి వంటి వ్యక్తి ముఖ్యమంత్రి కావటం ఒక సహజమైన పతన పరిణామం వంటిదే తప్ప అందులో ఆశ్చర్యపడవలసింది ఏమీ లేదు. అటువంటి నాయకుని వ్యవహరణ ఇట్లుండటంతో పాటు తన సైకాలజీ, భాష ఈ విధంగా రూపు తీసుకోవటం కూడా సహజ క్రమమే. అందువల్ల ఆయనను చూసి అలెగ్జాండర్ నుంచి మొదలుకొని, డొనాల్డ్ ట్రంప్, కేసీఆర్‌ల వరకు అందరూ సానుభూతి చూపాలి. మరో విధంగా ఏమీ అనుకోనక్కరలేదు. పై సదస్సులో పాల్గొన్నవారు కూడా బహుశా సానుభూతి మాత్రమే చూపి ఉంటారు తప్ప మరేమీ అనుకొని ఉండరు.

సింగరేణి బోనస్‌కు కాంగ్రెస్ కోత

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటితే చేతలు గడప దాటవని సింగరేణి కార్మికుల విషయంలోమరోసారి రుజువైంది. దసరా సందర్భంగా సింగరేణి కార్మికులకు ఆయన తీపి కబురుకు బదులు చేదు కబురు చెప్పారు. గతేడాది వలె ఈ ఏడాది కూడా బోగస్ బోనస్‌తో కార్మికుల పొట్ట కొట్టారు. సింగరేణి సంస్థ సాధించిన నికర లాభాలపై కార్మికులకు వాటా చెల్లించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా సంస్థ అభివృద్ధి కోసం పెద్ద మొత్తంలో నిధులను పక్కన పెట్టి నామమాత్రపు లాభాలను చూపించి కార్మికులను మోసం చేసింది. గత ఆర్థిక సంవత్సరం సింగరేణి కార్మికుల కష్టంతో రూ.6,394 కోట్లు లాభాలు సాధిస్తే అందులో రూ.4,034 కోట్లు సంస్థ అభివృద్ధి కోసం పక్కన పెట్టడం కార్మికులను మోసం చేయడమే. రూ.2,360 కోట్లు లాభాలుగా పేర్కొంటూ అందులో 34 శాతం వాటా ఇస్తున్నట్టు పేర్కొనడం కార్మికులను దగా చేయడమే.



కొప్పుల ఈశ్వర్

2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ రూ.4,701 కోట్లు లాభాలు ఆర్జిస్తే అందులో సంస్థ అభివృద్ధి కోసమని రూ.2,289 కోట్లు పక్కనపెట్టి రూ.2,412 కోట్లు మాత్రమే లాభాలపై 33 శాతం వాటాగా చెల్లించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నకాలంలో ఏనాడూ 'సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం' అని ఎలాంటి నిధులను పక్కన పెట్టలేదు. సింగరేణి సంస్థ సాధించిన నికర లాభాలపై మాత్రమే వాటాను చెల్లించింది. ఈ మోసంపై కార్మికులు ఆగ్రహంతో ఉన్నారు. ఇంతకీ సంస్థ అభివృద్ధి కోసం గత ఏడాది పక్కన పెట్టిన రూ. 2,289 కోట్లతో సంస్థ అభివృద్ధికి ఏం చేశారో కార్మికులకు తెలియజేయాల్సిన అవసరం ఉన్నది. అంతేకాదు, గత రెండేండ్లలో సంస్థ అభివృద్ధి కోసం పక్కనపెట్టిన మొత్తం రూ.6,323 కోట్లపై శ్వేతపత్రం విడుదల చేయాలి.

గతంలో ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇలా 51 మంది రాజకీయ నాయకుల మధ్య కార్మికులకు ఏటా ఆనవాయితీగా చెల్లించే లాభాల బోనస్ ప్రకటన చేయడం చూస్తుంటే సింగరేణిలో కాంగ్రెస్ రాజకీయ నాయకుల జోక్యం ఎంతమేర ఉన్నదో అర్థమవుతున్నది. దాదాపుగా రెండేండ్ల తర్వాత తొలిసారి సింగరేణి కార్మికులపై ప్రెస్‌మీట్ పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ కార్మికుల సొంత ఇంటి కల, 9 నెలలుగా ఆగిపోయిన మెడికల్ బోర్డు, ఇన్‌కం ట్యాక్స్ మినహాయింపులు, మారుపేర్ల సమస్య, మెడికల్ బోర్డులో పారదర్శకత, ఉద్యోగాల నుంచి తొలగించబడిన కార్మికులను తిరిగి చేర్చుకోవడం, హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు, తాజా బదిలీ విధానం రద్దు, పదోన్నతులు, కేడర్ స్కీంలు, గని ప్రమాద బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు, జూనియర్ ఆపరేటర్ల ప్రమోషన్ల వంటి అనేక సమస్యల్లో ఒక్కదానిపైనా మాట్లాడకపోవడం ఆయనకు సింగరేణి కార్మికుల సమస్యలపై ఉన్న అవగాహనారాహిత్యాన్ని తెలియజేస్తున్నది.

> **నేల తల్లి గర్భంలో ప్రకృతికి విరుద్ధంగా ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న అండర్‌గ్రౌండ్ కార్మికుల అలవెన్స్ 12 శాతం మీద సంవత్సరానికి లక్ష రూపాయలు ఇస్తే అందులో పది వేలకు మాత్రమే ఇన్‌కమ్‌టాక్స్ మినహాయింపు ఇవ్వడం అత్యంత బాధాకరం. సింగరేణి క్వార్టర్ కలిగిన కార్మికుడి జీతం పైన పెర్క్ టాక్స్‌ను కోల్ ఇండియాలో అమలుచేస్తున్న విధంగా సింగరేణిలో కూడా యాజమాన్యమే చెల్లించాలని కార్మికులు ఏండ్లుగా కోరుతున్నా కేంద్రం పెడచెవిన పెట్టింది.**



సింగరేణిని ప్రైవేటీకరిస్తే వచ్చే పరిణామాలు చాలా దారుణంగా ఉంటాయి. ప్రైవేట్ కంపెనీలకు బొగ్గు అమ్మకాల్లో పోటీ పెరుగుతుంది. ప్రైవేట్ మాఫియా కార్మికులను శ్రమ దోపిడి చేస్తారు. కార్మికుల రక్షణకు, పర్యావరణానికి ప్రైవేట్ మాఫియా ప్రాధాన్యం ఇవ్వవు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ కూడా పాటించరు. కొత్త గనులు రావు. వారసత్వపు ఉద్యోగాలుండవు. గనులు మూతపడితే ఉద్యోగం నుంచి తొలగిస్తారు. కార్మికులకు న్యాయంగా అందవలసిన హక్కులు, బోనస్‌లు, అలవెన్స్‌లకు గండి కొడతారు. దేశ సంపద ప్రైవేట్ చేతుల్లోకి వెళ్తే వారు మాత్రమే అభివృద్ధి చెందుతారు. దీనివల్ల సామాన్యులకు ఒరిగేదేమీ లేదు. కొద్ది రోజుల్లోనే సింగరేణి సంస్థ కనుమరుగవుతుంది.

సింగరేణి కేసీఆర్ మానస పుత్రిక. నాడు నేడు ఏనాడైనా సింగరేణి సంస్థను కాపాడాలన్న, కార్మికులను కడుపున పెట్టుకుని చూసుకోవాలంటే ఒక్క కేసీఆర్‌తో మాత్రమే సాధ్యం. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన అనంతరం సింగరేణికి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందించింది. అందులో ముఖ్యంగా వారసత్వ ఉద్యోగాలు, కార్మికుల తల్లిదండ్రులకు కూడా కార్పొరేట్ వైద్యం, 26 వారాల మెటర్నటీ లీవ్, అన్ని మతాల పండుగలకు పెయిడ్ హాలీడే, ఐఐటీ, ఐఐఎంలలో సీటు సంపాదించిన కార్మికుల పిల్లలకు ఫీజు రీ యింబర్స్‌మెంట్, ఇల్లు కట్టుకునే వారికి 10 లక్షల రూపాయలు వడ్డీ లేని రుణం, జీవో 76 ద్వారా సింగరేణి ఏరియాలో నివసించేవారికి పట్టాల పంపిణీ. ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉచితంగా మంచినీటి సరఫరా, ఉచితంగా ఎలక్ట్రిసిటీ.. సింగరేణి క్వార్టర్లు, డ్యూటీలో చనిపోయిన కార్మికుడికి 20 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా, రిటైర్మెంట్ వయస్సు 61కి పెంపు సింగరేణి కార్మికుల పిల్లలకు మెడికల్ సీట్లలో 5 శాతం కోటా, రామగుండం మెడికల్ కాలేజీలో 7 సీట్లు సింగరేణి కార్మికుల పిల్లలకే కేటాయించడం, సిమ్స్ అనుబంధంగా ఏర్పాటు చేస్తున్న దవాఖానలో 50 పడకలు సింగరేణి కార్మికులకు రిజర్వ్. ఇలా అనేక కార్మిక సంక్షేమ పథకాలు అందించిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిది.

దాదాపుగా రెండేండ్ల కాలంలోనే పాలనను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వంలో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా ఇప్పుడు కార్మికులకు లాభాల వాటాలో 60శాతానికి పైగా కోత విధిస్తూ తీవ్ర అన్యాయం చేసింది కాంగ్రెస్ సర్కార్. తెలంగాణ రాష్ట్ర ప్రగతిలో ఎంతో కీలకంగా ఉన్న సింగరేణి కార్మికులకు అన్యాయం జరిగితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో కార్మికుల పక్షాన ఎంతటి పోరాటానికైనా సిద్ధపడుతాం. కార్మికుల పక్షాన పోరాడుతాం.

(వ్యాసకర్త: మాజీ మంత్రి, తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు)



యువత ఆవేదన అర్థం కాదా?



గోసుల శ్రీనివాస్ యాదవ్
98498 16817

యువత ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చడం ప్రభుత్వాల విధి. వారి విద్య, ఉపాధికి అవకాశాలు కల్పించడం వాటి ప్రథమ, ప్రధాన కర్తవ్యం. అవి నెరవేరనప్పుడు యువత అసంతృప్తికి గురవుతుందన్న విషయం పాలకులందరికీ అనుభవంలోకి వచ్చిన సంగతే. ఇవన్నీ తెలిసిన రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల పట్ల ఎందుకు ఉదాసీనంగా ఉంటున్నదో అర్థం కాదు. కేసీఆర్ హయాంలో ఎంతో విజయవంతంగా నడిచిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పక్కనపెట్టింది.

ప్రభుత్వమే విద్యాసంస్థలన్నింటినీ ఏర్పాటుచేసి, నడపడం సాధ్యం కాదు. దీనికి ప్రత్యామ్నాయమే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం. కళాశాలను ప్రైవేటుసంస్థలు ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం విద్యార్థుల ఫీజు చెల్లిస్తుంది. దానివల్ల తల్లిదండ్రులపై భారం తగ్గుతుంది. విద్యను వ్యాపారంగా మార్చకుండా అరికట్టినట్టవుతుంది. పరోక్షంగా ఆ విద్యాసంస్థలను కూడా ప్రభుత్వమే నిర్వహించినట్టవుతుంది. ఇంత మంచి ఆలోచనతో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అన్న నినాదం కింద కేసీఆర్ అమలుచేసిన పథకాన్ని ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ అయోమయంలో పడేసింది. కేసీఆర్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో ఫీజుల కింద రూ.20 వేల కోట్లు ఇచ్చారు. సగటున ఏటా రూ.2,000 కోట్లు ఇచ్చారు. కాలానుగుణంగా పెరిగిన విద్యార్థుల సంఖ్య, ఇతర ఖర్చులకు అనుగుణంగా దాన్ని పెంచాల్సి ఉండగా అసలుకే మోసం వచ్చింది. ప్రైవేటు కాలేజీలకు ఫీజు వాపస్ చేయకపోవడంతో విద్యార్థులు అయోమయంలో పడ్డారు. కోర్సులు పూర్తయినా విద్యార్థుల ఫీజును ప్రభుత్వం చెల్లించలేదు. ఆదాయం లేక కాలేజీలను నడపలేకపోతున్నామంటూ యాజమాన్యాలు ఫీజులు చెల్లించాల్సిందేనంటూ విద్యార్థులపై ఒత్తిడి తెచ్చాయి. ఒకవేళ ప్రభుత్వం నుంచి నిధులు వస్తే ఆ సొమ్మును తాము తిరిగి చెల్లిస్తామని ఆశ చూపాయి. గత్యంతరం లేక తల్లిదండ్రులు రూ.3-4 లక్షలు ఫీజుల కింద చెల్లించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బడుగు వర్గాల వారికి ఇదెంత కష్టం? ప్రభుత్వం వాపస్ చేస్తుందన్న నమ్మకంతో అప్పో సప్పో చేసి ఫీజులు కట్టారు. ఇప్పుడు ప్రభుత్వం వాపస్ చేస్తుందన్న నమ్మకం లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.


ఇరువై నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఈ బకాయిల్లో కొంతైనా చెల్లించాలని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు ఉప ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి భట్టి విక్రమార్కను కోరాయి. లేకుంటే సమ్మె చేస్తామని చెప్పాయి. అకస్మాత్తుగా బంద్‌కు పిలుపునివ్వడం ఏమిటని వారిని ప్రశ్నించిన మంత్రి 'అల్లరి చేయొద్దు' అని హెచ్చరించారు. 20 నెలలుగా వినతులు చేస్తూ వస్తుంటే అదింకా ఆకస్మికమే అవుతుందా? మంత్రి ఇచ్చిన సమాధానం కూడా ఆసక్తి కలిగిస్తున్నది. 'నేనేమీ చేయలేను. డబ్బులన్నీ జీతాలు, పథకాలకే సరిపోతున్నాయి' అని చెప్పారు. రీ యింబర్స్‌మెంట్‌కు పైసల్లేవని తేల్చిచెప్పారు. ఇక్కడ రెండు విషయాలను గమనించాలి. ఒకటి... 'డబ్బులన్నీ పథకాలకే సరిపోతున్నాయి'.. అంటే ఫీజు రీయింబర్స్‌మెంట్ అన్నది పథకం కాదా? దీన్ని ఒక పథకం కింద ప్రభుత్వం గుర్తించలేదా? ఒకవేళ గుర్తిస్తే బడ్జెట్లోనే నిధులు కేటాయించాలి కదా? ఒకవేళ కేటాయిస్తే వాటిని ఇతర పథకాలకు మళ్లించారా? కొత్త పథకాలను అమలుచేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారంటే దానర్థం ఉన్నవాటిని కొనసాగించి కొత్తవాటిని తీసుకొస్తామని... మరి ఫీజు రీయింబర్స్‌మెంట్ పాత పథకమే కదా, దాన్ని కొనసాగించాల్సి ఉండగా నిధులు కేటాయించకపోవడం ఏమిటి? లోపం ఎక్కడ జరిగింది. ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు కూడా వారి ఉద్యోగుల జీతభత్యాల కోసమే ఈ నిధులు అడుగుతున్నాయి. ఆ సిబ్బంది బాగోగులకు ప్రభుత్వం బాధ్యత వహించదా? ఈ సమస్యను తీవ్రమైనదిగా ఎందుకు చూడటం లేదు. ఆర్థికమంత్రి సమాధానంలోని రెండో విషయం 'నేనేమీ చేయలేను' అని చెప్పడం. అది నిజమే కావచ్చు. ఎందుకంటే ఈ సమస్యకు సమాధానం విద్యాశాఖను నిర్వహిస్తున్న సాక్షాత్తూ ముఖ్యమంత్రి వద్ద లభిస్తుంది కాబట్టి. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడి హోదాలో హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉన్నది.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వానికి స్పష్టమైన విధానం ఉన్నట్టు కనిపించడం లేదు. బడ్జెట్లో దీన్ని ప్రత్యేకంగా చూపించడం లేదు. ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్లో బోధన ఫీజులు, ఉపకార వేతనాలు, స్టయిఫండ్ల నిమిత్తం రూ.4,452 కోట్లు కేటాయించారు. పాత బకాయిలున్న దృష్ట్యా ఈ నిధులు సరిపోవని అప్పట్లోనే అందరూ చెప్పారు. దీన్ని రెట్టింపు చేస్తేనే మంచిదని సూచనలు కూడా ఇచ్చారు. కానీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఆర్థిక సంవత్సరంలో సగభాగం ముగిసినా ఈ పద్దు కింద విడుదల చేసిన సొమ్ము ఎంతో కూడా తెలియదు. వీటిని నిర్వహణ నిధులుగా పరిగణిస్తారు. ఆరోగ్యశ్రీ, పింఛన్లు, జీతాల వంటివి దీనికిందకే వస్తాయి. వీటి విడుదలలో జాప్యం జరిగితే దాని ప్రభావం ప్రజలపై ప్రత్యక్షంగా కనిపిస్తుంది. కుటుంబాలు, సంస్థల నిర్వహణ కష్టమవుతుంది. కొత్త పథకాల అమలు కాస్త అటూ ఇటూ అయినా ఫరవాలేదు కానీ, ఉన్నవాటి అమలు సరిగ్గా లేకపోతే అసంతృప్తి మొదలవుతుంది.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ సీనియర్ నాయకులు)

కాంగ్రెస్ సర్వేలోనూ కారు జోరు!

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రజల ఓటు కారుకే
- 32.6 శాతం ఓట్లతో ముందంజలో బీఆర్ఎస్
- ఫిరాయింపు స్థానాల్లోనూ కాంగ్రెస్‌కు గడ్డు పరిస్థితి
- సీఎం కోసం సైదులు చేసిన సర్వే బయటకు బహిర్గతం



CONGRESS SURVEY				
CATEGORY	CONG	BRS	BJP	MIM
MALE	141	138	61	38
FEMALE	20	66	12	08
TOTAL	161	204	73	46
PERCENTAGE	33.3	42.1	15.1	9.5

హైదరాబాద్, సెప్టెంబర్22(నమస్తే తెలంగాణ): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై సర్వత్ర ఆసక్తి నెలకొంది. జూబ్లీహిల్స్‌లో గెలిచి పట్టు నిలుపుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పట్టుదలగా ఉన్నారు. అయితే, ఎన్నిక ఎప్పుడు జరిగినా బీఆర్ఎస్‌దే విజయమని పలు సర్వేలు చెప్తున్నాయి. సాక్షాత్తూ కాంగ్రెస్ చేయించిన సర్వేలోనూ ఇదే తేలింది. దీంతో అవాక్కవడం సీఎం వంతైంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బస్తీలు, అర్బన్ ప్రాంత ప్రజలు మూకుమ్మడిగా గులాబీ జెండాకు జైకొట్టినట్టు ఆ సర్వేలో తేలినట్టు తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు, కాంగ్రెస్ సెఫాలజిస్టుగా గుర్తింపు పొందిన సైదులు నిర్వహించిన సర్వేలో కాంగ్రెస్ కంటే ప్రతిపక్ష బీఆర్ఎస్ దాదాపు 3 శాతం ఓట్లతో ముందంజలో ఉందని తేలింది. ఈ సర్వే వివరాలతో 10 టీవీ 'ప్రైమ్ టైమ్ డిబేట్' నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సైదులు.. రేవంత్‌రెడ్డి విజన్, 22 నెలల కాంగ్రెస్ పాలనను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని శాస్త్రీయంగా వివరించి చెప్పారు.

జూబ్లీహిల్స్ బీఆర్ఎస్‌దే

ధనిక వర్గాలు, నిరుపేదలతో సమ్మిళతమై ఉండే జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలను దృష్టిలో పెట్టుకుని ఈ సర్వే నిర్వహించినట్టు ఆ కార్యక్రమంలో సైదులు తెలిపారు. మొత్తం 5,576 శాంపిళ్లు సేకరించి వాటిని శాస్త్రీయంగా విశ్లేషించారు. సర్వేలో పాల్గొన్న 32.6 శాతం మంది ఓటర్లు మళ్లీ కారే కావాలని, కేసీఆరే రావాలని తేల్చి చెప్పారు. 29.5 శాతం మంది మాత్రమే కాంగ్రెస్‌కు ఓటేస్తామని చెప్పారు. కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి ప్రభావం ఉండటంతో ఒక్క రహమత్‌నగర్ మినహా షేక్‌పేట, ఎర్రగడ్డ, శ్రీనగర్‌కాలనీ, యూసుఫ్‌గూడ, సోమాజీగూడ, వెంగళరావునగర్, బోరబండ డివిజన్‌లోని అర్బన్, బస్తీ ప్రజలు కేసీఆర్‌కే మద్దతు తెలిపారు 1,823 మంది బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపగా, 1,646 మంది కాంగ్రెస్‌కు ఓటేస్తామని చెప్పారు. ఈ

సర్వే ఫలితాలపై సెఫాలజిస్టు సైదులు వివరణ కోరగా, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తున్నట్టు తన సర్వేలో తేలినట్టు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మూడు శాతం ఎడ్జ్‌లో ఉన్నట్టు చెప్పానని వివరించారు. కానీ ఆయన 10 టీవీకి ఇచ్చిన నివేదిక గ్రాఫ్ చిత్రాలను ఆ చానల్ తన అధికారిక వెబ్‌సైట్‌లో పెట్టింది. ఆ నివేదికల ప్రకారం సైదులు చేసిన సర్వేలో బీఆర్ఎస్ పార్టీకి స్పష్టమైన ఎడ్జ్ ఉన్నట్టు కనిపిస్తున్నది.

సర్వేలో ఎంఐఎం, బీజేపీ వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. కాంగ్రెస్, ఎంఐఎం పొత్తు పెట్టుకుంటే ఫలితాలు మారుతాయా? అన్న యాంకర్ ప్రశ్నకు సైదులు వివరణ ఇస్తూ అది అంత సులభమేమీ కాదని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ముస్లింలు కూడా ఒక కారణమని కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని పేర్కొన్నారు. రెండు పార్టీలు పొత్తు పెట్టుకున్నా ముస్లింల ఓట్లు గంపగుత్తగా కాంగ్రెస్‌కు పడవన్నారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేకు గడ్డు పరిస్థితులు

పదిమంది ఫిరాయింపు ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లోనూ తాను సర్వే చేశానని, అక్కడ కూడా వారికి గడ్డు పరిస్థితులు ఉన్నాయని సైదులు తెలిపారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే ఒకటి, రెండు స్థానాలు మినహా గెలిచే అవకాశం లేదని చెప్పారు. వారికి కాంగ్రెస్ పార్టీ క్యాడర్, స్థానిక నేతల బలం లేదని వివరించారు. ఉప ఎన్నికలు వచ్చే అవకాశం ఉన్నట్టు కనిపిస్తున్న స్టేషన్‌ఘనపూర్, ఖైరతాబాద్ నియోజకవర్గాల్లో సిట్టింగ్‌లు ఇద్దరు గెలిచే అవకాశమే లేదని ఆయన స్పష్టం చేశారు.

ఏఐసీసీకి మంత్రుల రిపోర్టు

అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలల ముందు తాను చేసిన సర్వే ప్రకారం బీఆర్ఎస్ పార్టీ గెలవాల్సి ఉందని, కేసీఆర్ 15-20 సిట్టింగ్ సీట్లు మార్చి ఉంటే బీఆర్ఎస్‌కు 62-64 సీట్లు వచ్చేవని, కానీ సిట్టింగులకే సీట్లు ఇవ్వాలని కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం కాంగ్రెస్ పార్టీకి కలిసొచ్చిందని సైదులు వివరించారు. అటు ఆంధ్ర, ఇటు తెలంగాణ ప్రజలు ఏ నాయకుడికైనా 10 ఏండ్లకు మించి అవకాశం ఇవ్వరని, అయినా కేసీఆర్‌కు మరో అవకాశం ఇవ్వాలని అనుకున్నట్టు ఆయన వివరించారు. 22 నెలల కాంగ్రెస్ పాలనపై మంత్రులు సానుకూలంగా ఉన్నప్పటికీ కార్యకర్తలు, ఎమ్మెల్యేలు నిరాశతో ఉన్నారని, పనులు కావడం లేదని చెప్పారని ఆయన వివరించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలను కలిసి మాట్లాడి వారి పనితీరు, అవినీతి, ఇతర అంశాలను బేరీజు వేసి నివేదిక రూపొందించనున్నట్టు చెప్పారు. దీనిని ఏఐసీసీలోని ఓ కీలక నేతకు మెయిల్ చేయనున్నట్టు చెప్పారు.

ఎవరీ సైదులు?



సైదులు నల్లగొండ జిల్లా దేవరకొండ ప్రాంతానికి చెందిన సెఫాలజిస్టుగా కాంగ్రెస్ నేతలు చెప్తున్నారు. 2020లో జరిగిన దుబ్బాక ఉప ఎన్నికల సమయంలో సైదులు అప్పుడు టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డితో అటాచ్ అయినట్టు తెలుస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇద్దరూ తరచూ కలుసుకొంటున్నారు. సీఎంకు అవసరమైన సర్వేలు ఆయనే చేసి పెడుతున్నట్టు సచివాలయ వర్గాలు చెప్తున్నాయి. ఆయన సర్వేల మీదనే ఆధారపడి రేవంత్‌రెడ్డి నిర్ణయాలు తీసుకుంటారని 10 టీవీతో సైదులు చెప్పిన మాటలను బట్టి తెలుస్తున్నది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, ఫిరాయింపుదార్ల నియోజకవర్గాల్లో పలు ప్రభుత్వ, ప్రైవేటు ఏజెన్సీలతో సర్వే చేయించిన రేవంత్‌రెడ్డికి మింగుడుపడని ఫలితాలు రావడంతో సైదులతో మరో సర్వే చేయించినట్టు సమాచారం. సర్వే ఫలితాలు బయటపడటంతో కాంగ్రెస్‌లో ఆందోళన మొదలైంది.

పామాయిల్ ఫ్యాక్టరీ

- రైతుల జీవితాల్లో వెలుగులు నింపిన ప్రాజెక్టు
- సిద్దిపేటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఓ భావోద్వేగం

కేసీఆర్ కాళేశ్వర ఫలితమే

- నాటి నిర్ణయంతో రైతుల జీవితాల్లో గుణాత్మకమైన మార్పు
- నిరుడు ఫ్యాక్టరీ కోసం చెమట చిందించింది బీఆర్ఎస్ పార్టీ
- విత్తనం నాటింది బీఆర్ఎస్.. పండ్లు తినేందుకు కాంగ్రెస్..!
- మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం వస్తది
- ఫ్యాక్టరీ సందర్శనలో మాజీ మంత్రి హరీశ్‌రావు
- బీఆర్ఎస్ పనులు కాంగ్రెస్ ఖాతాలో : ఎమ్మెల్యే పల్లా



సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని నర్మెటలో ఆయిల్‌పామ్ గెలలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం

సిద్దిపేట, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'కేసీఆర్ కలల ప్రాజెక్టు కాళేశ్వరం .. ఈ ప్రాజెక్టు వల్లే సిద్దిపేట ప్రాంతంలో ఆయిల్ పామ్ సాగవుతున్నది. రైతుల జీవితాల్లో వెలుగులు వచ్చాయంటే కారణం కాళేశ్వరం. కేసీఆర్ నిర్మించిన పాలమూరు, కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టుల ఫలితంగానే తెలంగాణ ప్రాంతమంతా పామాయిల్ సాగుకు అనుకూలంగా మారింది. కష్టపడింది.. విత్తనం నాటింది బీఆర్ఎస్ అయితే పండ్లు తినడానికి మాత్రం కాంగ్రెస్ బయలుదేరింది. నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం వెనుక కష్టం ఎవరిది? చెమట చుక్కలు చిందించిందెవరనేది ప్రజలకు తెలుసు' అని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణంలో కాంగ్రెస్ పాత్ర పనికిరాని ఆరోవేలు వంటిదని చెప్పారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో పామాయిల్ ఫ్యాక్టరీ ట్రయిల్ రన్ విజయవంతమైన నేపథ్యంలో సోమవారం ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, దేశపతి శ్రీనివాస్, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలిసి హరీశ్ సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 'అందరి దృష్టిలో ఇది ఫ్యాక్టరీ కావచ్చు కానీ మన దృష్టిలో ఇదొక ఎమోషన్..వేలాదిమంది రైతుల జీవితాల్లో గుణాత్మక మార్పు తెచ్చే, దశదిశను మార్చేది' అని అభివర్ణించారు.

సాధ్యం కాదన్నచోటే..

సిద్దిపేటకు పామాయిల్ పంట తీసుకొద్దామని ప్రయత్నం చేసిన తొలినాళ్లలో ఐఐఓఆర్ (ఇండియన్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ రీసెర్చ్) వారు 2018లో ఇక్కడ గాలిలో తేమశాతం తక్కువ ఉన్నది, సాగు సాధ్యం కాదని చెప్పారని గుర్తుచేశారు. 2019లో కాళేశ్వరం ద్వారా రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, చెరువులు, చెక్ డ్యాముల్లో నీళ్లు నింపుకొన్నామని, 2021లో పరిశోధన చేసిన తర్వాత మళ్లీ గాలిలో తేమ శాతం పెరిగిందని, ఇక్కడ పామాయిల్ సాగు చేసుకోవచ్చని ఐఐఓఆర్ ప్రకటించిందని గుర్తుచేశారు. 2022, జూన్ 5న రామచంద్రాపూర్‌లో రైతు మడుగు ఎల్లారెడ్డి మొదటి పామాయిల్ మొక్క నాటారని, ఒక్కో రైతును గుర్తించి ఒక్కో ఎకరం పెట్టించి ఇక్కడిదాకా వచ్చామని చెప్పారు. పామాయిల్ సాగుతో ప్రతి నెలా జీతం పడ్డట్టు రైతుకు ఆదాయం వస్తుందని తెలిపారు. 2022 ఏప్రిల్‌లో ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమని, మలేషియా టెక్నాలజీని తీసుకొచ్చి ఫ్యాక్టరీ ఏర్పాటు చేశామని చెప్పారు. కానీ ఇవ్వాల రేవంత్‌రెడ్డి రిబ్బన్ కత్తిరించేందుకు కత్తెర్లు జేబులో పెట్టుకొని బయలుదేరిండని ఎద్దేవా చేశారు. మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని, ప్రతి జిల్లాకు పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని స్పష్టంచేశారు.

బీఆర్ఎస్ పనులు.. కాంగ్రెస్ కటింగ్‌లు: పల్లా

బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం రిబ్బన్ కటింగ్‌లు చేసి తన ఖాతాలో వేసుకుంటున్నదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన పనులపై గ్రామాల్లో రైతుల ముందు చర్చ పెట్టాలని చెప్పారు. 2014కు ముందు కాంగ్రెస్ 15 లక్షల ఎకరాల్లోనే వరి పండిస్తే బీఆర్ఎస్ వచ్చాక కోటీ 20 లక్షల ఎకరాలకు పెంచిందని గుర్తుచేశారు. విస్తీర్ణం, ఉత్పాదకత, ఉత్పత్తి ఈ మూడూ కలిపి దేశంలోనే ఇవ్వాల వరి పండించే నంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణ నిలిచేందుకే కేసీఆరే కారణమని స్పష్టంచేశారు. ఇదంతా ప్రాజెక్టుల నిర్మాణం, చెరువుల పునరుద్ధరణ, 24 గంటల కరెంట్, సమయానికి ఎరువులు, విత్తనాలను అందించడం వల్లే సాధ్యమైందని గుర్తుచేశారు.

ఇది ప్రభాకర్‌రావుపై కక్ష సాధింపే

- ఫోన్‌ట్యాపింగ్ కేసులో సుప్రీంకోర్టులో వాదనలు

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసు పూర్తిగా రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు తరపు న్యాయవాది దామా శేషాద్రినాయుడు సుప్రీంకోర్టుకు తెలిపారు. తెలంగాణలో ప్రభుత్వం మారిన వెంటనే ప్రభాకర్‌రావును లక్ష్యంగా చేసుకుని ఫోన్ ట్యాపింగ్ కేసు పెట్టారని చెప్పారు. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట సోమవారం ప్రభాకర్‌రావు మధ్యంతర బెయిల్ పిటిషన్ విచారణకు వచ్చింది. తెలంగాణ ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, ప్రభాకర్‌రావు తరపున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు వాదనలు కొనసాగించారు. సుప్రీంకోర్టు ప్రభాకర్‌రావుకు కల్పించిన మధ్యంతర రక్షణను రద్దు చేయాలని, కోర్టు ఇచ్చిన రక్షణను ఆయన దుర్వినియోగం చేస్తున్నారని తుషార్ మెహతా, సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. ఆయన విచారణకు ఏమాత్రం సహకరించడం లేదని తదితర అంశాలతో ప్రభాకర్‌రావుకు కల్పించిన మధ్యంతర రక్షణను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఐబీ చీఫ్‌గా ప్రభాకర్‌రావు సాక్ష్యాలను ధ్వంసం చేశారనే దాంట్లో ఎటువంటి వాస్తవం లేదని దామా శేషాద్రినాయుడు తెలిపారు. విచారణకు ప్రభాకర్‌రావు పూర్తిగా సహకరిస్తున్నారని తెలిపారు. ధర్మాసనం ఈ కేసును అక్టోబర్ 8కి వాయిదా వేసింది.

మత్తయ్యకు ఉపశమనంపై సుప్రీంలో తీర్పు రిజర్వు

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): 'ఓటుకు నోటు' కేసులో నాలుగో నిందితుడుగా ఉన్న జెరూసలేం మత్తయ్యపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను హైకోర్టు క్వాష్ చేయడాన్ని సవాలు చేస్తూ ఏసీబీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో వాదనలు ముగిశాయి. అనంతరం ఏసీబీ పిటిషన్‌పై వాదనలు ముగిసినట్టు ప్రకటించిన ధర్మాసనం.. తీర్పును రిజర్వ్ చేస్తున్నట్టు వెల్లడించింది.

25న మరో అల్పపీడనం

- 26,27 తేదీల్లో పలు చోట్ల క్లౌడ్‌బరస్ట్‌లు
- నెల చివరి వరకూ వర్షాలు
- వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఈనెల చివరివరకూ రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించింది. ముఖ్యంగా ఉత్తర, పశ్చిమ, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని తెలిపింది. సోమవారం హైదరాబాద్, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, సిద్దిపేట, జనగామ, వరంగల్, కరీంనగర్, నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసినట్టు వెల్లడించింది. ముఖ్యంగా హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసినట్టు వెల్లడించింది. కొద్దిసేపటికే కురిసిన ఈ భారీ వర్షానికి రోడన్నీ జలమయం కావడంతో, లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని తెలిపింది. రోడ్లపై మోకాళ్లల్లోతు వర్షపు నీళ్లు చేరడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి, కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయని పేర్కొన్నది. ఈనెల 25న బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉండగా, 26,27 తేదీల్లో క్లౌడ్‌బరస్ట్‌లతో పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మంగళవారం కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నది. మిగతా జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వానలు పడతాయని వివరించింది. కాగా, గడిచిన 24గంటల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురవగా, యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు -ఎంలో 14.26 సెం.మీ, ఆత్మకూరులో 9.71 సెం.మీ, మెదక్ జిల్లా అల్లాదుర్గ్‌లో 11.13 సెం.మీ, మహబూబాద్ జిల్లా పెద్దవంగరలో 9.59 సెం.మీ, జనగామ జిల్లా దేవరుప్పులలో 9.34 సెం.మీ, వికారాబాద్ జిల్లా కులకచర్లలో 8.94 సెం.మీ వర్షపాతం నమోదైనట్టు వెల్లడించింది.

యూరియా కొరత.. దిగుబడుల్లో కోత!

- ఎదుగుదల దశలోనే అందని ఎరువు
- పొట్ట పోసుకునే దశలో వరిపొలాలు
- కంకి పెడుతున్న మక్క, పూతకొచ్చిన పత్తి
- యూరియా కొరతతో దిగుబడులపై ప్రభావం
- 30- 40% తగ్గుతాయంటున్న శాస్త్రవేత్తలు
- పంటల్లో ఎదుగుదల లోపించడంతో కడుపుమండి పలుచోట్ల చేలను చెడగొడుతున్న అన్నదాతలు

హైదరాబాద్, సెప్టెంబర్ 22(నమస్తే తెలంగాణ): వరి పొట్టకొచ్చింది.. మక్కజొన్న కంకి పెడుతున్నది.. పత్తి పూతకొస్తున్నది.. ఈ దశలో ఆయా పంటలకు యూరియా తప్పనిసరి. ఇప్పుడు యూరియా వేస్తేనే పంటల్లో ఎదుగుదల ఉండి, దిగుబడి పెరుగుతుంది. కానీ రాష్ట్రవ్యాప్తంగా యూరియా కొరతతో అదునుకు వేయాల్సిన సమయంలో రైతులు ఎరువు వేయలేకపోతున్నారు. దీంతో ఎదుగుదల లోపించి, ఆయా పంటల దిగుబడులపై తీవ్ర ప్రభావం పడనున్నది. అన్నదాతలు తీవ్రంగా నష్టాలు చవిచూడనున్నారు. ఈసారి పంటల దిగుబడులు భారీగా తగ్గుతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలే స్పష్టం చేస్తున్నారు. కనిష్ఠంగా 20% గరిష్ఠంగా 40% వరకు పంటల దిగుబడులు తగ్గే అవకాశం ఉన్నదని తేల్చి చెప్తున్నారు. సాధారణంగా వంద క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చే రైతుకు యూరియా కొరత కారణంగా 60 నుంచి 80 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చే అవకాశం ఉన్నది. కంటికి రెప్పోలే కాపాడుకునే పంట చేలు యూరియా కొరతతో తమ కండ్ల ముందే పాడైపోతుంటే అన్నదాతలు తల్లడిల్లుతున్నారు. ముఖ్యంగా వరి, మక్క, పత్తి పంటలు ప్రస్తుతం ఎదిగే దశలో ఉన్నాయి. ఈ దశలో యూరియా వేస్తేనే పంటలకు మేలు జరుగుతుంది. యూరియా దొరక్కపోవడంతో వరి, మక్క, పత్తి పంట చేలు ఎర్రబారుతున్నాయి. వరి పొట్టదశలో ఉండటంతో యూరియా అందక వరి కంకి ఆశించిన స్థాయిలో రావడం లేదని రైతులు గుబులు చెందుతున్నారు. మక్క సైతం పాల కంకి దశలో ఉన్నది. ఈ దశలో యూరియా అందక కండి బలంగా ఉండదని చెప్తున్నారు. పత్తి ఇప్పుడు పూత దశలో ఉన్నది. ఈ దశలో



యూరియా వేస్తే పూత ఎక్కువొచ్చి, పత్తి దిగుబడి పెరుగుతుంది. కానీ ఇప్పుడు యూరియా కొరతతో పత్తిచేలు వాడుతున్నాయి.ఈ మేరకు ఆయా పంటలను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఒక్క బస్తా యూరియా దొరికినా చాలనే విధంగా యూరియా కొరతపై ఏకంగా పోరాటమే చేస్తున్నారు. రాత్రి-పగలు, ఎండ-వాన, తిండి-తిప్పలు మాని యూరియా కోసం రోజంతా వేచి ఉంటున్నారు. అయినా యూరియా కొరత వారిని వేధిస్తూనే ఉన్నది.

పశువులకు మేతగా పంటచేలు

వరి, మక్క, పత్తి పంట చేలకు యూరియా అందక కొన్ని వాడుముఖం పట్టాయి. మరికొన్ని ఎదుగుదల లోపించి ఎర్రబారుతున్నాయి. పంట పొలాల్లో అధికంగా కలుపు పెరుగుతున్నది. వీటిని ఇలాగే ఉంచితే ప్రయోజనం కన్నా రైతులకు నష్టమే ఎక్కువయ్యే అవకాశం ఉన్నది. దీంతో ఎర్రబారిన, ఎదగని పంట చేలను రైతులు తొలగిస్తున్నారు. యూరియా దొరక్క మక్కజొన్న చేను ఎదగడం లేదని, కలుపు పెరిగిందని సిద్దిపేట జిల్లా మీర్జాపూర్‌కు చెందిన రైతు శ్రీకాంత్ తన పంటచేనును పశువులకు మేతగా వదిలేశారు. వరంగల్ జిల్లా గొల్లగూడెం తండా రైతు శ్రీనుది మరో గోస. ఐదెకరాల్లో మక్క సాగుచేసిన ఆ రైతుకు కేవలం ఎకరానికే యూరియా దొరికింది. దీంతో మిగిలిన నాలుగు ఎకరాల మక్కజొన్న చేను అక్కరకే రాకుండా పోయింది. దౌల్తాబాద్ రైతు ముత్యాలు యూరియా దొరక్కపోవడంతో తన మక్కజొన్న పంటను ట్రాక్టర్‌తో దున్నేశారు. ఈ విధంగా యూరియా కొరత కారణంగా రైతులు తమ పంటలను చెడగొడుతున్నారు.

- డప్పుకొట్టి చెప్తున్నా వినపడ్తలేదా?



ఖమ్మం జిల్లా చింతకాని సొసైటీ పరిధిలోని జగన్నాథపురం రైతు వేదిక వద్దకు చేరుకున్న పలుగ్రామాల రైతులకు కూపన్లు ఇచ్చిన రైతుల్లో చాలామందికి యూరియా ఇవ్వకపోవడంతో.. డప్పులు కొడుతూ ఆందోళనకు దిగిన కర్షకులు

- ఎరువు లేదు.. కునుకులేదు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద అర్ధరాత్రి నుంచే క్యూకట్టిన మహిళా రైతులు

- సోయిలేని పాలనలో సొమ్మసిల్లిన మహిళా రైతు!



వరంగల్ జిల్లా నర్సంపేట మండలం రాజపల్లి సొసైటీ ఎదుట క్యూలో సొమ్మసిల్లి పడిపోయిన మహిళా రైతు అనూష

చీకట్లో రైతుల ఇక్కట్లు

- యూరియా కోసం రాత్రంతా జాగారం
- వాన, చలిలో అవస్థలు పడుతూ నిరీక్షణ
- రైతు వేదికల వద్ద అన్నదాతల ఆందోళన
- రోడ్లపై బైఠాయింపు.. ప్రభుత్వంపై ఆగ్రహం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, సెప్టెంబర్ 22: రాష్ట్రంలో రైతులు యూరియా కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. పొద్దున్నే వెళ్లినా భారీ క్యూలో సంచులు దొరకపోవడంతో... రాత్రే వెళ్లి క్యూ కడుతున్నారు. రైతువేదికలు, సొసైటీల వద్దనే జాగారం చేస్తున్నారు. పంటను కాపాడుకోవాలనే ఆరాటంతో వాన, చలిని భరిస్తున్నారు. గంటల తరబడి పడిగాపులు కాసినా బస్తా ఎరువు కూడా దొరకకపోవడంతో ఆగ్రహంతో రోడ్డెక్కి ఆందోళనకు దిగుతున్నారు. పలుచోట్ల రైతులు సొమ్మసిల్లి పడిపోతున్నారు. కాంగ్రెస్ సర్కారు వైఫల్యంతోనే అన్నదాతలు అవస్థలు పడుతున్నారని రైతులు, రైతు సంఘాల నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఓ వైపు అన్నదాతలకు బస్తా యూరియా దొరకక బాధ పడుతుంటే.. ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలతో అక్రమార్కులు యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. రైతులు యూరియా కోసం రోజుల తరబడి పడిగాపులు కాస్తుంటే... ప్రభుత్వం సరిపడా స్టాక్ సరఫరా చేయడంలేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

- రైతులకు మోసం.. ఏఈవో చేతివాటం



హనుమకొండ జిల్లా పరకాల మండలంలోని నాగారం క్లస్టర్ ఏఈవో కాటం రాజు కమలాపురం మండలం శనిగారం గ్రామానికి చెందిన తన బంధువులకు తరలిస్తుండగా స్థానిక రైతుల సమాచారంతో పోలీసులు పట్టుకున్న 8 బస్తాల యూరియా



నాయకులను అరెస్టు చేయడంతో నాంపల్లి పోలీసుస్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

సెక్రటేరియట్ ముట్టడికి రైతుల యత్నం

- అరెస్టు చేసి నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

ఘట్‌కేసర్, సెప్టెంబర్ 22: మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ ఉమ్మడి మండలానికి చెందిన 1,189 మంది రైతులకు ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ వర్తించకపోవటంతో 13రోజులుగా రిలే నిరాహార దీక్ష చేపట్టారు. అయినా, ప్రభుత్వం స్పందించకపోవడంతో రైతు రుణమాఫీ సాధన సమితి కన్వీనర్ కంట్లం గౌరీశంకర్, మాజీ ఎంపీపీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ రేసు లక్ష్మారెడ్డి, నాయకులు మహిపాల్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రైతులు సెక్రటేరియట్ ముట్టడికి యత్నించారు. దీంతో పోలీసులు రైతులను బలవంతంగా అరెస్టుచేసి నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

- దిగుబడులు రాక మనస్తాపం



ఐనవోలు, సెప్టెంబర్ 22: ఆర్థిక ఇబ్బందులతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథిని గ్రామంలో సోమవారం చోటుచేసుకున్నది. ఎస్సై పస్తం శ్రీనివాస్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నర్మెట శశికుమార్ (49) గీత వృత్తితోపాటు కౌలు వ్యవసాయం చేస్తున్నాడు. రెండేళ్లుగా గ్రామంలో ఎకరం భూమి కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నాడు. పంట దిగుబడి సరిగా రాకపోవడం, గత నెలలోనే కూతురు వివాహం చేయడంతో రూ.6 లక్షల అప్పు అయ్యింది. ఈ క్రమంలో సోమవారం భార్య సంగీత, కూతురు కీర్తి ఆరుబయట పనుల్లో నిమగ్నమై ఉండగా ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు దవాఖానకు తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. భార్య సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పీఏసీఎస్‌పై తిరగబడ్డ రైతులు

విత్తనాల పంపిణీలో తొక్కిసలాట.. విరిగిన రైతు కాలు

దామరగిద్దలో తాళం పగులగొట్టి బస్తాలు ఎత్తుకెళ్లిన రైతులు

దామరగిద్ద, సెప్టెంబర్ 22 : నారాయణపేట జిల్లా దామరగిద్ద పీఏసీఎస్‌కు పల్లీ విత్తనాలు వచ్చాయని తెలుసుకొన్న 200 మంది రైతులు సోమవారం పెద్ద ఎత్తున చేరుకున్నారు. తెల్లవారుజాము 5:30 గంటల నుంచే పడిగాపులు కాయడంతో కార్యాలయ సిబ్బంది ఉదయం 8 గంటల తర్వాత వచ్చి వేరుశనగ విత్తనాలు పంపిణీకి సిద్ధమవగా.. రైతులు ఎగబడటంతో స్వల్ప తొక్కిసలాట జరిగింది. దీంతో నర్సాపూర్‌కు చెందిన వెంకటప్ప కాలు విరిగింది. సిబ్బంది పంపిణీని నిలిపివేయగా.. ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు నారాయణపేట-మద్దూరు రహదారిపైకి చేరుకొని ఆందోళనకు దిగారు. 2 గంటలపాటు రాస్తారోకో చేపట్టడంతో వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. వ్యవసాయాధికారి రైతులను పీఎస్‌కు పిలిచించి ఎస్సై రాజుతో కలిసి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అదే సమయంలో పీఏసీఎస్ తాళం విరగ్గొట్టి దాదాపు 90 సంచులను కొందరు ఎత్తుకుపోయినట్టు వ్యవసాయ అధికారి తెలిపారు. ఎస్సై అక్కడకు చేరుకొని రైతులను గేటు బయటే నిలబెట్టి ఒక్కో రైతుకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేయించారు.



నారాయణపేట జిల్లా దామరగిద్ద పీఏసీఎస్ వద్ద పల్లీ విత్తనాల కోసం ఎగబడడంతో రైతు వెంకటయ్య కాలు విరగ్గా తీసుకెళ్తున్న తోటి రైతులు

భర్త ప్రియురాలి నుంచి పరిహారం కోరవచ్చు

భార్య పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22: తమ వివాహాన్ని ముక్కలు చేసి, తమ ప్రేమను దెబ్బతీసిన తన జీవిత భాగస్వామికి చెందిన కొత్త భాగస్వామి నుంచి భర్త లేదా భార్య నష్టపరిహారాన్ని కోరవచ్చని ఢిల్లీ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై సెప్టెంబర్ 15న విచారణ జరిపిన జస్టిస్ పురుషేంద్ర కౌరవ్ అక్రమ సంబంధం అన్నది ఇప్పుడు నేరం కాదని, కాని దాని పర్యవసానాలు ప్రమాదకరంగా ఉంటాయని చెప్పారు. వివాహ పవిత్రతపై మనుషులకు కొన్ని అంచనాలు ఉంటాయని, అయితే వ్యక్తిగత స్వేచ్ఛను కోరుకోవడం నేరం కాదని న్యాయమూర్తి తెలిపారు. అక్రమ సంబంధాన్ని నేరంగా పరిగణించి శిక్షించలేమని, కాని అది జీవితానికి, హక్కులకు ప్రమాదకరంగా పరిణమించగలదని ఆయన అన్నారు. జోసెఫ్ షైన్ కేసులో సుప్రీంకోర్టు తీర్పును ప్రస్తావిస్తూ అక్రమ సంబంధాలను నేరరహితంగా ప్రకటించిన విషయాన్ని హైకోర్టు గుర్తు చేసింది. అయితే వివాహేతర సంబంధాలకు సుప్రీంకోర్టు లైసెన్సు ప్రకటించలేదని కూడా న్యాయమూర్తి గుర్తు చేశారు. కాగా, వివాహ బంధాన్ని తెంపినందుకు జీవిత భాగస్వామికి చెందిన కొత్త భాగస్వామి నుంచి ఆర్థిక పరిహారం పొందే మొదటి కేసుగా ఇది నిలుస్తుంది.

పరువు నష్టాన్ని నేర రహితంగా పరిగణించే సమయమొచ్చింది!

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22: పరువు నష్టం కేసులను నేర రహితంగా పరిగణించాలన్న వాదనపై సుప్రీంకోర్టు సోమవారం సానుకూలత వ్యక్తం చేసింది. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ) రిటైర్డ్ ప్రొఫెసర్ అమితా సింగ్ ఆన్‌లైన్ న్యూస్ పోర్టల్ ది వైర్‌పై దాఖలు చేసిన పరువు నష్టం వ్యాజ్యం విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ మేరకు అభిప్రాయం వ్యక్తం చేసింది. ది వైర్‌ని నడుపుతున్న ఫౌండేషన్ ఫర్ ఇండిపెండెంట్ జర్నలిజం దాఖలు చేసిన పిటిషన్‌పై అమితా సింగ్‌కి జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం నోటీసు జారీ చేసింది. ''పరువు నష్టం కేసులను నేర రహితంగా పరిగణించాల్సిన సమయం ఆసన్నమైంది'' అంటూ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. న్యూస్ పోర్టల్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ధర్మాసనం వ్యాఖ్యలతో ఏకీభవించారు. జేఎన్‌యూపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ డెన్ ఆఫ్ ఆర్గనైజ్డ్ సెక్స్ రాకెట్ అని కూడా వ్యవహరించిన 200 పేజీల పత్రాన్ని అమితా సింగ్ నేతృత్వంలో కొందరు జేఎన్‌యూ ప్రొఫెసర్లు రూపొందించారని 2016లో ది వైర్ ఓ వ్యాసాన్ని ప్రచురించింది. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, వేర్పాటువాద, ఉగ్రవాద స్థావరం అని ఈ పత్రానికి శీర్షిక పెట్టారని న్యూస్ పోర్టల్ తన వ్యాసంలో పేర్కొంది. ఈ పత్రాన్ని జేఎన్‌యూ పాలకులకు వారు అందచేశారని, భారత్‌లో వేర్పాటువాదాన్ని చట్టబద్ధం చేస్తూ జేఎన్‌యూలో కాలం చెల్లిన సంస్కృతిని కొందరు ప్రొఫెసర్లు ప్రోత్సహిస్తున్నారని కూడా ఆ పత్రంలో పేర్కొన్నారని న్యూస్ పోర్టల్ తెలిపింది. దీంతో ది వైర్‌పై, విలేకరిపైన అమితా సింగ్ పరువు నష్టం కేసు దాఖలు చేశారు. అప్పటి నుంచి ఈ కేసు వివిధ న్యాయస్థానాలలో విచారణ ఎదుర్కొంటోంది. బీఎన్‌ఎస్ సెక్షన్ 356 ప్రకారం పరువు నష్టం నేరంగా పరిగణనలోకి వస్తుంది.

అన్ని రాష్ట్రాల్లో 'సర్'

ఈ నెల 30లోగా 'సర్' అమలుకు సిద్ధంగా ఉండాలని సీఈవోలకు ఈసీ ఆదేశం

- అన్ని రాష్ట్రాల్లో ఇదివరకు చేపట్టిన ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని సూచన
- బీహార్ 'సర్'పై విమర్శలు.. సుప్రీంలో కేసు
- ఈ క్రమంలో ఈసీ నిర్ణయంపై సర్వత్రా చర్చ



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-సర్)ను చేపట్టేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ సిద్ధమవుతున్నది. 'సర్' కోసం రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు (సీఈవో) ఈ నెల 30లోగా సిద్ధంగా ఉండాలని ఈసీ కోరింది. ప్రతి రాష్ట్రంలో చివరిసారి చేపట్టిన 'సర్' ఆధారంగా ఓటర్ల జాబితాను సవరించాల్సి ఉంటుందని ఈసీ గుర్తు చేసింది. ఈ క్రమంలో ఇంతకు ముందు ప్రచురించిన రాష్ట్రాల ఓటర్ల జాబితాలను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులకు ఈసీ తెలిపింది. ఓటరు జాబితా ప్రక్షాళన కార్యక్రమాన్ని (సర్) అక్టోబర్- నవంబర్ నాటికి ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని ఈసీ సూత్రప్రాయంగా వివరించింది. 2008లో ఢిల్లీలో, 2006లో ఉత్తరాఖండ్‌లో, 2003లో బీహార్‌లో చివరిసారిగా 'సర్'ను నిర్వహించారు. మిగతా రాష్ట్రాల్లో ఈ ప్రక్రియను 2002 నుంచి 2004 మధ్య పూర్తి చేశారు. పలు రాష్ట్రాల సీఈవోలు ఇప్పటికే ఈ జాబితాలను వెబ్‌సైట్లలో అప్‌లోడ్ కూడా చేశారు. కాగా బీహార్ తర్వాత దేశవ్యాప్తంగా 'సర్'ను అమలు చేస్తామని ఈసీ ప్రకటించింది.

బీహార్‌లో 'సర్' రచ్చ

ఈ ఏడాది చివర్లో జరగనున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంలో ఇటీవల ఈసీ అధికారులు 'సర్' చేపట్టారు. 2003 నాటి ఓటర్ల జాబితా ఆధారంగా దీన్ని నిర్వహించారు. విదేశీ అక్రమ వలసదారులను తనిఖీ చేయటం, వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించటం 'సర్' ప్రాథమిక లక్ష్యమని ఈసీ తెలిపింది. అయితే, బీజేపీకి లబ్ధి చేకూర్చడానికి, లక్షిత ఓటర్లను ఏరివేయడానికే ఈ 'సర్'ను తీసుకొచ్చారని ప్రతిపక్షాలు విమర్శించాయి. దీంతో ఈ కేసు సుప్రీంకోర్టులో విచారణకు వచ్చింది. ఎన్నికల సమయంలోనే 'సర్'ను నిర్వహించాల్సిన అవసరం ఏమొచ్చిందని ఈసీని సుప్రీంకోర్టు నిలదీసింది. చట్టవిరుద్ధంగా 'సర్' ఉన్నట్టు తేలితే, దాన్ని రద్దు చేస్తామని హెచ్చరించింది. బీహార్‌లో 'సర్' ప్రక్రియ చెల్లుబాటుపై అక్టోబర్ 7న తుది వాదనలు వింటామని పేర్కొంది. ఈ కేసు విచారణ జరుగుతుండగానే.. అన్ని రాష్ట్రాల్లో 'సర్'ను అమలు చేయడానికి ఈసీ సమాయత్తమవ్వడం చర్చనీయాంశంగా మారింది.

ప్రతిభావంతులకు గాలం!

- **హెచ్1బీ వీసాపై అమెరికా కఠిన నిబంధనలతో నిపుణులను ఆకర్షించేందుకు ఇతర దేశాల యత్నాలు**
- **హెచ్1బీ తరహాలో కే వీసా ప్రకటించిన చైనా ప్రభుత్వం**
- **నిపుణులకు వీసా ఫీజుల రద్దుకు బ్రిటన్ సర్కారు యోచన**



లండన్: విదేశీ ప్రతిభావంతులకు ఇచ్చే హెచ్-1బీ వీసా ఫీజును అనూహ్యంగా లక్ష డాలర్లకు పెంచి ప్రతిభావంతులైన ఉద్యోగుల రాకకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బ్రేక్ వేసిన వేళ.. అలాంటి ప్రతిభావంతులను ఒడిసిపట్టడానికి ఇతర దేశాలు సన్నద్ధమవుతున్నాయి. నిపుణులను తమ దేశానికి ఆకర్షించేందుకు ప్రయత్నాలు ప్రారంభించాయి. అమెరికా హెచ్1బీ తరహాలో చైనా కే వీసాను ప్రకటించింది. బ్రిటన్ కూడా ప్రతిభావంతులకు వీసా ఫీజును రద్దు చేయాలని నిర్ణయించింది. మరో భారత్ కూడా నిపుణులైన ప్రవాసీయులను తిరిగి స్వదేశానికి ఆహ్వానిస్తున్నది.

కే-వీసా ప్రకటించిన చైనా

తన ఇమిగ్రేషన్ రూల్స్‌లో చైనా స్టేట్ కౌన్సిల్ భారీ మార్పులు చేసి కొత్తగా కే-వీసాను ప్రకటించింది. సైన్స్, టెక్నాలజీ, ఇతర స్టెమ్ రంగాల్లోని యువ విదేశీ ప్రతిభావంతులను ఆకర్షించడమే లక్ష్యంగా దీనిని ప్రకటించింది. ఈ కే-వీసాను చాలా సులభంగా పొందవచ్చునని తెలిపింది. దీనికి స్థానిక కంపెనీల స్పాన్సర్ షిప్ అవసరం ఉండదు.

నిపుణులకు బ్రిటన్ స్వాగతం

మొన్నటి వరకు వలస ఉద్యోగులను ఎలా పంపాలా అని కిందామీద పడిన యూకే ప్రభుత్వం హఠాత్తుగా యూటర్న్ తీసుకుంది. నిపుణులను అందిపుచ్చుకోవడానికి బ్రిటన్ ముందడుగు వేస్తున్నది. విదేశీ నిపుణుల కోసం కొన్ని వీసా ఫీజులను రద్దు చేయాలని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ యోచిస్తున్నారని ఫైనాన్షియల్ టైమ్స్ వార్తా కథనాన్ని ప్రచురించింది. దేశ ఆర్థిక స్థాయిని పెంచే సైంటిస్టులు, విద్యావేత్తలు, డిజిటల్ నిపుణులను ఆకర్షించేందుకు అనుసరించాల్సిన విధానాలపై ఇప్పటికే స్టార్మర్ ఆధ్వర్యంలో 'గ్లోబల్ టాలెంట్ టాస్క్ ఫోర్స్' చురుకుగా పనిచేస్తున్నదని తెలిపింది. ప్రపంచంలోని టాప్ 5 యూనివర్సిటీల్లో చదివిన వారిని, వ్యక్తిగతంగా ప్రతిష్టాత్మక బహుమతులను గెల్చుకున్న వారికి వీసా ఫీజును సున్నాకు తగ్గించాలని వీరు యోచిస్తున్నారు. దేశ ఆర్థిక వృద్ధిని పెంచే ప్రయత్నంలో ప్రపంచంలోని అత్యుత్తమ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, డిజిటల్ నిపుణులను ఆకర్షించే ఆలోచనలపై పని చేస్తోందని, నెంబర్ 10 డౌన్‌టౌన్ స్ట్రీట్‌లో, ట్రెజరీ లోపల జరిగిన చర్చలపై వివరించిన వ్యక్తులను ఉటంకిస్తూ నివేదిక పేర్కొంది.

'విదేశాల్లో పనిచేస్తున్న భారతీయులు స్వదేశానికి రావాలి'

విదేశాల్లో పనిచేస్తున్న భారతీయులు స్వదేశానికి రావాలంటూ పీఎంవో కార్యాలయం ముఖ్య అధికారి డాక్టర్ పీకే మిశ్రా పిలుపునిచ్చారు. 'కెపాసిటీ బిల్డింగ్ కమిషన్'లో భాగంగా ప్రతిభావంతులైన ప్రవాస భారతీయులను భారత్‌కు తీసుకొచ్చేందుకు కేంద్రం ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు.

హెచ్-1బీ ఫీజు పెంపు నుంచి డాక్టర్లకు మినహాయింపు?

వైట్ హౌస్ ప్రతినిధి అంచనా

ట్రంప్ ప్రభుత్వం తాజాగా పెంచిన హెచ్-1బీ వీసా ఫీజు నుంచి డాక్టర్లకు మినహాయింపు ఇచ్చే అవకాశం ఉన్నట్లు వైట్ హౌస్ సోమవారం వెల్లడించింది. గ్రామీణ అమెరికాలో ఇప్పటికే ఉన్న డాక్టర్ల కొరతను దృష్టిలో ఉంచుకుని దిగ్గజ వైద్య సంస్థలు వ్యక్తం చేసిన ఆందోళనను పురస్కరించుకుని ట్రంప్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు వైట్ హౌస్ అధికార ప్రతినిధి టేలర్ రోజెర్స్ బ్లూమ్‌బర్గ్ న్యూస్‌కి తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవకులకు తీవ్ర కొరత ఉన్న కారణంగా దవాఖానలకు డాక్టర్ల నియామకాల కోసం హెచ్-1బీ ప్రోగ్రామ్ అత్యంత కీలకంగా మారింది. పెద్ద దవాఖానలు డాక్టర్లను, హెచ్-1బీ ప్రోగ్రామ్ ద్వారా స్పాన్సర్ చేస్తుంటాయి. తమ వైద్య శ్రామిక శక్తిలో అంతర్జాతీయ మెడికల్ గ్రాడ్యుయేట్లు కీలక భాగస్వాములని అమెరికన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబీ తెలిపారు. డాక్టర్ల కొరత ఉన్నట్లు గుర్తించిన ప్రదేశాలలో 7.6 కోట్ల మందికి పైగా అమెరికన్ పౌరులు నివసిస్తున్నట్లు సమాచారం.

విదేశీ విమానంలో ప్రయాణించడం మానండి

స్వదేశీపై మోదీకి కేజ్రీవాల్ చురకలు

న్యూఢిల్లీ: స్వదేశీ వస్తువులే కొనుగోలు చేయాలంటూ ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు ఇచ్చిన పిలుపుపై ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. స్వదేశీ వస్తువులే కొనాలని ప్రధాని మోదీ ప్రజలను అర్థించారని, కాని ఆయన ప్రయాణించే విదేశీ విమానం, ఉపయోగించే విదేశీ వస్తువుల మాటేమిటని సోమవారం ఎక్స్‌లో కేజ్రీవాల్ ప్రశ్నించారు. "ముందుగా స్వదేశీ వస్తువులను ఉపయోగించడం మీరే ఎందుకు మొదలుపెట్టరు? భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న నాలుగు అమెరికన్ కంపెనీలను ఎందుకు మూసివేయరు?" అంటూ కేజ్రీవాల్ నిలదీశారు.

నష్టం మాకు.. పేరు కేంద్రానికా?

జీఎస్‌టీ తగ్గింపుపై మమత ఆగ్రహం

కోల్‌కత, సెప్టెంబర్ 22: జీఎస్‌టీ తగ్గింపు వల్ల ఆర్థిక నష్టాన్ని రాష్ట్రాలపై పడేసి తాను మాత్రం పన్నులు తగ్గించిన ఘనతను కేంద్రం కొట్టేస్తోందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విమర్శించారు. కోల్‌కతాలో సోమవారం దుర్గా పూజను ప్రారంభించిన అనంతరం మమత మాట్లాడుతూ ప్రజలపై అదనపు జీఎస్‌టీ భారాన్ని తగ్గించాలని కోరింది ముందుగా తానేనని చెప్పారు. పతి రాష్ట్రం ఆదాయ లోటును భర్తీ చేసుకునేందుకు మార్గాలు వెతుక్కోవలసి ఉంటుందని మమత చెప్పారు. కొత్త జీఎస్‌టీ రేట్ల వల్ల పశ్చిమ బెంగాల్‌కు సుమారు 20,000 కోట్ల రెవెన్యూ నష్టం ఏర్పడగలదని ఆమె అంచనా వేశారు.

పైలట్‌ని తప్పుపట్టడం దురదృష్టకరం

ఎయిరిండియా విమాన ప్రమాదంపై సుప్రీం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22: ప్రాథమిక దర్యాప్తు నివేదిక ఆధారంగా పైలట్లను నిందించడం బాధ్యతారాహిత్యమని గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదంపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తును కోరుతూ దాఖలైన పిల్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఆక్షేపించింది. పైలట్ ఏ లేదా బీ బాధ్యులని రేపు ఎవరైనా బాధ్యతారహితంగా నిందిస్తే ఆ కుటుంబం క్షోభపడుతుందని, దర్యాప్తు పూర్తయ్యేవరకు గోప్యతను పాటించడం ముఖ్యమని జస్టిస్‌లు సూర్యకాంత్, ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది.

రాజు దాదా.. కోసా దాదా ఎన్‌కౌంటర్

మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

నేలకొరిగిన ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు

- ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో ఎదురుకాల్పులు
- సత్యనారాయణరెడ్డి, రామచంద్రారెడ్డి మృతి
- ఇద్దరూ తెలంగాణకు చెందిన నేతలే
- ఇరువురిపై రూ.80 లక్షలకుపైగా రివార్డు

కొత్తగూడెం ప్రగతి మైదాన్/సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 22: మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య సోమవారం జరిగిన భీకర పోరులో ఇద్దరు మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు మృతిచెందారు. ఇద్దరూ తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వారే. ఎన్‌కౌంటర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. ఇది భద్రతా దళాలకు అతి పెద్ద విజయంగా ఆయన అభివర్ణించారు. అలాగే నక్సల్స్‌పై ఇది నిర్ణయాత్మక గెలుపుగా ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి ప్రశంసించారు. ఎన్‌కౌంటర్ వివరాల్లోకి వెళితే.. ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దు నారాయణ్‌పూర్ జిల్లా అబూజ్‌మడ్ ఇలాకాలోని మూస్ఫర్షి అడవుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నట్లు సమాచారం రావడంతో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర భద్రతా బలగాలు సంయుక్తంగా ఆ ప్రాంతంలో సెర్చింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు ఎదురుపడటంతో కొన్ని గంటల పాటు కాల్పులు చోటు చేసుకున్నాయి. తర్వాత జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు చేపట్టగా ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందినట్టు గుర్తించారు. తర్వాత మృతదేహాలతోపాటు వారికి సంబంధించిన ఆయుధ, వస్తు సామగ్రిని భారీగా స్వాధీనం చేసుకున్నారు.



రామచంద్రారెడ్డి(ఫైల్), సత్యనారాయణరెడ్డి

ఇద్దరూ తెలంగాణకు చెందిన వారే

ఎన్‌కౌంటర్ మృతుల్లో ఒకరు తెలంగాణ రాష్ట్రం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోహెడ మండలం తీగలకుంటపల్లికి చెందిన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, మోస్ట్ వాంటెడ్ కట్టా రామచంద్రారెడ్డి అలియాస్ రాజు దాదా అలియాస్ వికల్ప్(63) కాగా.. మరొకరు అదే జిల్లా తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లెకు చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కోసా దాదా(67)గా పోలీసులు గుర్తించారు. రామచంద్రారెడ్డి చాలా కాలంగా కేంద్ర కమిటీలో కొనసాగుతుండగా.. సత్యనారాయణరెడ్డి సైతం దండకారణ్యం ప్రత్యేక ప్రాంతీయ కమిటీలో మూడు దశాబ్దాలుగా పనిచేశారు. వీరిద్దరూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, అనేక దాడులు, ప్రతి దాడుల్లో కీలకంగా వ్యవహరించారు. ఇటీవల మావోయిస్టు పార్టీ లేఖలు సైతం వికల్ప్ పేరిట విడుదలైన విషయం విదితమే. సత్యనారాయణరెడ్డి, రామచంద్రారెడ్డి ఇద్దరిపై చెరో రూ.40 లక్షలు చొప్పున మొత్తం రూ.80 లక్షల పైనే రివార్డులు ఉన్నాయి.

పిన్న వయసులోనే అన్నలతో వెళ్లి..

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లెకు చెందిన కడారి సత్యనారాయణరెడ్డి పిన్న వయసులోనే అన్నలతో కలిసి అడవులకు వెళ్లాడు. ఆఖరి సంతానమైన కడారి సత్యనారాయణరెడ్డికి కమ్యూనిస్టు భావాలు ఉండడంతో చదువుకుంటున్న సమయంలోనే అడవి బాట పట్టాడు. పెద్దపల్లిలో జిల్లాలో ఐటీఐ చేస్తున్న సమయంలో ఓ గొడవలో హత్య జరుగగా, తరువాత అజ్ఞాతంలోకి వెళ్లి అన్నలతో కలిసి మావోయిస్టుగా మారాడు. ఇక అప్పటి నుంచి ఇంటి వైపు కూడా చూడలేదు.

అగ్ర నాయకులు ఒక్కొక్కరుగా..

గత ఆరు నెలలుగా మావోయిస్టు పార్టీ నాయకత్వానికి, క్యాడర్‌కి పెద్ద ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. ఛత్తీస్‌గఢ్ దండకారణ్యాన్ని కేంద్రంగా చేసుకుని కేంద్రం తలపెట్టిన ఆపరేషన్ కగార్, ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ వంటి దాడుల్లో మావోయిస్టు పార్టీకి చెందిన కీలక నాయకులు మృతిచెందారు. ఆ పార్టీ సుప్రీం లీడర్ నంబాల కేశవరావు మొదలుకుని, వివేక్ మాంఝి(జార్ఖండ్), సుధాకర్, గాజర్ల రవి, మోడెం బాలకృష్ణ, చలపతి, రఘునాథ్ హేమ్‌బ్రహ్మ(జార్ఖండ్), రామ్‌ఖెల్వాన్(జార్ఖండ్) వంటి నేతలు నేలకొరిగారు



సొంత ప్రజలపై పాక్ బాంబులు!

- **ఖైబర్ పఖ్తుంఖ్వాలో మహిళలు, చిన్నారులు సహా 30 మంది మృతి**
- **టీపీపీ లక్ష్యంగా దాడులు చేశామని పాకిస్థాన్ వాయుసేన వెల్లడి**

ఇస్లామాబాద్: పాకిస్థాన్ తన సొంత ప్రజలపైనే బాంబులు కురిపిస్తున్నది. ఖైబర్ పఖ్తుంఖ్వాపై సోమవారం చైనా తయారీ జే-17 యుద్ధ విమానాలతో కురిపించిన 8 ఎల్ఎస్-6 బాంబులు 30 మందిని బలిగొన్నాయి. ఈ బాంబులు లేజర్ గైడెడ్ ప్రెసిషన్ మ్యునిషన్స్. తీరహ్ లోయలోని ఓ గ్రామంపై తెల్లవారుజామున 2 గంటలకు ఈ దాడి జరిగింది. ఈ ప్రాంతంలో ఇప్పటికే ఉగ్రవాద దాడులు పెరిగాయి. తాజా దాడుల్లో సంభవించిన మరణాలతో స్థానికుల్లో ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. గత వారం స్వాట్ లోయలోని మింగోరా పట్టణంలో జరిగిన నిరసన కార్యక్రమానికి వేలాది మంది హాజరయ్యారు. ప్రభుత్వం సత్వరమే శాంతిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పాక్ మీడియా కథనాల ప్రకారం, ఖైబర్ పఖ్తుంఖ్వాలో తెహరీక్-ఏ-తాలిబన్(టీపీపీ) బాంబుల తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నదని, అందుకే దాడి చేశామని పాకిస్థాన్ వాయుసేన చెప్తున్నది. ఈ ఉగ్రవాద సంస్థ అఫ్గానిస్థాన్‌లో ఉందని, దానికి అఫ్గాన్ ప్రభుత్వంతో అనుబంధం ఉందని చెప్తున్నది. ఈ ఆరోపణలను అఫ్గాన్ ప్రభుత్వం తోసిపుచ్చుతున్నది. హింసను నియంత్రించడంలో పాక్ విఫలమవుతున్నదని ఆరోపిస్తున్నది. పాకిస్థాన్ ప్రధాన ప్రతిపక్ష పార్టీ పాకిస్థాన్ తెహరీక్-ఏ-ఇన్సాఫ్ ఇచ్చిన ఎక్స్ పోస్ట్‌లో, మాటల్లో చెప్పలేనంత విషాదం జరిగిందని తెలిపింది. బాంబులు, డ్రోన్ దాడుల వల్ల విద్వేష బీజాలు నాటుకున్నాయని పేర్కొంది.

విమానం ఎగురుతుండగా కాక్‌పిట్‌లోకి ప్యాసింజర్!

బెంగళూరు-వారణాసి విమానంలో ఘటన

బెంగళూరు:బెంగళూరు నుంచి వారణాసి వెళ్తున్న ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో సోమవారం అనూహ్య సంఘటన జరిగింది. లావేటరీ కోసం వెతుకుతూ ఓ ప్రయాణికుడు కాక్‌పిట్ ప్రవేశ ప్రాంతంలోకి వెళ్లారు. సిబ్బంది ఆయనను అడ్డుకున్నారు. వారణాసి విమానాశ్రయంలో దిగిన వెంటనే అతడిని సీఐఎస్‌ఎఫ్ అధికారులు అరెస్ట్ చేసి, పోలీసులకు అప్పగించారు. వారణాసిలోని ఫూల్‌పూర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ప్రవీణ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, కాక్‌పిట్ తలుపును తెరిచేందుకు ప్రయత్నించినట్లు ఒక వ్యక్తిపై కేసు నమోదైనట్లు చెప్పారు.

ల్యాండింగ్ గేర్‌లో దాక్కొని ఢిల్లీకి అఫ్గాన్ బాలుడు!

అదే విమానంలో వెనక్కి

న్యూఢిల్లీ: విమానం చక్రాల వద్ద ఉండే ల్యాండింగ్ గేర్ కంపార్ట్‌మెంట్ లోపల దాక్కుని ఓ అఫ్గానిస్థాన్ బాలుడు(13) ఆదివారం కాబుల్ నుంచి ఢిల్లీ చేరుకున్నాడు. ఈ విషయాన్ని గుర్తించిన వెంటనే ఆ బాలుడిని అఫ్గాన్‌కు పంపించివేసినట్లు సోమవారం అధికారులు వెల్లడించారు. ఉదయం నంబర్ ఆర్‌క్యూ-4401 విమానం చుట్టూ తిరుగుతున్న ఓ బాలుడిని గుర్తించిన కేఏఎం ఎయిర్‌లైన్స్ అధికారులు వెంటనే సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం అందించారు. ఆ విమానం ల్యాండింగ్ అయి అప్పటికి అరగంట మాత్రమే అయింది. విమానంలోని వెనుక సెంట్రల్ ల్యాండింగ్ గేర్ కంపార్ట్‌మెంట్ లోపల దాక్కుని తాను ప్రయాణించినట్లు ఆ బాలుడు వెల్లడించాడు.

కోవర్ట్ ఆపరేషన్‌తోనే హత్య

అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌పై తెలంగాణ పౌరహక్కుల సంఘం ఆగ్రహం

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ అడవుల్లో ఈ నెల 20న జరిగిన ఎన్‌కౌంటర్‌కు కోవర్టు ఆపరేషనే కారణమని తెలంగాణ పౌర హక్కుల సంఘం ఆరోపించింది. ఆ ఎన్‌కౌంటర్‌లో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కట్ట రామచంద్రారెడ్డి అలియాస్ రాజు, కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కోస మృతి చెందారు. ఈ ఎన్‌కౌంటర్ బూటకమని సంఘం నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్ర కమిటీ సభ్యులు సాధారణంగా గార్డుల రక్షణ వలయంలో ఉంటారని, వారు చనిపోయారంటే, వారికి రక్షణగా ఉన్న గార్డులు కూడా చనిపోయే ఉంటారని, కానీ ఆ విషయాన్ని పోలీసులు ప్రకటించలేదని గుర్తుచేశారు. కాబట్టి ఈ ఎన్‌కౌంటర్ కచ్చితంగా కోవర్ట్ ఆపరేషన్‌లో భాగంగానే జరిగినట్టు అర్థమవుతున్నదని చెప్పారు. మావోయిస్టులపై 21 నెలలుగా కేంద్ర చేస్తున్న యుద్ధాన్ని నిలిపివేసి, ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. మావోయిస్టులతో వెంటనే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

గదిలో బంధించి.. పామును వదిలి

కట్నం కోసం అత్తింటి వారు దారుణం

కాన్పూర్: కట్నం కోసం అత్తింటి వారు కోడలిపై దారుణానికి పాల్పడ్డారు. ఆమెను గదిలో బంధించి అందులోకి పామును వదిలారు. ఈ ఘటన యూపీలోని కాన్పూర్ జిల్లాలో చోటుచేసుకుంది. రేష్మా వివాహం 2021లో షానవాజ్‌తో జరిగింది. పెండ్లయినప్పటి నుంచి వారు కట్నం కోసం వేధించేవారు. ఇటీవల రేష్మా కుటుంబం వారికి రూ.1.5 లక్షలు ఇచ్చారు. దీనికి సంతృప్తి పడని అత్తింటి వారు ఈ నెల 18న ఆమెను గదిలో బంధించి గదిలోకి విష సర్పాన్ని వదిలారు. అది కాలిపై కాటేయడంతో ఆమె అరిచింది. దీంతో తలుపులు తెరిచిన అత్తింటి వారు నవ్వుతూ ఆమెను చూశారే తప్ప దవాఖానకు తీసుకు వెళ్లలేదు. బాధితురాలు ఎలాగోలా తన సోదరికి ఫోన్ చేయడంతో ఆమె వచ్చి రేష్మాను దవాఖానకు తరలించడంతో ప్రాణాలతో బయటపడింది. భర్తతో పాటు అత్తింటి వారిని అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

భారతీయ శాటిలైట్లకు 'బాడీగార్డులు'!

- నిరుడు మన దేశ శాటిలైట్‌కు తప్పిన ప్రమాదం
- 'ఆపరేషన్ సిందూర్'లో శాటిలైట్ల పాత్ర కీలకం
- అనూహ్య పరిణామాలను తిప్పికొట్టేందుకు భారత్ యత్నాలు



న్యూఢిల్లీ: భూ కక్ష్యలోకి పంపిన ఉపగ్రహాలను కాపాడుకోగలిగే సామర్థ్యాన్ని మరింత పెంచుకునేందుకు భారత్ ప్రయత్నిస్తున్నది. కక్ష్యలో తిరిగే రోదసి నౌకకు ఎదురయ్యే ముప్పును గుర్తించి, తిప్పికొట్టేందుకు బాడీగార్డ్ శాటిలైట్లను అభివృద్ధి చేయాలని భారత ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. పాకిస్థాన్‌పై మే నెలలో నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్'లో శాటిలైట్ల పాత్ర కూడా చాలా ముఖ్యమైనది. ఈ వివరాలను తెలిసిన అధికారులను ఉటంకిస్తూ 'బ్లూమ్‌బర్గ్' ఈ కథనాన్ని ప్రచురించింది.

ఇవి ఎందుకంటే?

ఇస్రోకు చెందిన ఓ ఉపగ్రహం భూమిపై నుంచి సుమారు 500-600 కి.మీ. ఎత్తులో కక్ష్యలో తిరుగుతున్నది. నిరుడు ఈ ఉపగ్రహానికి దాదాపు 1 కిలోమీటర్ దూరానికి ఓ పొరుగు దేశపు ఉపగ్రహం వచ్చింది. అయితే, పెద్ద ప్రమాదం తప్పింది. ఇస్రో శాటిలైట్ భూమిపై గల వస్తువులు, లక్ష్యాలను మ్యాపింగ్, మానిటరింగ్ వంటి సైనికపరమైన కార్యకలాపాలను నిర్వహిస్తున్నది. ఉపగ్రహాలు ఒకదానికొకటి ఢీకొట్టే పరిస్థితులు ఉత్పన్నమైనపుడు, ఆ ప్రమాదాన్ని నివారించవలసి ఉంటుంది. దీనిపై ఇస్రో, అంతరిక్ష శాఖ స్పందించలేదు.

ఉపగ్రహ రక్షణ ప్రాజెక్టు

కక్ష్యలోకి మరిన్ని భద్రతాపరమైన శాటిలైట్లను పంపించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. సుమారు 50 నిఘా ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపించేందుకు ప్రయత్నిస్తున్నది. ఈ ప్రాజెక్టు కోసం సుమారు రూ.27 వేల కోట్లు ఖర్చవుతుంది. వీటిలో మొదటి ఉపగ్రహాన్ని వచ్చే సంవత్సరం ప్రయోగించే అవకాశం ఉంది. గడచిన ఏడు దశాబ్దాల్లో చైనా, పాకిస్థాన్‌లతో భారత్ యుద్ధం చేసింది. పాకిస్థాన్‌కు 8, భారత్‌కు దాదాపు 100, చైనాకు 930కి పైగా శాటిలైట్లు ఉన్నాయి. అంతరిక్షంలో చైనా శాటిలైట్లు పెను ముప్పుగా మారుతున్నాయని భారత్, అమెరికా అధికారులు హెచ్చరిస్తున్నారు. న్యూఢిల్లీలో జూన్‌లో నిర్వహించిన సెమినార్‌లో ఇండియన్ ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ మాట్లాడుతూ, చైనా శాటిలైట్ ప్రోగ్రామ్ సంఖ్యాపరంగా, ఆధునికతపరంగా కూడా వేగంగా విస్తరిస్తున్నదని చెప్పారు. దీనికి సరైన పరిష్కారాన్ని కనుగొనేందుకు భారత ప్రభుత్వం స్టార్టప్ కంపెనీలతో కలిసి పని చేస్తున్నది. ఈ చర్చలు ప్రస్తుతం ప్రారంభ దశలో ఉన్నాయి. లైట్ డిటెక్షన్ అండ్ రేంజింగ్ శాటిలైట్లను ప్రయోగించాలన్న లక్ష్యంతో వీరు పని చేస్తున్నారు.

అంతరిక్షంలో రష్యా యుద్ధం!

- **పాశ్చాత్య దేశాల శాటిలైట్లపై లేజర్ దాడులు**
- **ఫ్రెంచ్ మేజర్ జనరల్ విన్సెంట్ చుస్సీయూ హెచ్చరిక**

పారిస్: రష్యా దాడులు అంతరిక్షంలో పెరిగినట్లు ఫ్రెంచ్ మేజర్ జనరల్ విన్సెంట్ చుస్సీయూ పాశ్చాత్య దేశాలను హెచ్చరించారు. శాటిలైట్లకు అంతరాయాలు కలిగించడం కోసం రష్యా రకరకాల పద్ధతులను పాటిస్తున్నదన్నారు. జామింగ్, లేజర్స్, సైబర్ దాడులు వంటివి సర్వ సాధారణ విషయంగా మారిపోయాయని తెలిపారు. 'రాయిటర్స్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, అంతరిక్షం పూర్తి స్థాయి యుద్ధ క్షేత్రంగా మారిందని చెప్పారు. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం విస్తృత స్థాయికి చేరినప్పటి నుంచి పాశ్చాత్య దేశాల శాటిలైట్లపై రష్యా దాడులు పెరిగాయన్నారు. 'ఆర్బిటాల్ టుడే' వెల్లడించిన వివరాల ప్రకారం, రష్యన్, పాశ్చాత్య దేశాల శాటిలైట్స్ ఒకదానికొకటి చేరువగా రావడం అత్యంత సాధారణ విషయంగా మారింది. రష్యా వల్ల ఎదురవుతున్న ముప్పు గురించి ప్రపంచ దేశాలను అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ హెచ్చరిస్తున్నాయి.

1300 ఏఈ పోస్టులను భర్తీచేయండి

- టీఎస్ఈఏఈఏ ఆధ్వర్యంలో వినతులు

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : టీజీట్రాన్స్‌కోలో ఖాళీగా ఉన్న 1,300 అసిస్టెంట్ ఇంజినీర్ పోస్టులను వెంటనే భర్తీచేయాలని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ అసోసియేషన్(టీఎస్ఈఏఈఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ట్రాన్స్‌కో సర్కిల్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల పవన్ మాట్లాడుతూ.. ట్రాన్స్‌కోలో ఇంజినీర్ల కొరత వేధిస్తున్నదని పేర్కొన్నారు. 2018 తర్వాత నియామకాలు ఆగిపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. తక్షణమే ఏఈ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

టీజీపీఎస్సీకి కొత్త సభ్యులు

- ముగ్గురిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : ఖాళీలతో కుదేలవుతున్న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ)కు ముగ్గురు కొత్త సభ్యులు వచ్చారు. సీ చంద్రకాంత్‌రెడ్డి, విశ్వప్రసాద్, ప్రొఫెసర్ ఎల్ లక్ష్మీకాంత్‌రాథోడ్‌లను సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. అయితే, ఐజీ కేడర్ ఐపీఎస్ అధికారి అయిన విశ్వప్రసాద్‌ను కమిషన్ సభ్యుడిగా నియమించడం గమనార్హం. ప్రొఫెసర్ రాథోడ్ గతంలో పాలమూరు విశ్వవిద్యాలయం వీసీగా పనిచేశారు. చంద్రకాంత్‌రెడ్డి ఇప్పటివరకు జీహెచ్ఎంసీలో అడిషనల్ కమిషనర్‌గా ఉన్నారు. టీజీపీఎస్సీలో పది మంది సభ్యులు ఉండాల్సి ఉండగా, గతంలో నియమించిన పాల్వాయి రజినికుమారి, ప్రొఫెసర్ నర్రి యాదయ్య, అమీరుల్లా ఖాన్‌తో కలిపి మొత్తం ఆరుగురిని నియమించినట్టైంది.

ఆర్టీసీ కార్మికులకు 6వేల దసరా అడ్వాన్స్

- 10వేలు ఇవ్వాలని కార్మిక సంఘాల డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ కార్మికులకు దసరా పండుగ అడ్వాన్స్ కింద యాజమాన్యం రూ.6 వేలు ఇవ్వనున్నది. అయితే కనీసం రూ.10వేలు అడ్వాన్స్ ఇవ్వాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. అడ్వాన్స్ ఇవ్వడం ఆనవాయితీగా కొనసాగుతున్నదని, రూ.6వేలతో ఇంటిల్లిపాదికి కొత్త బట్టలు కూడా రావని తెలిపాయి. పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకొని అడ్వాన్స్ ఇస్తే బాగుంటుందని పేర్కొన్నాయి. సింగరేణి సంస్థలో కార్మికులకు ఇస్తున్నట్టే ఆర్టీసీ కార్మికులకు కూడా ఒక నెల జీతం ఇచ్చేలా సీఎం ప్రకటన చేయాలని కోరాయి.

సామూహిక దాడిపై దర్యాప్తు జరపాలి

- టీజీజీడీఏ రాష్ట్ర అధ్యక్షుడు నరహరి డిమాండ్
- మహబూబాబాద్ జిల్లా దవాఖాన సూపరింటెండెంట్‌పై దాడికి ఖండన

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): మహబూబాబాద్ జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌పై జరిగిన సామూహిక దాడి ఘటనపై దర్యాప్తు జరపాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరహరి కోరారు. డాక్టర్ శ్రీనివాస్‌పై మూకుమ్మడి దాడి సరికాదని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నామని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పోలీస్ శాఖ తక్షణమే స్పందించి, నిష్పాక్షికంగా దర్యాప్తు చేయాలని విజ్ఞప్తి చేశారు.

రిటైర్డ్ ఆర్మీని సెక్యూరిటీగా నియమించాలి

- అధికారులకు మంత్రి రాజనర్సింహ ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ దవాఖానల్లోని సెక్యూరిటీ సిబ్బందిలో కొంత శాతం రిటైర్డ్ ఆర్మీని నియమించాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. ఫిజికల్ ఫిట్‌నెస్ ఉండి, 50 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్నవారినే నియమించుకునేలా టెండర్ కండీషన్ ఉండాలని తెలిపారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానల నిర్వహణలో శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ వర్కర్ల పాత్ర అత్యంత కీలకమైనదని చెప్పారు. వర్కర్ల వేతనాల చెల్లింపులో కాంట్రాక్టర్ల అక్రమాలకు అవకాశముండొద్దని, ఖాతాలోనే జీతం జమయ్యేలా కండీషన్ ఉండాలని సూచించారు.

డెక్కన్ పరిశ్రమ వద్ద అట్టుడికిన ఆందోళన

- మరణించిన కార్మికుడికి పరిహారం కోసం ధర్నా
- రాళ్లు రువ్విన యూపీ కార్మికులు.. సెక్యూరిటీ గది, పోలీస్ వాహనం ధ్వంసం
- పలువురు పోలీసులకు గాయాలు



డెక్కన్ ఫ్యాక్టరీ ఆవరణలో రాళ్లు రువ్వుతున్న యూపీకి చెందిన కార్మికులు



కార్మికుల దాడిలో గాయపడిన పోలీస్

పాలకవీడు, సెప్టెంబర్ 22: సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం భవానిపురంలోని డెక్కన్ సిమెంట్ పరిశ్రమ వద్ద సోమవారం కార్మికులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. ఆందోళనను అడ్డుకునేందుకు యత్నించిన పోలీసులపై కార్మికులు రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో పలువురు పోలీసులకు గాయాలు కాగా, పోలీస్ వాహనం, సెక్యూరిటీ గది అద్దాలు ధ్వంసమయ్యాయి. ఎస్సై కోటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని బలియా జిల్లా కాకర్‌ఘూట్‌కు చెందిన వినోద్ (45) అవాక్ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా వచ్చి డెక్కన్ ఫ్యాక్టరీలో కూలీగా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం 5గంటల సమయంలో బట్టలు ఉతుకుతుండగా గుండెపోటుతో మరణించాడు. వినోద్ మృతికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయంపరిశ్రమ వద్ద తోటి కార్మికులు ధర్నా నిర్వహించారు. పరిస్థితి అదుపు తప్పుతుందని భావించిన పోలీసులు నలుగురు కార్మికులు వస్తే పరిశ్రమ ప్రతినిధులతో మాట్లాడి పరిహారం ఇప్పించే ప్రయత్నం చేస్తామని చెప్పారు. కార్మికులు వినకుండా మూకుమ్మడిగా రాళ్లతో పోలీసులపై రాళ్లు రువ్వారు. ఈ దాడిలో పలువురు పోలీసులకు గాయాలయ్యాయి. సెక్యూరిటీ గది, పోలీస్ వాహనం అద్దాలు ధ్వంసమయ్యాయి. ప్రస్తుతం పరిశ్రమ వద్ద పోలీసులు పహారా కాస్తున్నారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ నరసింహ పరిశీలించారు. దాడి చేసిన వారిని పట్టుకునే పనిలో పోలీసులు ఉన్నట్టు ఎస్సై తెలిపారు.

వైద్యశాఖలో అవినీతి వైరస్!



మొదటిపేజీ తరువాయి...

తెగబడుతున్నారు. ప్రతి పనికీ ఓ రేట్ చొప్పున ఆమ్యామ్యాలు పుచ్చుకుంటున్నారు. వరుస అవినీతి ఆరోపణలతో గతంలోనే ఆ శాఖకు చెందిన ఆ కీలక విభాగాధిపతి సహా ఏడుగురు అధికారులకు సర్కారు షోకాజ్ నోటీసులను సైతం జారీచేసింది. అవినీతి బాగోతంపై విచారణకు అదే శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారిని సైతం ప్రభుత్వం నియమించింది. అయినా ఆ శాఖ అధికారుల తీరులో ఏ మాత్రం మార్పు రాలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు, సిబ్బంది ప్రమోషన్లు, కీలక ఫైళ్లు ముందుకెళ్లాలంటే ఆ శాఖలోని అధికారుల చేతులు తడపాల్సిందేనని అదే శాఖ ఉద్యోగులు వాపోతున్నారు. కీలక విభాగంలో తమ పనుల కోసం వచ్చే సిబ్బంది.. సంబంధిత శాఖ అధికారులను కలిసి తమ ఫైళ్లు అప్పజెప్పాల్సి ఉంటుంది. ఆ సమయంలో వారు ఫైళ్లు పెట్టేందుకు తమ చుట్టూ సిబ్బందిని తిప్పించుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో చేసేదేమీ లేక ఆ అధికారులను ప్రసన్నం చేసుకునేందుకు సిబ్బంది స్వయంగా జేబులు తడపాల్సి వస్తుందని తెలిసింది. అధికారులను దాటిన ఫైల్ విభాగాధిపతి టేబుల్‌పైకి చేరాల్సి ఉంటుంది. ఇక్కడే అసలు టాస్క్ మొదలవుతున్నట్టు సమాచారం. ప్రతీ ఫైలుకు ఓ రేట్ ఫిక్స్ చేసి సిబ్బంది నుంచి ముక్కుపిండి సదరు శాఖ అధికారులు నగదు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ప్రమోషన్లకే రూ.లక్షల్లో వసూలు చేస్తున్నట్టు పలువురు వాపోతున్నారు. ఉద్యోగుల వార్షిక, స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లకు, కొత్తగా నియమితులైన ఉద్యోగుల సర్వీస్ రెగ్యులరైజేషన్ వంటి చిన్న ఫైళ్లను సైతం నగదుకు ఆశపడి ఉద్దేశపూర్వకంగా క్లియర్ చేయడం లేదని ఆరోపణలున్నాయి. ఉద్యోగులు ఏదైనా కారణంతో దీర్ఘకాలిక సెలవులు పెడితే వాటిని మంజూరు చేసేందుకు సైతం డబ్బు ముట్టజెప్పాల్సిన దుస్థితి ఉన్నదంటే ఆ శాఖలో అవినీతి ఏ స్థాయిలో రాజ్యమేలుతున్నదో అర్థం చేసుకోవచ్చు.

పెద్దలకే సవాల్‌గా మారిన విభాగాధిపతి!

ఆ శాఖ కీలక విభాగాధిపతి తీరు అదే శాఖ పెద్దలకు సైతం సవాల్‌గా మారింది. ఆయనతోపాటు కొందరు అధికారులపై గతంలో ఆరోపణలు తీవ్రమవడంతో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులను జారీ చేశారు. చర్యలకు సైతం ప్రభుత్వ పెద్దలు ఉపక్రమించారు. ఇక తనపై వేటు తప్పదనే భావనకు వచ్చిక ఆ కీలక విభాగాధిపతి పీఎంవోలో పనిచేసే తన సోదరుడిని రంగంలోకి దించి చక్రం తిప్పినట్టు సమాచారం. సదరు ఉన్నతాధికారికి షోకాజ్ నోటీసులు అందినా, అవినీతి ఆరోపణలు హెచ్చుమీరుతున్నా, లెక్క చేయకుండా మళ్లీ అవినీతి దందాకు తెరలేపినట్టు ఆరోపణలున్నాయి. తన అవినీతికి ఎవరు అడ్డొచ్చినా వారిపై కీలక విభాగాధిపతి బ్లాక్‌మెయిల్‌కు దిగుతున్నట్టు గుసగుసలు. సదరు అధికారి తీరుపై ఆ శాఖలో పనిచేసే ఉన్నతస్థాయి అధికారులు సైతం పెదవి విరుస్తున్నారు. సదరు శాఖ కీలక విభాగాధిపతికి ఆరోగ్యశాఖ మంత్రి పేషీ కన్నా ఎక్కువ మంది అధికారులు ఉండటం సైతం హాట్ టాపిక్‌గా మారింది. ఇద్దరు ఓఎస్డీలు, ఇద్దరు ఆఫీసు సూపరింటెండెంట్లు, మరో ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు డీఈవోలు, ఆరుగురు అటెండర్లు ఆ విభాగంలో పనిచేస్తున్నారు. ఇదే శాఖ పరిధిలోని ఇతర విభాగాల్లో హెచ్‌వోడీల వద్ద ఈ స్థాయిలో సిబ్బంది లేకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో సిబ్బందికి అందే సేవల్లో పారదర్శకత కోసం ఫైళ్ల క్లియరెన్స్‌కు డెడ్‌లైన్ పెట్టాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఈ శాఖలో అవినీతిపై ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నట్టు తెలుస్తున్నది. కొంతమంది విజిలెన్స్ విభాగానికి సైతం లేఖలు రాసినట్టు సమాచారం.

అవినీతి ఉదంతాలు ఇవీ!

- వైద్యారోగ్య శాఖలో కీలకంగా ఉన్న ఆ విభాగంలో ఇటీవల 20 ఏండ్లకు పైగా అబ్‌స్కాండ్ (గైర్హాజరు) అయిన ఓ అధికారికి రూ.5 లక్షలు తీసుకొని సదరు శాఖ విభాగాధిపతి మళ్లీ పోస్టింగ్ ఇచ్చినట్టు ఆరోపణలున్నాయి.
- ఈ శాఖ పరిధిలో 1,200 మంది ఉద్యోగులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసింది. వారందరికీ రెండేండ్లు పూర్తికాగా ఇటీవల సర్వీస్ రెగ్యులరైజేషన్ కోసం ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.5 వేలు మొత్తంగా రూ.60 లక్షల వరకు వసూలు చేసినట్టు సమాచారం.
- రాష్ట్రంలోని ఓ జిల్లాలో ఓ వైద్యుడిని కలెక్టర్ సస్పెండ్ చేశారు. నిబంధనల ప్రకారం సస్పెన్షన్‌కు గురైన ఆ డాక్టర్‌కు అదే జిల్లాలో పోస్టింగ్ ఇవ్వకూడదు. అయితే సదరు శాఖ కీలక విభాగాధిపతి కనుసన్నల్లో తాజాగా ఆ వైద్యుడికి అదే జిల్లాలో పోస్టింగ్ ఇవ్వడం చర్చనీయాంశమైంది. ఇందుకు గాను రూ.5 లక్షలు వసూలు చేసినట్టు ఆరోపణలున్నాయి.
- తాజాగా స్టాఫ్ నర్సుగా పనిచేస్తూ ఎమ్మెస్సీ నర్సింగ్ చేసిన వారికి నర్సింగ్ కళాశాలల్లో లెక్చరర్‌గా ప్రమోషన్లు కల్పించేందుకు పెద్ద మొత్తంలో వసూళ్లకు తెగబడ్డట్టు ఆరోపణలు వచ్చాయి.
- నర్సింగ్ ఆఫీసర్లను, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లుగా, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లను డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్లుగా పదోన్నతులు కల్పించేందుకు భారీగా వసూళ్లకు పాల్పడినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి.

- ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రోడ్డెక్కిన విద్యార్థులు



ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో కళాశాలల విద్యార్థులు ర్యాలీ తీశారు. హైవే-44 సర్వీస్ రోడ్డుపై బైఠాయించారు. - అలంపూర్

- పింఛన్లు పెంచాలని ఆందోళన



కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల మొత్తాన్ని పెంచాలని డిమాండ్ చేస్తూ పెన్షన్‌దారులు సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ పంచాయతీ ఎదుట ధర్నా చేపట్టారు. - ఎల్లారెడ్డిపేట

- పెండింగ్ బిల్లులు చెల్లించాలని..



పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు సోమవారం రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. నిధులిచ్చి ఆదుకోవాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. - ఎల్లారెడ్డిపేట

ప్రైవేటు జాగ.. పెద్దల పాగా

మొదటిపేజీ తరువాయి...

సుబ్బారెడ్డి అని పేరు రాశారు. తాను జమ్మల నగేశ్ నుంచి ఎకరం భూమిని కొనుగోలు చేసినట్టు సుబ్బారెడ్డి డాక్యుమెంట్ సృష్టించాడు. అప్పటి నుంచి భూమిని ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నించినా ఎప్పటికప్పుడు రేఖారెడ్డి కుటుంబం నిలువరిస్తూ వచ్చింది. దీంతో చాలాకాలం పాటు ఆ భూమి వైపు కన్నెత్తి చూడని సుబ్బారెడ్డి ఇటీవల కాలంలో తిరిగి తన ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ నేతలను ఆశ్రయించడంతో ఎంపీ సహా కాంగ్రెస్ యువనేత ఒకరు ఆ బాధ్యతను భుజాన వేసుకున్నారు. ఓ మంత్రి పేషీని అడ్డాగా చేసుకొని చక్రం తిప్పారు. చివరకు సదరు మంత్రితో తహసీల్దార్‌కు ఫోన్ చేయించి సహకరించాలని సూచించినట్టు తెలిసింది. పోలీసులకు కూడా ఇదేరీతిన ఫోన్లు వెళ్లినట్టు ప్రచారం జరుగుతున్నది. అసలే అధికార పార్టీ నేతల అండ, పైగా మంత్రి నుంచి ఫోన్ కాల్స్.. ఇంకేముంది సుబ్బారెడ్డి మూడు రోజుల క్రితం 50 మందిని తీసుకెళ్లి రేఖారెడ్డి కుటుంబానికి చెందిన భూమి మీదకు వచ్చి ప్రహరీని తొలగించి, చెట్లను ధ్వంసం చేసి బీభత్సం సృష్టించాడు.

అధికార యంత్రాంగం సహకారం

రికార్డుపరంగా అది రేఖారెడ్డి భూమి అయినప్పటికీ రెవెన్యూ అధికారులు సుబ్బారెడ్డికి కూడా సర్వే రిపోర్టు ఇవ్వడం ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తుంది. తమ భూమి మీదకు అక్రమంగా వచ్చి ప్రహరీ కూల్చారని బాధితులు ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు విచారణ పేరిట తొలుత కేసు చేయకుండా తొక్కిపెట్టినట్టు తెలుసున్నది. చివరకు ఓ మంత్రి ఈ కబ్జా తతంగంలో కబ్జాదారులకు సహకారం అందిస్తున్నట్టు ప్రచారం జరిగింది. ఆదివారం రాత్రి వరకు విచారణ చేస్తున్నామంటూ దాటవేసిన పోలీసులు పొద్దుపోయిన తర్వాత కేసు నమోదు చేసినట్టు తెలుస్తున్నది. సుబ్బారెడ్డి నకిలీ డాక్యుమెంట్ సృష్టించడంలో కొందరు రెవెన్యూ అధికారుల సహకారం కూడా ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మా భూమిని కాపాడండి

రూ. 50 కోట్ల విలువైన తమ భూమికి నకిలీపత్రాలు సృష్టించి కొందరు కబ్జాకు ప్రయత్నిస్తున్నట్టు భూమి యజమానులు రజితారెడ్డి, రేఖారెడ్డి ఆరోపించారు. రాంపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామ పరిధిలో సర్వే నంబర్ 385లో 1999లో తమ కుటుంబ పెద్దలు ఎకరం కొనుగోలు చేశారని, అప్పటి నుంచి 26 ఏండ్లుగా వ్యవసాయం చేసుకుంటున్నామని తెలిపారు. 2016లో నాలా మార్పు చేయించి సర్వే చేయించామని, 2019లో సర్వే చేయించి హద్దులు గుర్తించి ప్రహరీ నిర్మించినట్టు చెప్పారు. అదే ఏడాది గుర్తు తెలియని వ్యక్తులు తమ పేర్లు తొలగించి సుబ్బారెడ్డి అని రాసి సర్వే నంబర్ 386 అని రాసుకున్నారని తెలిపారు. 2023లో పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. 2025, ఆగస్టు 16న సుబ్బారెడ్డి న్యాయస్థానాన్ని ఆశ్రయించారని, అక్కడ కేసు నడుస్తుండగానే తమపై కీసర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు.మూడ్రోజుల క్రితం సుబ్బారెడ్డి 50 మందితో వచ్చి భయపెట్టాడని, ప్రహరీ తొలగించి చెట్లను ధ్వంసం చేశారని ఆరోపించారు. అధికారులు సర్వే రిపోర్టు ఇద్దరికి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఫోర్జరీ డాక్యుమెంట్లు ఉపయోగించి ప్రహరీ కూల్చి, భూమిని కబ్జా చేసిన ఆరోపణలపై సుబ్బారెడ్డితోపాటు ఆయన అనుచరుపై కేసు నమోదు చేసినట్టు కీసర సీఐ ఆంజనేయులు తెలిపారు.

నేను భూమిని అమ్మింది రేఖారెడ్డికే

రాంపల్లిలోని సర్వే నంబర్ 385లో ఉన్న ఎకరం భూమిని 1999లో రేఖారెడ్డి కుటుంబానికే విక్రయించాం. సుబ్బారెడ్డి అనే వ్యక్తికి నేను భూమిని అమ్మలేదు. ఆయన వద్ద ఉన్నవి ఫోర్జరీ డాక్యుమెంట్లు. ఇలాంటి వ్యక్తులను కఠినంగా శిక్షించాలి.

–జమ్మల నగేశ్

తెలంగాణలో భారీగా ఎన్డీపీఎల్ రవాణా

- 1,704 మద్యం బాటిళ్లు స్వాధీనం
- రూ. 68.16 లక్షల మద్యం సీజ్ : ఎక్సైజ్ డైరెక్టర్ షానవాజ్ ఖాసిం

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్డీపీఎల్) భారీగా అక్రమ రవాణా అవుతున్నది. దసరా పండుగ సందర్భంగా కొందరు అక్రమార్కులు ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరలకు మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి, ఎయిర్‌లైన్స్, రైళ్లు, బస్సు మార్గాల్లో దొంగతనంగా సరఫరా చేస్తున్నారు. దీంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసిం ఈ నెల 15 నుంచి 30 వరకు ఎన్డీపీఎల్, సారా తయారీ, అమ్మకాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇందులో ఒక్క వారంలోనే 1704 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ 68.16 లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్, భూపాల్‌పల్లి.. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, సూర్యాపేట్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో నిత్యం ఎక్సైజ్ సిబ్బందితోపాటు ప్రత్యేక ఎక్సైజ్ టీమ్‌లు దాడులు నిర్వహించి సారాను అరికడుతున్నట్టు షానవాజ్ ఖాసిం తెలిపారు.

వంద ప్లాట్లకు వేలం..అమ్మింది మూడే!

మొదటిపేజీ తరువాయి...

వాణిజ్య, వ్యాపార, పారిశ్రామిక రంగాలతోపాటు, రియల్టీకి ప్రధాన వేదికగా నిలిచింది. ఐటీ రంగానికి దీటుగా రియల్ ఎస్టేట్ రంగంలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించింది. దీంతో ఎకరం రూ.100 కోట్లకు విక్రయించే స్థాయికి నగరం ఎదిగింది. నిర్మాణ రంగంలో హైదరాబాద్.. దేశంలోని అన్ని మెట్రో నగరాలకు గట్టి పోటీనిచ్చి, భారీ స్థాయిలో అమ్మకాలతో ఖజానాను కళకళలాడించింది. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అప్పటి ప్రభుత్వం మౌలిక వసతులపై ప్రధానంగా దృష్టి పెట్టింది. నగర ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే తాగునీరు, వైద్యం, ఉద్యోగ అవకాశాలను కల్పించి ఆర్థికంగా బలోపేతం చేసింది. దీంతో వారి కొనుగోలు సామర్థ్యం పెరిగి, రియల్ ఎస్టేట్ పెట్టుబడులకు ఆసక్తి చూపించారు. దీంతో ఏటా భూములు, ఇండ్ల ధరలు రాకెట్ వేగంతో దూసుకెళ్లేవి. ఇదంతా గతం. ఇప్పుడు 20 నెలల కాంగ్రెస్ పాలనలో పరిస్థితి తలకిందులైంది.



వేలంతో రియల్టీ గుట్టురట్టు

కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కూల్చివేతలకు దిగింది. ప్రభుత్వ భూముల ఆక్రమణల పేరిట పేదల ఇండ్లను నేలమట్టం చేసింది. అనుమతులు ఉన్నా రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులను కూడా భయభ్రాంతులకు గురిచేసింది. మూసీ ప్రక్షాళన పేరిట బఫర్ జోన్‌ను నిర్ధారించి, దశాబ్దాల కిందటి ఇండ్లను అక్రమ నిర్మాణాలంటూ ఏకంగా నోటీసులనే జారీచేసింది. ఇలా గడిచిన 20 నెలల్లో నగరంలోని రియల్ ఎస్టేట్ రంగాన్ని కాంగ్రెస్ సర్కార్ ముప్పుతిప్పలు పెట్టింది. దీంతో రిజిస్ట్రేషన్ ఆదాయంతోపాటు, భవన నిర్మాణ అనుమతులూ నిలిచిపోయాయి. ఇటీవల హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో జరిగిన భూముల వేలంలో ఈ విషయం తేలిపోయింది. మూడు ప్లాట్లు అమ్మడానికి రూ.కోట్లు ఖర్చు చేస్తే... కనీసం నిర్వహణ ఖర్చుల మేర పెరుగలేదు.

3 ప్లాట్లు అమ్మితే.. 50 కోట్లు రాలే

గతంలో కోకాపేట నియోపోలిస్‌లో ఒక్క ఎకరం రూ.100 కోట్లకు హెచ్ఎండీఏనే విక్రయించింది. ఇప్పుడు మూడు జిల్లాల పరిధిలో అభివృద్ధి చేసిన వెంచర్లలో 100 ప్లాట్లను వేలానికి పెడితే మూడింటినే విక్రయించింది. ఇందులో రెండు తుర్కంయాంజల్, ఒకటి పుప్పాలగూడ ల్యాండ్ పార్సిల్ ఉండగా, వీటి ద్వారా వచ్చిన ఆదాయం కూడా రూ.50 కోట్లు దాటలేదు. రంగారెడ్డి జిల్లా పరిధిలో గండిపేట, శేరిలింగంపల్లి మండలాల పరిధిలోని పుప్పాలగూడ, చందానగర్, బైరాగిగూడ, కోకాపేటలో సగటున అర ఎకరం ఉండే ప్లాట్లను విక్రయానికి పెట్టింది. ఇందులో ఏ ఒక్క ప్లాట్ అమ్ముడుపోలేదు. పుప్పాలగూడలోని 1,630 గజాల బిట్టుకు ఇద్దరు పోటీపడితే నిర్ధారించిన ధర కంటే గజానికి రూ.2వేలు పెరిగింది.

కొంప ముంచిన కాంగ్రెస్ విధానాలు

హైదరాబాద్ రియల్టీలో సంక్షోభ పరిస్థితులు రావడానికి కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేసిన విధానాలే ప్రధాన కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటికీ మార్కెట్ పుంజుకునే అవకాశం ఉన్నా.. అడ్డగోలు కూల్చివేతలు, నిర్మాణ అనుమతులపై అజమాయిషీ, పెద్దల పేరిట సొమ్ము చేసుకుంటున్న అవినీతి అధికారుల పనితీరే సిటీ రియల్టీకి ప్రధాన సమస్యగా మారుతున్నాయని వారు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా హెచ్ఎండీఏ పరిధిలో కొందరు ఉన్నతాధికారులు వసూళ్లే ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకుని అనుమతుల ప్రక్రియను ఇప్పటికీ శాసిస్తున్నారు. దీనికితోడు ఉన్నతస్థాయి అధికారుల నిర్లక్ష్యం భూముల వేలానికి ఆదరణ లేకుండా చేసిందనే అభిప్రాయం ఉన్నది.

బీ-క్యాటగిరీ సీట్ల భర్తీలో నిబంధనలకు నీళ్లు

పలు ప్రైవేట్ కళాశాలలపై పెద్దఎత్తున ఫిర్యాదులు

18 కాలేజీలకు ఉన్నత విద్యామండలి షోకాజ్ నోటీసులు

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : బీటెక్ మేనేజ్‌మెంట్ కోటా(బీ-క్యాటగిరీ) సీట్ల భర్తీలో పలు కాలేజీలు నిబంధనలకు నీళ్లు వదిలినట్టు రాష్ట్ర ఉన్నత విద్యామండలి గుర్తించింది. తమకు ఇష్టం వచ్చినట్టు సీట్లను భర్తీచేసిన 18 ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలకు షోకాజ్ నోటీసులిచ్చి వివరణ కోరింది. సంబంధిత కాలేజీల సీట్ల ర్యాటిఫికేషన్(ఆమోదాన్ని) పెండింగ్ పెట్టింది. కాలేజీలు లిఖిత పూర్వకంగా వివరణ ఇచ్చేవరకూ ఇది కొనసాగనున్నది. నోటీసులందుకున్న కాలేజీల్లో అన్ని ప్రముఖ కాలేజీలే ఉండటం గమనార్హం. బీటెక్‌లో 30 శాతం సీట్లను మేనేజ్‌మెంట్ కోటాలో భర్తీచేసుకునే అవకాశమున్నది. 15 శాతం సీట్లను ఎన్నారై కోటాలో భర్తీచేసుకోవాలి. ఈ సీట్లను జేఈఈ మెయిన్స్ ర్యాంకుల ఆధారంగా భర్తీచేయాలి. ఆ తర్వాత మిగిలిన సీట్లను ఎప్‌సెట్ ర్యాంక్, ఇంటర్ మెరిట్ ఆధారంగా నింపుకోవచ్చు. ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాతే కాలేజీలు ఆయా సీట్లను భర్తీచేసుకోవాలి. కానీ, కొన్ని కాలేజీలు నోటిఫికేషన్‌కు ముందే నిర్దేశిత ఫీజు కంటే ఎక్కువ ఫీజుకు సీట్లను నింపేసుకున్నాయి. దీంతో ఆయా కాలేజీలపై ఉన్నత విద్యామండలి కన్నెర్రచేసింది.

ఫిర్యాదుల నేపథ్యంలో నోటీసులు..

బీ-క్యాటగిరీ సీట్ల భర్తీలో జరిగిన అక్రమాలపై ఉన్నత విద్యామండలికి అనేక ఫిర్యాదులు వచ్చాయి. ముఖ్యంగా వీఎన్నార్ విజ్ఞానజ్యోతి, సీబీఐటీ, నారాయణమ్మ, గోకరాజు రంగరాజు, బీవీఆర్ఐటీ, సీవీఆర్ వంటి కాలేజీలపై మండలికి ఫిర్యాదులందాయి. ఈ నేపథ్యంలో ఉన్నత విద్యామండలి నోటీసులు జారీచేసింది. బీ-క్యాటగిరీ సీట్ల ర్యాటిఫికేషన్ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. రోజుకు 20 చొప్పున కాలేజీలు సమర్పించిన వివరాలను పరిశీలించేందుకు మండలి అధికారులు కమిటీని నియమించారు.

లా కోర్సుల్లో 3,644 సీట్ల భర్తీ

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : లా కోర్సుల్లో మరో 3,644 సీట్లు భర్తీ అయినట్టు ప్రవేశాల కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి సోమవారం వెల్లడించారు. మూడేండ్ల కోర్సులో 2,593, ఐదేండ్ల కోర్సులో 1,051 సీట్ల చొప్పున భర్తీ అయినట్టు తెలిపారు. సీట్లు పొందినవారు ఈ నెల 27లోగా కాలేజీల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుందని సూచించారు.

నేతాజీ సైనిక్ స్కూల్‌లో అడ్మిషన్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : కేంద్ర రక్షణశాఖ ప్రైవేట్ రంగంలో సైనిక్ స్కూల్‌ను మంజూరు చేసింది. విజయవాడ సమీపంలో ఈ స్కూల్ ఏర్పాటుకు అనుమతినిచ్చినట్టు పాఠశాల ఆర్గనైజింగ్ సెక్రటరీ లింగం సుధాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈ స్కూల్‌లో తెలంగాణ విద్యార్థులకు సీట్లు పొందే అవకాశమిచ్చిందని, 120 సీట్లుంటాయని, అఖిల భారత సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైనవారు అర్హులని పేర్కొన్నారు.

టెట్ అర్హత నుంచి మినహాయించండి : తపస్

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : ఉపాధ్యాయులను ఆందోళన కలిగిస్తున్న టెట్ అర్హత నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) డిమాండ్ చేసింది. తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్‌తో కూడిన ప్రతినిధి బృందం సోమవారం కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. 2010కి ముందు నియమితులైన టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఉండగా, ఇటీవల సుప్రీం కోర్టు తీర్పుతో మినహాయింపు లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తంచేశారు.

ఏపీపీలను ఎందుకు తొలగించారు?

- కారణాలేమిటో వివరించండి
- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- నేడు కొనసాగనున్న విచారణ

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): గత ప్రభుత్వ హయాంలో వివిధ కోర్టుల్లో నియమితులైన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లను (ఏపీపీ) కాంగ్రెస్ సర్కారు ఎందుకు తొలగించిందో కారణాలు చెప్పాలని, ఇందుకు సంబంధించిన వివరాలు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. ఎంతమందిని నియమించారో, ఎంతమందిని తొలగించారో, ఎంతమంది పనిచేస్తున్నారో తెలపాలని చెప్పింది. పనిచేస్తున్న వారి పదవీకాలం ఎంత ఉన్నదో వివరాలు సమర్పించాలని ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కోర్టుల నుంచి పలువురు ఏపీపీలను తొలగిస్తూ ప్రభుత్వం జారీచేసిన జీవోలను సవాలు చేస్తూ 13 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై సోమవారం విచారణ జరిపిన జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ ప్రభుత్వానికి నోటీసులు జారీచేశారు. రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ కోర్టులో పనిచేస్తున్న తనకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ప్రభుత్వం తొలగించిందని తెలుపుతూ న్యాయవాది టీ వెంటేశ్వరప్రసాద్ హై కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇదే తీరుగా మరో 12 మంది వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తమను తొలగిస్తూ ఈ నెల 10న జీవో జారీ అయ్యిందని, ఎందుకు తొలగిస్తున్నారో చెప్పలేదని, తమకు వాదన వినిపించే అవకాశం కూడా ఇవ్వకుండా హోంశాఖ జారీచేసిన జీవో చట్టవిరుద్ధమని ప్రకటించాలని పిటిషన్లల్లో పేర్కొన్నారు. తొలుత పిటిషనర్ల తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ఏపీపీలకు పదవీ కాలం పూర్తికాకుండానే ప్రభుత్వం ఏకపక్షంగా తొలగించిందని చెప్పారు. చట్టవ్యతిరేకంగా ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. వాదనలు విన్న హైకోర్టు వివరాలు సమర్పించాలని సర్కారును ఆదేశించింది.



కోర్టు ఉత్తర్వులను ఖాతరు చేయరా?

- ప్రభుత్వంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు నోటీసులు
- భూదాన్ భూముల్లో నిర్మాణాలపై కోర్టు ధిక్కరణ పిటిషన్

హైదరాబాద్,సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని భూదాన్ భూముల్లో నిర్మాణాలు చేపట్టరాదన్న ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశించినప్పటికీ అక్కడ నిర్మాణాలు జరుగుతుంటే కళ్లప్పగించి చూస్తూ ఉన్నారా అని మండిపడింది. ఉత్తర్వులకు విరుద్ధంగా ఐఏఎస్, ఐపీఎస్‌లు, వాళ్ల కుటుంబసభ్యులు, బంధువులు, ఇతర ప్రైవేటు వ్యక్తులు చేపట్టిన నిర్మాణాలపై నివేదిక ఇవ్వకపోవడానికి కారణం ఏమిటని నిలదీసింది. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి నోటీసులు జారీచేసింది. కోర్టు ధిక్కరణ పిటిషన్‌లో కౌంటర్లు దాఖలుచేయాలని ఆదేశించింది. పూర్తి వివరాలతో నివేదికను కూడా సమర్పించాలని చెప్పింది. తదుపరి విచారణను అక్టోబరు 10వ తేదీకి వాయిదా వేసింది. నాగారం గ్రామంలోని సర్వే నం. 181, 182, 194, 195ల్లోని భూదాన భూముల్లో భూదందా వెనుక ఉన్నతస్థాయి అధికారులు ఉన్నందున ఈ వ్యవహారంపై సీబీఐ, ఈడీలతో దర్యాప్తునకు ఉత్తర్వులు జారీచేయాలని కోరుతూ మహేశ్వరం మండలానికి చెందిన బిర్ల మల్లేశ్ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిని గతంలో విచారించిన హైకోర్టు, తాము తిరిగి ఉత్తర్వులు జారీచేసే వరకు సదరు భూముల్లో లావాదేవీలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, భూముల క్రయవిక్రయాలు చేయరాదని, నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని మధ్యంతర ఉత్తర్వులను జారీచేసింది. అయితే, ఆ స్థలాలకు ప్రహరీల నిర్మాణాలు చేయడం కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంటూ మల్లేశ్ దాఖలు చేసిన మరో పిటిషన్‌ను జస్టిస్ కే లక్ష్మణ్ సోమవారం విచారించారు. పిటిషనర్ న్యాయవాది వాదిస్తూ, గత జూన్‌లో ఈ భూములపై నివేదిక ఇవ్వాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీచేసినప్పటికీ నివేదిక ఇవ్వలేదని తెలిపారు. కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా ప్రహరీల నిర్మాణం చేపట్టిరని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన హైకోర్టు, గత ఉత్తర్వులకు వ్యతిరేకంగా చర్యలు ఉండటంపై అసంతృప్తిని వ్యక్తంచేసింది. కలెక్టర్‌కు నోటీసులు జారీచేసింది.

ఎట్టకేలకు కౌంటర్.. ప్రభుత్వం ఓకే

- త్వరలో కొలిక్కి రానున్న భాగ్యనగర్ టీఎన్జీవో సొసైటీ భూమి కేసు
- తదుపరి విచారణ అక్టోబర్ 8కి వాయిదా

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): శేరిలింగంపల్లి మండలం గోపన్నపల్లిలోని భాగ్యగనర్ టీఎన్జీవో సొసైటీ భూమి వివాదం కొలిక్కి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో త్వరలో కౌంటర్ పిటిషన్ వేస్తామని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం హైకోర్టుకు తెలిపింది. దీంతో తదుపరి విచారణను అక్టోబర్ 8కి వాయిదా వేస్తూ జస్టిస్ కే లక్ష్మణ్ ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్ ప్రభుత్వం గోపన్నపల్లి సర్వే నంబర్ 36లో ఏపీ ఎన్జీవోలకు 182 ఎకరాలు ఇచ్చింది. 2014లో ఆ భూములను తెలంగాణ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో ఉద్యోగులు కోర్టులో సవాలు చేశారు. అప్పటికే అక్కడ రూ.18 కోట్లతో లేఔట్ వేసి కొందరికి ప్లాట్లు కూడా కేటాయించారు. ఈ కేటాయింపులో సీనియార్టీ వివాదం తలెత్తడంతో వ్యవహారం కోర్టుకు చేరింది. ఆ భూమి థర్డ్ పార్టీలకు దక్కకుండా చర్యలు చేపట్టరాదని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సర్వే నంబర్ 36లో తమకు 17 ఎకరాల భూమి ఉన్నదని, సుప్రీంకోర్టులో కేసు గెలిచామని వినాయక్‌నగర్ హౌసింగ్ సొసైటీ వాదిస్తున్నది. ఈ వివాదం కోర్టులో ఉండగానే జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రార్‌కు కలెక్టర్ రాసిన లేఖ మరో వివాదానికి తెరతీసింది. ఆ భూమిలో ప్రైవేట్ స్థలాలు ఉన్నాయని పేర్కొంటూ.. వాటి రిజిస్ట్రేషన్లకు వీలుగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులు అమల్లో ఉండగా కలెక్టర్ లేఖ చెల్లదని భాగ్యనగర్ టీఎన్జీవో చెప్తున్నది. ఈ క్రమంలో భాగ్యనగర్ టీఎన్జీవో సంఘం వేసిన ప్రధాన పిటిషన్‌లో వినాయక్‌నగర్ సొసైటీ ఇంప్లీడ్ పిటిషన్ వేసింది. అప్పటి నుంచి కొనసాగుతున్న వివాదంలో ప్రభుత్వం ఇప్పటి వరకు కౌంటర్ దాఖలు చేయలేదు.

జుట్టుకు మెగ్నీషియం జట్టు

వయసుతో సంబంధం లేకుండా అందర్నీ వేధిస్తున్న సమస్య జుట్టు రాలడం. కొంతమందిలో అసలు జుట్టే పెరగట్లేదన్న ఆరోపణ ఉంటుంది. కానీ ఈ సమస్యలు వచ్చినప్పుడు అందరూ రకరకాల షాంపూలు, నూనెలు, సీరమ్‌లు అంటూ ప్రయోగాలు చేస్తారు తప్ప సమస్యకు మూలం కనుక్కోరు. నిజానికి జుట్టు ఆరోగ్యానికి శరీరంలోని మెగ్నీషియం స్థాయులకు దగ్గరి సంబంధం ఉంది. శరీరంలో మెగ్నీషియం లోపించినప్పుడే ఈ సమస్యలు వస్తాయి. ఇదే విషయాన్ని పరిశోధకులు ఎన్నో అధ్యయనాల్లో తేల్చారు కూడా. రోజువారీగా తీసుకునే ఆహారంలో శరీరానికి సరిపడా మెగ్నీషియం అందేలా చూసుకోవాలి. అలాగే వైద్యులను సంప్రదించి మెగ్నీషియం సప్లిమెంట్లు తీసుకోవచ్చు. మాడుకు రక్త ప్రసరణ బాగా జరగడంలో, హార్మోన్ల అసమతుల్యతను తగ్గించడంలో, క్యాల్షియం స్థాయులను క్రమబద్ధీకరించడంలో మెగ్నీషియం తోడ్పడుతుంది. తద్వారా జుట్టుకు ఆరోగ్యాన్ని అందిస్తుంది. మెగ్నీషియం లోపం వల్ల మాడుకు రక్త ప్రసరణ తగ్గడంతో పోషకాలు అందక జుట్టును సమస్యలు చుట్టుముడుతాయి. శరీరంలో సరైన మోతాదులో మెగ్నీషియం లేకపోతే, క్యాల్షియం ఎక్కువై కుదుళ్లు మూసుకుపోతాయి. దానివల్ల హెయిర్ సైకిల్ దెబ్బతింటుంది. అలాగే మెగ్నీషియం లోపం ఉన్నప్పుడు యాంటి ఇన్‌ఫ్లమేటరీ లక్షణం తగ్గి మాడుపై పుండ్లు, దురద లాంటి సమస్యలు వస్తాయి. శరీరానికి తగినంత మోతాదులో మెగ్నీషియం అందాలంటే ఈ కింద పేర్కొన్న ఆహార పదార్థాలకు మీ డైట్‌లో చోటివ్వండి.



- పాలకూర వంటి ముదురు ఆకుపచ్చ ఆకుకూరలు
- గుమ్మడి గింజలు, బాదం పప్పు, జీడిపప్పు, అవిసె గింజలు, చియా గింజలు
- బీన్స్, చిక్కుళ్లు, అన్నిరకాల పప్పులు
- అరటిపండ్లు, జామపండ్లు, కివీ, బొప్పాయి, అత్తి పండ్లు, ఖర్జూరాలు, అవకాడో

జిందగీ
ఊపిరి
నమస్తే తెలంగాణ హైదరాబాద్
మంగళవారం 23 సెప్టెంబర్ 2025
www.ntnews.com
10

తెలంగాణ మన్ను మనకిచ్చిన దన్ను!

బతుకమ్మ పండుగంటే రోజూ ఆటలూ పాటలూ ఉంటాయి. నలుగురూ ఒక్కచోట కలవడం, ఆనందంగా ముచ్చట్లాడటమూ కనిపిస్తుంది. ఇలా గుంపులుగా నృత్యం, గానం చేయడం అన్నది శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే విషయమనీ నిపుణులు చెబుతున్నారు. మరి తెలంగాణ మన్ను మనకిచ్చిన దన్ను ఏమిటో తెలుసుకుందాం.

క్రమబద్ధంగా వంగుతూ, నిలబడుతూ బతుకమ్మ ఆడుతారు. దీనివల్ల నడుముకు కావాల్సిన వ్యాయామం లభిస్తుంది. వెన్నెముక, నడుము సమస్యలు దూరం అవుతాయి.

చప్పట్లు కొట్టడం వల్ల అర చేతులలోని నరాల చివరలు ఉత్తేజితం అవుతాయి. ఫలితంగా, చేతులు, కండరాలకు రక్త ప్రసరణ సవ్యంగా సాగుతుంది. రక్త పోటు తగ్గి.. గుండె జబ్బులు రాకుండా ఉంటుంది.

ఆడటం వల్ల శరీరంలోని వివిధ కండరాల్లో కదలికలు ఏర్పడతాయి. దాంతో అవి దృఢంగా తయారవుతాయి. అంతేకాదు, ఎముకలు కూడా గట్టి పడతాయి. ఆస్టియోపోరోసిస్‌లాంటి వ్యాధులూ రాకుండా ఉంటాయి.

జానపదం, శాస్త్రీయం లేదా వెస్టర్న్... ఇందులో ఏ రకమైన నృత్యం చేయడమైనా సరే మన శరీర సమతుల్యతకు సహకరిస్తుంది. చక్కగా నిలబడేందుకు ఉపయోగపడే బ్యాలెన్సింగ్ వ్యవస్థ మెరుగుపడుతుంది.

పాడటం లేదా ఆడటం... ఈ రెండింటిలోనూ మనం దమ్మును పట్టి ఉంచాల్సి వస్తుంది. తద్వారా ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది.

నలుగురితో కలిసి పాడటం, ఆడటం అన్నది మనసును ఉత్తేజితం చేసే ప్రక్రియ. అందుకే ఈ సమయంలో హ్యాపీ హార్మోన్లుగా పిలిచే డోపమైన్, ఎండార్ఫిన్లు విడుదల అవుతాయి. దాని వల్ల ఒత్తిడి, కుంగుబాటు లాంటివి దూరమవుతాయి.

బృందంతో కలిసి గానం చేయడం, దానికి అనుగుణంగా నృత్యం చేయడం వల్ల మెదడులో వివిధ అంశాలను



అనుసంధానం చేసే ప్రక్రియ జరుగుతుంది. మనకు తెలియకుండానే ఎదుటి వ్యక్తులతో అది బంధాన్నీ ఏర్పరుస్తుంది. తద్వారా వయసు రీత్యా వచ్చే మతిమరుపులాంటి సమస్యలు చుట్టుముట్టవు.

సంగీతం, నృత్యం ఒకదానికి ఒకటి ఎలా అనుసంధానం అవుతాయో... వాటిని కలుపుతూ సాగే బతుకమ్మ ఆటకూడా మానసిక, శారీరక ఆరోగ్యాలు రెండింటికీ వరప్రదాయినే!

బి12 లోపించకుండా.. బీ అలర్ట్

విటమిన్ బి12 లోపంతో బాధపడుతున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతున్నది. ముఖ్యంగా బి12 లోపం వల్ల మహిళల్లో అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. నిజానికి ఇది మహిళల ఆరోగ్యానికి ఒక పవర్ హౌజ్ పోషకంలాంటిది. మెదడు పనితీరు, హార్మోన్ల సమతుల్యత, గుండె, ఎముకల ఆరోగ్యానికి ఎంతగానో తోడ్పడుతుంది. కానీ, విటమిన్ బి12 లోపిస్తే కలిగే రుగ్మతలు కూడా ఎక్కువే!



- విటమిన్ బి12 ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి తోడ్పడి, ఆక్సిజన్ ప్రవాహాన్ని మెరుగుపర్చి అలసటను దూరం చేస్తుంది.
- నాడీ వ్యవస్థపై ప్రభావం చూపిస్తుంది. ఇది నరాలు, మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది.
- హార్మోన్లను సమతుల్యం చేస్తుంది. ముఖ్యంగా ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్‌లను క్రమబద్ధీకరిస్తుంది.
- హోమోసిస్టీన్ స్థాయుల నియంత్రణకు విటమిన్ బి12 సహకరిస్తుంది. అలాగే ఎముకల దృఢత్వానికి తోడ్పడుతుంది.
- మహిళల్లో నెలసరిని క్రమబద్ధీకరించడంతో పాటు, గర్భిణిగా ఉన్నప్పుడు కడుపులోని బిడ్డ మెదడు ఎదుగుదలలో విటమిన్ బి12 కీలకంగా వ్యవహరిస్తుంది.

లోపిస్తే..: శరీరంలో విటమిన్ బి12 లోపించినప్పుడు.. అలసట, జ్ఞాపకశక్తి తగ్గడం, చర్మం పసుపు రంగులోకి రావడం, నోటిలో పుండ్లు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, కంటిచూపు మందగించడం, నెలసరి సమస్యలు, మానసిక ఆందోళన, అరచేతులు, అరికాళ్లలో తిమ్మిర్లు, మంటలు రావడం తదితర లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి పరిస్థితులు ఎదురైన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి. అలాగే ఆహారం విషయంలో కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలి.

ఏం తినాలి?: సహజ పద్ధతిలో విటమిన్ బి12 పొందాలంటే ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. గుడ్లు, పాలు, పెరుగు, చీజ్, పండ్లు, బీట్‌రూట్, పుట్టగొడుగులు, కోడి మాంసం, మేక మాంసం, చేపలు తీసుకోవడం వల్ల తగినంత బి12 లభిస్తుంది. సమస్య తీవ్రతనుబట్టి వైద్యుల పర్యవేక్షణలో ట్యాబ్లెట్లు, ఇంజెక్షన్లు తీసుకోవచ్చు.



ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడ చూసినా జలుబు, దగ్గు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు తదితర లక్షణాలతో జనం ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా గ్రేటర్‌లో ఈ లక్షణాలతో కూడిన రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. అయితే వర్షాకాలంలో ఏర్పడే వాతావరణ మార్పుల కారణంగానే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నట్లు వెల్లడిస్తున్నారు. ముఖ్యంగా హెచ్3ఎన్2 ఉపరకానికి చెందిన ఇన్‌ఫ్లూయెంజా.... పంజా విసురుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులతో సతమతమవుతున్న వారిలో దాదాపు 80 శాతం మంది ఇన్‌ఫ్లూయెంజా బాధితులే. ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. వర్షాకాలంలో దీనిప్రభావం అధికంగా ఉంటుంది. అయితే ఈ ఇన్‌ఫ్లూయెంజా లక్షణాలేంటి, ఇది రావడానికి గల కారణాలు, దీనికి అందుబాటులో ఉన్నచికిత్స, వైరస్ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం.


వణికిస్తున్న ఇన్‌ఫ్లూయెంజా

పిల్లలు, వృద్ధులు గర్భిణులు జాగ్రత్త

సాధారణంగా వర్షాకాలంలో గాలిలో తేమ శాతం అధికంగా ఉంటుంది. దీని వల్ల వాతావరణంలోని వైరస్‌లు చురుకుగా మారి గాలిలో తేలుతుంటాయి. శ్వాస తీసుకున్నప్పుడు ఇన్‌ఫ్లూయెంజా, ఇతర వైరస్‌లు సులభంగా మన శరీరంలోకి ప్రవేశించి ప్రభావం చూపుతాయి. ఫలితంగా ఆయా వైరస్‌లతో కూడిన జ్వరాలు, జబ్బులు వస్తాయి. ఇన్‌ఫెక్టెడ్ రోగి తుమ్మినప్పుడు గాని, దగ్గినప్పుడు గాని ఆ వ్యక్తి నోటి తుంపర్ల నుంచి వచ్చే వైరస్ ఎక్కువ దూరం వ్యాప్తి చెందుతుంది. దీంతో ఒకరి నుంచి మరొక్కరికి సులభంగా ఈ వైరస్ వ్యాపిస్తుంది. దీంతో ఒక ఇంట్లో వైరల్ ఫీవర్స్ వచ్చాయంటే వెంట వెంటనే పొరుగిళ్లలోని వారికి కూడా అంటుకునే అవకాశం ఉంటుంది.

సర్వసాధారణం

డెంగ్యూ, చికున్‌గున్యా వంటి విష జ్వరాలతో పోల్చితే ఇన్‌ఫ్లూయెంజా పెద్ద ప్రమాదకరం కాదు. కానీ, సకాలంలో చికిత్స తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తే మాత్రం ఇది ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది. ఇన్‌ఫ్లూయెంజా అనేది కరోనా తరహాలోనే అంటు వ్యాధి. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. సాధారణంగా రెండు రకాల ఇన్‌ఫ్లూయెంజా వైరస్‌లు సీజనల్‌గా ప్రభావం చూపుతుంటాయి. అంటే వర్షాకాలం, శీతాకాలంలో ఎ, బి అనే రకానికి చెందిన ఇన్‌ఫ్లూయెంజా వైరస్‌లు జనంపై ప్రభావం చూపుతాయి.



ఎ-రకం ఇన్‌ఫ్లూయెంజా: ఇది వర్షాకాలం, చలికాలంలో ఎక్కువగా ప్రభావం చూపుతుంది. ఈ ఫ్లూ సోకిన వారిలో జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లు నొప్పులు లాంటి లక్షణాలు కనిపిస్తాయి.

బి-రకం ఇన్‌ఫ్లూయెంజా: ఇది కూడా చల్లటి వాతావరణంలో అంటే వానాకాలం, చలికాలంలోనే ప్రభావం చూపుతుంది. దీని లక్షణాలు కూడా దాదాపు ఎ-రకం ఇన్‌ఫ్లూయెంజా లక్షణాలనే పోలి ఉంటుంది. సాధారణంగా వర్షాకాలంలో ఎ, బి రకం ఫ్లూలే అధికంగా వస్తుంటాయి.

పిల్లలు.. వృద్ధులపై ఎక్కువ ప్రభావం..

సాధారణంగా ఇన్‌ఫ్లూయెంజా అనేది ఎవరికైనా వచ్చిపోతుంది. కానీ, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో మాత్రం ఇది తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు ఎక్కువ. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, షుగర్, టీబీ, హెచ్ఐవీ, టీబీ, ఆస్తమా, లంగ్ ఇన్‌ఫెక్షన్ తదితర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రమాదకరంగా మారే అవకాశాలు ఉంటాయి. సింప్టమ్యాటిక్ ట్రీట్‌మెంట్‌తోనే తగ్గినప్పటికీ సకాలంలో సరైన చికిత్స తీసుకోకపోతే వైరస్ అనేది గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీలు వంటి అవయవాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు ఉంటాయి. ఫలితంగా ప్రధాన అవయవాలు దెబ్బతిని ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది. అందుకని సీజన్‌లలో వచ్చే జ్వరాలను ముఖ్యంగా ఇన్‌ఫ్లూయెంజా లాంటి జ్వరాలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో చికిత్స తీసుకోవడం శ్రేయస్కరం.

న్యుమోనియా ముప్పు..

చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు ఈ ఫ్లూ పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఇన్‌ఫ్లూయెంజా వల్ల న్యుమోనియా ఎటాక్ అయ్యే ప్రమాదం ఉంటుంది. న్యుమోనియా వచ్చి ఊపిరితిత్తులు మొత్తం ఇన్‌ఫెక్ట్ అవుతాయి. దీంతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడటమే కాకుండా సకాలంలో సరైన చికిత్స అందించకపోతే పరిస్థితి చేయిదాటవచ్చు. ప్రతి 10 మంది ఇన్‌ఫ్లూయెంజా బాధితుల్లో ఇద్దరు న్యుమోనియాకు గురవుతుంటారు. అందుకని ఈ వైరస్‌ను తేలికగా తీసుకోకూడదు. లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి



చికిత్స తీసుకోవాలి. ఇన్‌ఫ్లూయెంజాను నిర్ధారించేందుకు త్రోట్ స్వాబ్ పరీక్ష చేస్తారు. దీని ద్వారా వచ్చింది ఏ రకమైన వైరసో కూడా గుర్తించవచ్చు.

లక్షణాలు

- తీవ్రమైన జ్వరం
- దగ్గు, జలుబు
- ఒళ్లు నొప్పులు
- గొంతు నొప్పి
- ఆయాసం

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కరోనా నియమాలు పాటించడం ఉత్తమం
- ముఖానికి మాస్క్ ధరించాలి. దీని వల్ల ఫ్లూ నుంచి రక్షణ పొందవచ్చు
- ఏదైనా వస్తువును తాకిన వెంటనే చేతులను శానిటైజ్ చేసుకోవాలి
- భౌతిక దూరం పాటించాలి. దీని వల్ల వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందకుండా ఉంటుంది
- సాధ్యమైనంత వరకు చల్లటి పదార్థాలకు దూరంగా ఉండాలి
- ఎప్పటికప్పుడు వండిన వేడి వేడి ఆహారమే తీసుకోవాలి
- చిన్నారులు, వృద్ధులను సాధ్యమైనంత వరకు వెచ్చని వాతావరణంలో ఉండేలా చూడాలి
- ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులు, ఆస్తమా, ఎలర్జిక్ వ్యాధులు ఉన్నవారు తెల్లవారుజామున, రాత్రి సమయాల్లో బయటికి వెళ్లకపోవడం మంచిది

చికిత్సా పద్ధతులు

సీజనల్ వ్యాధులకు ప్రత్యేక చికిత్స అంటూ ఏమీ ఉండదు. లక్షణాల ఆధారంగా ట్రీట్‌మెంట్ అందిస్తారు. జలుబు, దగ్గు, జ్వరం తదితర లక్షణాలకు సంబంధిత ఔషధాలను సిఫారసు చేస్తారు. మూడు నాలుగు రోజులైనా లక్షణాలు తగ్గకపోతే అప్పుడు యాంటి బయాటిక్స్ ఇస్తారు. నీరసంగా ఉన్న రోగులకు ఫ్లూయిడ్స్ ఇవ్వాల్సి వస్తుంది. సకాలంలో చికిత్స తీసుకున్నట్లయితే లక్షణాల తీవ్రతను అరికట్టవచ్చు. దీని వల్ల రోగి త్వరగా కోలుకుంటాడు. నిర్లక్ష్యం చేస్తే ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల్లో చిన్నపాటి అనారోగ్య సమస్య కూడా ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని మర్చిపోవద్దు.

.. మహేశ్వర్‌రావు బండారి



డాక్టర్ రాజారావు
జనరల్ ఫిజీషియన్
ప్రిన్సిపాల్, ఉస్మానియా మెడికల్ కాలేజి
హైదరాబాద్


గాయత్రీదేవి

నేటి అలంకారం

శరన్నవరాత్రుల్లో రెండో రోజు అమ్మవారిని శ్రీగాయత్రీదేవిగా అలంకరించి ఆరాధిస్తారు. 'నగాయత్ర్యాః పరం మంత్రం న మాతుః పరదైవతమ్'- గాయత్రిని మించిన మంత్రం లేదు, ఆ తల్లిని మించిన దైవం లేదు అని శాస్త్రాలు చెబుతున్నాయి.

మాతా చతుర్ణాం వర్ణానాం వేదాంగానాం చ ఛందసాం।
సంధ్యావందన మంత్రాణాం తంత్రాణాం చ విచక్షణా॥

నారాయణుడు గాయత్రీదేవి వైభవాన్ని నారదుడికి చెప్పిన సందర్భంలో పేర్కొన్న మంత్రం ఇది. గాయత్రి సర్వజగజ్జనని అని విశదీకరించాడు నారాయణుడు. అంతేకాదు, గాయత్రి సమస్త వేదవేదాంగాలకూ అధిదేవత. ఆమె జ్ఞానదాయిని. స్కాంద పురాణం ప్రకారం గాయత్రీదేవికి మరోపేరే సరస్వతి. అయిదు ముఖాలుగా అభివర్ణించే గాయత్రీమాతను పద్మాసినిగా కొలవటం ఆనవాయితీ. అమ్మవారి పంచముఖాలను ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానాలకు ప్రతీకలుగా భావిస్తారు. అలాగే పంచభూతాలైన భూమి, జలం, అగ్ని, గాలి, ఆకాశాలను కూడా అమ్మవారి అయిదు ముఖాలుగా భావించి ఆరాధిస్తారు. అదేవిధంగా గాయత్రీమాత



పది హస్తాలతో విరాజిల్లుతుంది. పది చేతుల్లో అమ్మవారు త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ఆయుధాలను ధరిస్తుంది. వరద, అభయ హస్తాలతో భక్తులను కరుణిస్తుంది. గాయత్రీదేవి మహాశివుడిలా మూడు నేత్రాలతో దర్శనమిస్తుంది.

'సకల దేవతల శక్తిసంపత్తులు నిబిడీకృతం చేసుకున్న ఏకైక మంత్రం 'గాయత్రీ మంత్రం' అందుకే అన్ని మంత్రాలు గాయత్రీ మంత్రంలో లయమవుతాయి' అన్నారు రామకృష్ణ పరమహంస. శ్రీకృష్ణ భగవానుడు కూడా గాయత్రీ మంత్ర విశిష్టతను తెలియజేశాడు. భగవద్గీతలోని 'విభూతి యోగం'లో 'గాయత్రీ ఛందసా మహమ్' అంటూ వైదిక మంత్రాల్లో గాయత్రీ మంత్రాన్ని నేనే! అని పునరుద్ఘాటించాడు. గాయత్రీ మంత్రాన్ని ఎవరైనా జపించవచ్చు. ఈ మంత్రం ప్రాణశక్తిని కాపాడుతుందని ఉపాసకుల ప్రగాఢ విశ్వాసం. వాల్మీకి మహర్షి రామాయణ కావ్యంలో ప్రతి వెయ్యి శ్లోకాలకు ఒక శ్లోకాన్ని గాయత్రీ మంత్రంలోని ఒక్కో మంత్రాక్షరంతో ప్రారంభించారు. గాయత్రీ మంత్రంలోని 24 అక్షరాలను పొందుపరుస్తూ 24వేల శ్లోకాలతో ఆది కావ్యాన్ని జాతికి అందించారు. గాయత్రీ మంత్రాక్షరాలు పొందుపరచిన 24 శ్లోకాలు గాయత్రీ రామాయణంగా ప్రసిద్ధి. దీనిని చదివితే సంపూర్ణ రామాయణం పారాయణం చేసిన ఫలం కలుగుతుందని విశ్వసిస్తారు.

• మనోజ్ఞ

నాగుల పంచమి నాడు ఉయ్యాలో..

నాగుల పంచమి నాడు ఉయ్యాలో.. నరులొక్కపొద్దు ఉయ్యాలో..
మా ఇంట్ల నాగరాణి ఉయ్యాలో.. దశిమొక్కాపొద్దు ఉయ్యాలో..

ముత్యాల బండెక్కి ఉయ్యాలో.. ముని జలకామాడె ఉయ్యాలో..
పగడాల బండెక్కి ఉయ్యాలో.. పై జలకామాడె ఉయ్యాలో..

కంచిపట్టూ చీర ఉయ్యాలో.. తానుగట్టినాది ఉయ్యాలో..
దొంతుల్ల టొపిరైకె ఉయ్యాలో.. జాడిచ్చి తొడిగే ఉయ్యాలో..

ప్యాలాలు పుట్నాలు ఉయ్యాలో.. వొల్లెవోసూకోని ఉయ్యాలో..
సన్నపురైకలు ఉయ్యాలో.. చక్కనీ కుడుకలు ఉయ్యాలో..

పసుపూ కుంకుమ ఉయ్యాలో.. తావండ్లవెట్టుకొని ఉయ్యాలో..
ఇల్లెల్లె నాగరాణి ఉయ్యాలో.. ఇల్లింత పువ్వోలె ఉయ్యాలో..

బయలెల్లె నాగరాణి ఉయ్యాలో.. బంతీపువ్వోలె ఉయ్యాలో..
దొడ్డెల్లె నాగరాణి ఉయ్యాలో.. దోసాపువ్వోలే ఉయ్యాలో..

ఆడికెల్లి నాగరాణి ఉయ్యాలో.. పుట్టకొచ్చినాది ఉయ్యాలో..
పుట్టచుట్టూ తిరిగి ఉయ్యాలో.. పూదిచ్చి మొక్కె ఉయ్యాలో..

పుట్టాలున్నా నాగ ఉయ్యాలో.. బుస్సుమనీలేసె ఉయ్యాలో..
నడుము దింపకు నాగ ఉయ్యాలో.. నీ నడిపి చెల్లెల్ని ఉయ్యాలో..

గుడ్లుదియ్యకు నాగ ఉయ్యాలో.. గొడ్డురాల్ను కాను ఉయ్యాలో..
గుంజుకొని పడిగె ఉయ్యాలో.. గుమ్మడీ వనములకు ఉయ్యాలో..
మల్సుకో నీ పడిగె ఉయ్యాలో.. మల్లె వనములకు ఉయ్యాలో..

ఇవాల్టి బతుకమ్మ

ముద్దపప్పు బతుకమ్మ

రోజులు గడిచే కొద్దీ పల్లెల్లో బతుకమ్మ సంబురాలు మిన్నంటుతాయి. మూడోనాటికి కోలాహలం రెట్టింపు అవుతుంది. మూడో రోజు ముచ్చటను ముద్దపప్పు బతుకమ్మగా పిలుచుకుంటారు. బతుకమ్మ ఆడిన తర్వాత ముద్దపప్పు, బెల్లం ఆప్యాయంగా ఇచ్చిపుచ్చుకుంటారు. తెలంగాణ ప్రాంతంలోనూ పెసరపప్పునకు ఎక్కువ ప్రాధాన్యం ఉంది. అన్నప్రాశన మొదలు పిల్లలకు పెసరపప్పు, బియ్యంతో కలిపి ఉగ్గు వండి నెయ్యితో కలిపి పెడతారు తల్లులు. ముద్దపప్పు జ్ఞాపకశక్తిని పెంపొందిస్తుంది. అమ్మను 'ముద్గౌదనాసక్త చిత్తా' అంటారు. అంటే అమ్మవారికి కూడా పెసరపప్పుతో చేసే పొంగలి, ఇతర వంటకాలంటే ప్రీతి అని చెబుతారు. బతుకమ్మ మూడోనాడు ముద్దపప్పులో బెల్లం వేసి అమ్మకు నైవేద్యంగా సమర్పించి.. పిల్లలకు ప్రసాదంగా పంచిపెడతారు.



• డా॥ఆర్.కమల



కరీంనగర్‌లోని జ్యోతిరావు పూలే గ్రౌండ్‌లో సోమవారం సాయంత్రం బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించారు. మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, గంగుల కమలాకర్, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ తదితరులు పాల్గొన్నారు. అందమైన బతుకమ్మలను పేర్చి ఆడిపాడి సందడి చేశారు. - కరీంనగర్ కార్పొరేషన్

సింగరేణిలో బోనస్.. బోగస్

> మొదటిపేజీ తరువాయి...

అరకొరగా అందనుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి లాభాలు, బోనస్‌లో ప్రభుత్వ పన్నులు పోను సంస్థ రూ.6,394 కోట్ల లాభాలు గడించినట్టు సర్కారు వెల్లడించింది. వీటిలో కొత్త ప్రాజెక్ట్‌ల కోసం రూ.4,034 కోట్లను పక్కనపెట్టినట్టు తెలిపింది. రూ.2,360 కోట్లకు లాభాల బోనస్‌ను ప్రకటిస్తున్నట్టు తెలిపారు. బోనస్‌తో ఒక్కో కార్మికుడికి రూ.1,95,610 లబ్ధి చేకూరుతుందని, 71వేల మంది కార్మికులకు ప్రయోజనం కలుగుతుందని చెప్పింది. ఈ మేరకు సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, పలువురు మంత్రులతో కలిసి సింగరేణి లాభాలు, బోనస్‌ను సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. గతంలో సింగరేణి కోల్పోయిన, ప్రైవేట్ సంస్థలు దక్కించుకున్న రెండు గనులను సింగరేణి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపడుతామని తెలిపారు. రాష్ట్రంలోని విద్యుత్తు సంస్థలకు క్రాస్ సబ్సిడీని సకాలంలో చెల్లించలేకపోతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అంగీకరించారు. ప్రభుత్వం చెల్లించాల్సిన క్రాస్ సబ్సిడీ పెండింగ్‌లో ఉన్న విషయం నిజమేనని స్పష్టంచేశారు. బోనస్‌గా రూ.2,173 కోట్లను ప్రకటించాల్సి ఉండగా, రూ. 819 కోట్లను మాత్రమే ఇస్తున్నట్టు చెప్పడమేంటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన బోనస్ మొత్తం 12శాతమేనని చెప్తున్నారు.

కేసీఆర్ హయాంలో వాటా చెల్లింపు ఇలా!

సంవత్సరం	సింగరేణి లాభం	కార్మికులకు వాటా
2014-15	రూ.490.44 కోట్లు	రూ.102.99 కోట్లు (21%)
2015-16	రూ.1,066.63 కోట్లు	రూ.245.20 కోటు(23%)
2016-17	రూ.395.38 కోట్లు	రూ.327.44 కోట్లు(27%)
2019-20	రూ.1,766 కోట్లు	రూ.494 కోట్లు(28%)
2020-21 (కరోనా కాలం)	రూ.272.64 కోట్లు	రూ.368 కోట్లు(30%)
2022-23	రూ.2,222.46 కోట్లు	రూ.711.18 కోట్లు(32%)
2023-24	రూ.4,701 కోట్లు	రూ.796 కోట్లు(16.93%)
2024-25	రూ.6,394 కోట్లు	రూ. 819 కోట్లు(12%)



వాటా ప్రకటించినట్టు చూపుతూ.. అంకెల గారడీ చేశారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. సింగరేణిలో ఏడాది కాలంలో దాదాపు 4వేల మంది ఉద్యోగ విరమణ చేశారని, కార్మికుల సంఖ్య తగ్గడం వల్లే ఒక్కో కార్మికుడికి అందే మొత్తం పెరిగినట్టు కనిపిస్తున్నదని చెప్తున్నారు. 2023 -24 సంవత్సరంలో మొత్తం లాభాన్ని రూ.4,701 కోట్లుగా ప్రకటించారు. అప్పుడు కూడా సగం లాభాలను పక్కనపెట్టి, మిగతా సగానికే బోనస్ ఇచ్చారు. నిరుడు మొత్తం లాభం 4,701 కోట్లకు గాను.. ప్రకటించిన రూ.796 కోట్ల బోనస్‌ను లెక్కిస్తే.. 16.93 శాతమే అయ్యిందని, ఈ ఏడాది కూడా పాత కథే పునరావృతమైందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

పెద్దమొత్తంలో డబ్బులను పక్కన పెట్టి.. తృణప్రాయంగా బోనస్ ప్రకటిస్తూ.. చేతులు దులుపుకొంటుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ప్రకటనలే దీనికి నిలువెత్తు నిదర్శనమని కార్మికులు నిప్పులు చెరుగుతున్నారు. నిరుడు ఇదే పద్ధతిలో అరకొరగా లాభాల వాటాలు పంచిందని, ఈ సారి కూడా నిరాశే ఎదురైందని కార్మికులు చెప్తున్నారు. ఈ సారి లాభాలు పెరిగినా కార్మికులకు వచ్చే లాభాల వాటాలో కోత పెట్టడం దారుణమని మండిపడుతున్నారు. వాస్తవ లాభాలపైన కార్మికులకు వాటా చెల్లించి అనంతరం సంస్థ అభివృద్ధికి నిధులను ఖర్చు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేండ్లపాటు కేసీఆర్ సింగరేణి వాస్తవ లాభాలను ప్రకటించి.. వాటిపైనే లాభాల వాటాను చెల్లిస్తూ వచ్చారని కార్మికులు గుర్తుచేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత.. కార్మికులకు లాభాల వాటా దక్కకుండా చేస్తున్నదని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం నేతలు మండిపడుతున్నారు.

కాంగ్రెస్ సర్కార్‌పై కార్మికుల కన్నెర్ర

లాభాల వాటా పట్ల సింగరేణి కార్మికులు పెదవి విరిచారు. నిరుటి కంటే లాభాలను రూ.52 కోట్లు తక్కువకు బోనస్ ఇచ్చారని కార్మిక సంఘాల నేతలు మండిపడుతున్నారు. 33 నుంచి 34శాతానికి లాభాల

కార్మికులకు మరోసారి దగా

అహర్నిశలు శ్రమించి ప్రాణాలను పణంగా పెట్టి, బొగ్గును తీస్తూ.. సింగరేణిని లాభాల బాట పట్టిస్తున్న కార్మికుల కష్టాలను కాంగ్రెస్ సర్కారు చిన్నచూపు చూస్తున్నదని కార్మికులు మండిపడుతున్నారు. నికర లాభాల నుంచి



సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ ద్రోహం: హరీశ్‌రావు

సమైక్యరాష్ట్రంలో, ఇప్పుడు సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ ద్రోహం చేసిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. సింగరేణి కార్మికులకు ఇచ్చే లాభాల వాటాలో కోత విధించడంపై సోమవారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. సింగరేణి కార్మికుల బోనస్‌ను రేవంత్ ప్రభుత్వం బోగస్ చేసిందని మండిపడ్డారు. మొత్తం రూ. 6394 కోట్ల లాభాలు గడిస్తే, కేవలం 2360 కోట్లలో వాటాలు ఇవ్వడం ఏంటని ప్రభుత్వాన్ని నిలదీశారు. బీఆర్ఎస్ పాలనలో సింగరేణి కార్మికులకు సంక్షేమ ఫలాలు అందగా.. నేడు కాంగ్రెస్ పాలనలో ఘోరమైన సంక్షోభం నెలకొందని విమర్శించారు. కార్మికులకు అన్యాయం జరిగితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని తెలిపారు.



కార్మికుల బోనస్‌లో అన్యాయం: కొప్పుల

సింగరేణి కార్మికులకు బోనస్.. కాంగ్రెస్ మార్క్ బోగస్ అని మాజీ మంత్రి, టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. ఈ మేరకు ఆయన సోమవారం గోదావరిఖనిలో మీడియాతో మాట్లాడుతూ సింగరేణిని సిరుల గణిగా తీర్చిదిద్దిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే చెందుతుందని స్పష్టంచేశారు. సింగరేణి కార్మికుల లాభాల వాటా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండోసారి మోసం చేసిందని మండిపడ్డారు. రెండేండ్లలో సంస్థ అభివృద్ధి పేరిట పక్కన పెట్టిన రూ.6323 కోట్లపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మొదటి నుంచీ సింగరేణి కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడిందని విమర్శించారు.

రేవంత్ సర్కార్ తీరుపై నిరసనలు



నికర లాభాల మీద 34 శాతం బోనస్ ఇవ్వాల్సి ఉండే. కానీ రూ.4వేల కోట్లను పక్కనపెట్టి లాభాల వాటాను పంచడం వల్ల కార్మికులకు రెండింతలు నష్టం జరిగింది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నిరకలాభాలపై ప్రకటించాల్సి ఉండే. ఇదంత చూస్తే కార్మికులకు లాభాల వాటాను ఇవ్వడం ఇష్టంలేనే ఇలా చేసినట్టు అనిపిస్తున్నది. కాంగ్రెస్ సర్కార్ తీరును నిరసిస్తూ మంగళవారం కార్మికులు నల్లబ్యాడ్జీలతో బొగ్గు గనుల మీద నిరసనలు వ్యక్తంచేస్తాం.

-మిర్యాల రాజిరెడ్డి, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ఏకపక్షంగా ప్రకటించారు



ఈ ఏడాది సింగరేణి లాభాలు పెరిగాయి. బోనస్ కూడా పెరుగుతుందని భావించాం. బోనస్‌పై కార్మిక సంఘాలతో చర్చించాలని కోరాం. మా వినతిని ప్రభుత్వం పట్టించుకోలేదు. సింగరేణిలో నిరుడు అభివృద్ధి కోసమంటూ పక్కకు పెట్టిన రూ.2289 కోట్లు.. ఏ అభివృద్ధి కోసం ఖర్చు చేశారు. ప్రస్తుతం పక్కకు పెట్టిన రూ.4,034 కోట్లు వేటి కోసం ఖర్చు పెడుతారో స్పష్టతనివ్వాలి.

-వాసిరెడ్డి సీతారామయ్య, గుర్తింపు సంఘం(ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి

కొండను తవ్వి ఎలుకను పట్టారు



2024-25 ఆర్థిక సంవత్సరం లాభాల వాటా ప్రకటన కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు ఉన్నది. కేవలం రూ.802.40కోట్లు కార్మికుల చెల్లింపుగా ప్రకటించారు. ఈ ప్రకటన కార్మికులను నిరాశ కల్పించింది. వాస్తవ లాభాలు దాచిపెట్టి, ఇన్ని రోజులు కార్మికులను, కార్మిక సంఘాలను ఆందోళన బాట పట్టించి, చివరకు ప్రభుత్వ జోక్యంతో కార్మికులను మరో సారి మోసం చేయడానికి కారణమైన గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలను కార్మికులు నిదీయాలి.

- తుమ్మల రాజారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు



బతుకమ్మ వేడుకల ఏర్పాట్లు పరిశీలిస్తున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ తదితరులు

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

- 24న పీపుల్స్ ప్లాజాలో నిర్వహణ

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అస్తిత్వానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీకైన బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఈ నెల 24న హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు జరుగనున్నాయి. వేడుకలపై సోమవారం మాజీ మంత్రులు తలసాని, పద్మారావుగౌడ్, నగరానికి చెందిన పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో కేటీఆర్ సమీక్షించారు. ఈ వేడుకలో పార్టీ మహిళా విభాగం నేతలు, కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలని, బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవాలని కోరారు. నగరం నుంచి పెద్దసంఖ్యలో మహిళలు తరలివచ్చేలా మహిళా కార్పొరేటర్లు, ముఖ్య నేతలు కృషి చేయాలని సూచించారు.

సమ్మక్కసాగర్‌కు లైన్ క్లియర్

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): గోదావరి నదిపై సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి సూత్రప్రాయంగా అంగీకరించినట్టు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం రాయపూర్‌లో విష్ణుదేవ్ సాయితో భేటీ అనంతరం మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. సమ్మక్కసాగర్ ప్రాజెక్టు నిర్మాణ దిశగా కీలక ముందడుగు పడిందని తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో భూసేకరణ, పరిహారం, పునరావాస బాధ్యతను పూర్తిగా తెలంగాణ తీసుకుంటుందని వివరిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఓ పత్రాన్ని సమర్పించినట్టు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు.



నళినితో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

నళిని వైద్య ఖర్చుల బాధ్యత సర్కార్‌దే

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు భరోసా

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : మాజీ డీఎస్పీ నళినికి సంబంధించి సర్వీస్ సమస్యలు ఏమి ఉన్నా నిబంధనల మేరకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు సోమవారం ఆయన భువనగిరిలోని నళిని ఇంటికి వెళ్లారు. ఆమె బాగోగులు అడిగి తెలుసుకున్నారు. అల్లోపతి మందులు పడకపోవడంతో ఆయుర్వేద మందులను వాడటం వల్ల ఉపశమనం ఉన్నదని ఆమె కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. నళినికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



బాంబే వస్తున్నా..తలలు జాగ్రత్త!

పవన్‌కల్యాణ్ అభిమానుల నిరీక్షణకు తెరపడింది. గత కొన్ని రోజులుగా వారంతా ఆత్రుతగా ఎదురుచూస్తున్న 'ఓజీ' ట్రైలర్ సోమవారం విడుదలైంది. ఓజాస్ గంభీర పాత్రలో పవన్‌కల్యాణ్ వింటేజ్ స్టైల్‌లో అదరగొట్టాడు. భారీ యాక్షన్ ఘట్టాలు, గ్రిప్పింగ్ డ్రామా కలబోతగా ట్రైలర్ ఆకట్టుకుంది. అజ్ఞాతవాసం అనంతరం ముంబయి మాఫియాలో ప్రత్యర్థులను ఖతం చేయడానికి నగరానికి తిరిగొస్తాడు ఓజాస్ గంభీర. ఈ క్రమంలో ప్రతినాయకుడు ఇమ్రాన్‌హష్మీతో అతను చేసిన ముఖాముఖీ పోరాటం ఉత్కంఠను పంచింది. 'బాంబే వస్తున్నా..తలలు జాగ్రత్తా' అంటూ ఓజాస్ గంభీర ఇచ్చిన వార్నింగ్ హైలైట్‌గా నిలిచింది. విజువల్స్ కట్టిపడేసేలా ఉన్నాయి. దర్శకుడు సుజీత్ తనదైన స్టైలిష్ మేకింగ్‌తో సినిమాను తీర్చిదిద్దారు. ఇమ్రాన్ హష్మీ, ప్రియాంక మోహన్, ప్రకాశ్‌రాజ్, శ్రియా రెడ్డి, అర్జున్‌దాస్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, నిర్మాణ సంస్థ: డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్, నిర్మాతలు: డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి, దర్శకత్వం: సుజీత్.



'చిరంజీవి'గా పరిచయమై 47ఏండ్లు

అగ్ర నటుడు చిరంజీవి 'ప్రాణం ఖరీదు' చిత్రంతో సినీరంగ ప్రవేశం చేసిన విషయం తెలిసిందే. 1978 సెప్టెంబర్ 22న విడుదలైన ఈ చిత్రం సోమవారం నాటికి 47ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా తన సినీ జీవితానికి నాంది పలికిన ఈ చిత్రాన్ని గుర్తుచేసుకుంటూ, అభిమానులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ చిరంజీవి ఓ పోస్ట్ పెట్టారు. 'కొణిదెల శివశంకర వరప్రసాద్ అనే నేను 'ప్రాణం ఖరీదు' చిత్రం ద్వారా 'చిరంజీవి'గా మీకు పరిచయమై నేటితో 47ఏళ్లు పూర్తయ్యాయి ఈ చిత్రం ద్వారా నాకు నటుడిగా ప్రాణం పోసి, మీ అన్నయ్యగా, కొడుకుగా, కుటుంబ సభ్యుడిగా, ఒక మెగాస్టార్‌గా ఆదరించిన తెలుగు ప్రేక్షకులకు ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉంటాను. నేను 155 చిత్రాలు పూర్తి చేసుకున్నానంటే..అందుక్కారణం మీరందించిన నిస్వార్థమైన ప్రేమ. ఈ సుదీర్ఘ ప్రయాణంలో నేను పొందిన ఎన్నో అవార్డులు, గౌరవ మర్యాదలకు కారణం మీరే. మీ అందరి ప్రేమానురాగాలు ఎల్లప్పుడూ కొనసాగాలని కోరుకుంటున్నా' అని చిరంజీవి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన 'విశ్వంభర' 'మన శివశంకర వరప్రసాద్' చిత్రాలతో బిజీగా ఉన్నారు.

చిత్రం

ధర్మాన్ని కాపాడే దైవ గణం



'నాన్న ఇక్కడే ఎందుకు మాయమయ్యాడు? అనే సంభాషణతో మొదలైన 'కాంతార-ఛాప్టర్ 1' ట్రైలర్ ఆద్యంతం దైవిక, పోరాట ఘట్టాల కలబోతగా ఆకట్టుకుంది. రిషబ్‌శెట్టి కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో రూపొందించిన ఈ చిత్రం దసరా పర్వదినం సందర్భంగా అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకురానుంది. సోమవారం ట్రైలర్‌ను అగ్ర హీరో ప్రభాస్ విడుదల చేశారు. డివోషనల్ థ్రిల్లర్‌గా రూపొందిన 'కాంతార' దేశవ్యాప్తంగా ప్రేక్షకుల్ని మెప్పించింది. దాంతో సీక్వెల్‌పై ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి. 'ఎప్పుడు మనిషి అధర్మం వైపు వెళ్తాడో..ధర్మాన్ని కాపాడటానికి ఈశ్వరుడు తన గణాలను పంపుతూనే ఉంటాడు. ఈ అన్ని గణాలు వచ్చి కొలువైంది ఈ పుణ్యభూమిలో..' అనే డైలాగ్ ఈ సినిమా కథ తాలూకు ఆత్మను ప్రతిబింబించేలా ఉంది. 3వ శతాబ్దం నేపథ్యంలో నడిచే ఈ కథలో రిషబ్‌శెట్టి తన ప్రజల్ని రక్షించే వీరుడిగా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించారు. యువరాణి పాత్రలో కథానాయిక రుక్మిణి వసంత్ మెరిసిపోయింది. గుల్షన్ దేవయ్య కీలక పాత్రలో ఆకట్టుకున్నారు. గ్రాఫిక్స్ మెస్మరైజ్ చేసేలా ఉన్నాయి. హోంబలే ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదలకు సిద్ధమవుతున్నది.

'దేవగుడి' రహస్యం

అభినవ శౌర్య, నరసింహ, అనుశ్రీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'దేవగుడి'. స్వీయ దర్శకనిర్మాణంలో బెల్లం రామకృష్ణారెడ్డి నిర్మించారు. ఇటీవల ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను లాంచ్ చేశారు. దర్శకనిర్మాత బెల్లం రామకృష్ణారెడ్డి చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'వినూత్న కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. దేవగుడి చుట్టూ అల్లుకున్న రహస్యం ఏమిటన్నది ఆసక్తిని పంచుతుంది. సంగీతానికి కూడా మంచి ప్రాధాన్యం ఉండే చిత్రమిది' అన్నారు. ఈ సినిమాలో తాము ఛాలెంజింగ్ రోల్స్ పోషిస్తున్నామని నాయకానాయికలు తెలిపారు. రఘుబాబు, అన్నపూర్ణమ్మ, రఘు కుంచె తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎస్.కె.మదీన్, దర్శకనిర్మాణం: బెల్లం రామకృష్ణారెడ్డి.





రౌడీ జనార్దన జోడీగా..

వివాహానంతరం సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తున్నది అగ్ర కథానాయిక కీర్తి సురేష్. ఈ ఏడాది ఆమె ఓటీటీ రిలీజ్ 'ఉప్పు కప్పురంబు' చిత్రం ద్వారా ప్రేక్షకుల్ని పలకరించింది. అయితే 'భోళాశంకర్' తర్వాత కీర్తి సురేష్ తెలుగులో మరే భారీ ప్రాజెక్ట్‌ను అంగీకరించలేదు. తాజా సమాచారం ప్రకారం విజయ్ దేవరకొండ 'రౌడీ జనార్దన' చిత్రంలో కీర్తి సురేష్‌ను కథానాయికగా ఖరారు చేశారని తెలిసింది. దిల్‌రాజు నిర్మాణంలో రవికిరణ్ కోలా దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రం అక్టోబర్‌లో సెట్స్‌మీదకు వెళ్లనుంది. కొద్దిరోజులుగా కథానాయిక అన్వేషణలో ఉన్న చిత్రబృందం చివరకు కీర్తి సురేష్‌ను ఖరారు చేశారని తెలిసింది. రాయలసీయ నేపథ్యంలో పవర్‌ఫుల్ యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఈ సినిమా కోసం హీరో విజయ్ దేవరకొండ ఇప్పటికే రాయలసీమ యాసలో మంచి పట్టు సాధించారు. ఇందులో రాజశేఖర్ ప్రతినాయకుడిగా నటించబోతున్నారనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి. విజయ్ దేవరకొండ, కీర్తి సురేష్ తొలిసారి నాయకానాయికలుగా నటిస్తుండటం విశేషం. ఈ విషయంలో త్వరలో అధికారిక ప్రకటన వెలువడుతుందని సమాచారం.

సందీప్‌రెడ్డి వంగా నిర్మాణంలో తెలంగాణ ప్రేమకథా చిత్రం



'అర్జున్ రెడ్డి' 'యానిమల్' చిత్రాలతో దేశవ్యాప్తంగా పాపులర్ అయ్యారు దర్శకుడు సందీప్ రెడ్డి వంగా. 'యానిమల్' చిత్రం 900కోట్లకుపైగా వసూళ్లు సాధించి సంచలనం సృష్టించింది. సందీప్‌రెడ్డి మేకింగ్ స్టైల్, ఎమోషన్స్..యాక్షన్ ఘట్టాలను వినూత్న శైలిలో ప్రభావవంతంగా తెరపై ఆవిష్కరించే విధానం ప్రశంసలందుకొంది. ప్రస్తుతం ఆయన ప్రభాస్‌తో 'స్పిరిట్' సినిమాను తెరకెక్కించే పనిలో ఉన్నారు. ఇదిలా వుండగా స్వీయ నిర్మాణ సంస్థ భద్రకాళి పిక్చర్స్ పతాకంపై సందీప్‌రెడ్డి వంగా నిర్మాతగా ఓ చిన్న చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని తెలిసింది. దీనికి రామ్‌గోపాల్‌వర్మ శిష్యుడు వేణు దర్శకత్వం వహిస్తారని, 'మేము ఫేమస్' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న సుమంత్ ప్రభాస్ హీరోగా నటిస్తారని సమాచారం. తెలంగాణ నేపథ్యంలో నడిచే ప్రేమకథా చిత్రమిదని, కథ, కథనాలు సరికొత్త పంథాలో సాగుతాయని చెబుతున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడుతుందని తెలిసింది. ఇక 'స్పిరిట్' చిత్రం అక్టోబర్‌లో సెట్స్‌మీదకు వెళ్లనుంది.



ప్రేమలో రెండోసారి

రమణ సాకే, వనిత గౌడ జంటగా నటిస్తున్న చిత్రం 'ప్రేమలో రెండోసారి'. సత్య మార్క దర్శకుడు. సిద్ధ క్రియేషన్ పతాకంపై నీరజ లక్ష్మి నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను ఇటీవల ప్రముఖ దర్శకుడు తేజ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. ఈ భూమి ఉన్నంత వరకు ప్రేమకు మరణం లేదనే హృద్యమైన పాయింట్‌తో ఈ సినిమాను తెరకెక్కించారని అన్నారు. నేటి యువత మెచ్చే చిత్రమిదని, అక్టోబర్‌లో విడుదలకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు సత్య మార్క పేర్కొన్నారు. జబర్దస్త్ శ్రీను, బాబీ, దుర్గారావు, జబర్దస్త్ ఫణి, సతీష్ సారపల్లి తదితరులు ఈ చిత్ర తారాగణం.



కామెడీ బతికితే అందరూ హ్యాపీ!

ప్రియదర్శి, నిహారిక ఎన్.ఎం, విష్ణు ఓఐ, రాగ్ మయూర్, ప్రసాద్ బెహారా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మిత్ర మండలి'. విజయేందర్ ఎస్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో 'జంబర్ గింబర్ లాలా..' అంటూ సాగే మూడో గీతాన్ని ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. తమ జీవితం ఎలా ఉన్నా అందరినీ నవ్వించాలనే లక్ష్యంతో కమెడియన్స్ పనిచేస్తుంటారని, కామెడీ బతికితే అందరూ ఆనందంగా ఉంటారని అన్నారు. తాను బ్రహ్మానందానికి ఏకలవ్య శిష్యుడినని, ఈ సినిమాలో ఆయనతో కలిసి నటించడంతో కల నిజమైందని ప్రియదర్శి తెలిపారు. ప్రేక్షకుల ముఖాలపై నవ్వులు పూయించడానికే ఈ సినిమా తీశామని బన్నీ వాసు అన్నారు. బ్రహ్మానందంగారి 'జంబర్ గింబర్ లాలా' అనే పాపులర్ డైలాగ్‌తో ఈ పాట చేసి ఆయన పట్ల అభిమానాన్ని చాటుకున్నామని సంగీత దర్శకుడు ఆర్.ఆర్.ధృవన్ పేర్కొన్నారు.

'హనుమాన్' చిత్రంతో ప్రతిభావంతుడైన దర్శకుడిగా దేశవ్యాప్తంగా గుర్తింపును సంపాదించుకున్నారు ప్రశాంత్‌వర్మ. తాజాగా ఆయన భారతీయ పురాణేతిహాసాల స్ఫూర్తితో 'అధీర' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రశాంత్‌వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా రానున్న ఈ చిత్రం ద్వారా కల్యాణ్ దాసరి హీరోగా పరిచయమవుతున్నాడు. ఎస్‌జే సూర్య కీలక పాత్రలో కనిపించనున్నారు. శరణ్ కొప్పిశెట్టి దర్శకుడు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుగుతున్నది. సోమవారం ఎస్‌జే సూర్య ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. 'సూపర్ హీరో చిత్రమిది. ఆశ, అంధకారం మధ్య జరిగే యుద్ధం. ధర్మాన్ని రక్షించడానికి సూపర్‌హీరో ఏం చేశాడన్నది ఆసక్తికరంగా ఉంటుంది. స్టన్నింగ్ విజువల్స్, గ్రాఫిక్స్, హై వోల్టేజ్ డ్రామాతో ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త వీక్షణానుభూతినందిస్తుంది' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, ప్రొడక్షన్ డిజైనర్: శ్రీనాగేంద్ర తంగాల, క్రియేటెడ్ బై: ప్రశాంత్‌వర్మ, దర్శకత్వం: శరణ్ కొప్పిశెట్టి.



ఆశ, అంధకారం మధ్య యుద్ధం



క్యా హాలత్ హో గయా!

దీనస్థితికి ఎల్బీ స్టేడియం • బురదమయంగా మారిన వైనం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: చారిత్రక ఎల్బీ స్టేడియం మరోసారి వార్తల్లోకెక్కింది! క్రీడలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఏపాటిదో మరోమారు తేటతెల్లమైంది. వార్షిక బడ్జెట్‌లో గతంలో ఎన్నడూలేని విధంగా నిధులు కేటాయించామంటూ బడాయికి పోయిన రాష్ట్ర ప్రభుత్వం..స్టేడియాలను నాన్‌స్పోర్ట్స్ ఈవెంట్లకు అద్దె ఇస్తూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నది. ఓవైపు స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ హబ్, 2036 ఒలింపిక్స్ ఆతిథ్యమంటూ నానా హంగామా చేస్తున్న కాంగ్రెస్ సర్కార్ ఉన్న స్టేడియాలను నాశనం చేస్తున్నది. నగరం నడిబొడ్డున ఉన్న ఎల్బీ స్టేడియంలో ప్రభుత్వం మారిన తర్వాత కమర్షియల్ ఈవెంట్లకు అడ్డాగా మారిపోయింది. మ్యూజికల్ నైట్, ఫోక్‌నైట్, సినిమా ప్రిరిలీజ్ ఈవెంట్లకు స్టేడియం చిరునామాగా మారింది. ఆదివారం ఇదే స్టేడియంలో టాలీవుడ్ ప్రముఖ నటుడు పవన్ కల్యాణ్ నటించిన 'ఓజీ' సినిమా కన్సర్ట్ జరిగింది. ఎడతెరిపిలేని వర్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రేక్షకులు వచ్చారు. తమ అభిమాన నటుని కొత్త సినిమా కోసం వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కన్సర్ట్ జరుగుతున్నంత సేపు అలాగే ఉండిపోయారు. ఇంత వరకు బాగానే ఉంది. కన్సర్ట్ ముగిసిన తర్వాత ఎల్బీ స్టేడియం పరిస్థితి చూస్తే 'క్యా హాలత్ హో గయా' అంటూ పలువురు క్రీడాభిమానులు ముక్కున వేలేసుకుంటున్నారు. క్రీడాటోర్నీలకు ఆతిథ్యమివ్వాల్సిన చారిత్రక స్టేడియం బురద పొలంగా మారిన తీరును చూసి మనోవేదనకు గురవుతున్నారు. ఎంతో మంది దిగ్గజాలను అందించిన ఘనమైన చరిత్ర కల్గిన స్టేడియం ఇలా అయిపోయిందా అంటూ నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు. కొత్త స్టేడియాలు కట్టడం మాట అటుంచుతే..కనీసం ఉన్న వాటిని కాపాడుకునే తెలివి ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదా అంటూ ప్రశ్నిస్తున్నారు. నాన్‌స్పోర్ట్స్ ఈవెంట్స్ కూడా ఇవ్వచ్చని, అది జీవోలోనూ స్పష్టంగా ఉందంటూ పేర్కొంటున్న సాట్స్ ఎండీ ప్రస్తుత స్టేడియం దీనస్థితికి కారణమేంటో చెప్పాలని క్రీడాభిమానులు నిలదీస్తున్నారు. ఇదిలా ఉంటే ఆదివారం జరిగిన కన్సర్ట్‌కు సదరు సినీ నిర్మాణ సంస్థ రూ.10 లక్షలు చెల్లించినట్లు తెలిసింది. ఇలా అద్దెకు ఇవ్వడం ద్వారా వస్తున్న ఆదాయాన్ని సాట్స్..తాత్కాలిక ఉద్యోగుల జీతాలకు, స్టేడియం నిర్వహణకు ఉపయోగిస్తున్నట్లు అధికారులు చెప్పుకొస్తున్నారు. మరి కమర్షియల్ ఈవెంట్లకు ఇస్తూ ఇంకా ఎన్ని రోజులు స్టేడియాన్ని నాశనం చేస్తారంటూ క్రీడాభిమానులు ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వ పెద్దలు స్టేడియం పరిస్థితిపై ఆలోచించాలని మనవి చేస్తున్నారు.

వార్ వన్‌సైడేనా..!

ప్రపంచ క్రికెట్‌లో భారత్, పాకిస్థాన్ మధ్య జరిగే మ్యాచ్‌లకు (ఏ ఫార్మాట్‌లో అయినా) ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అనధికారికంగా అది తుపాకులు, తూటాలు లేని సమరం. అభిమానులకది మైదానంలో ఇరుజట్ల నుంచి 11 మంది ఆయుధాలు లేని సైనికులు బంతి, బ్యాట్‌తో హోరాహోరీగా పోరాడే రణక్షేత్రం. రెండు జట్ల నుంచి దిగ్గజ ఆటగాళ్లెందరో ఈ సమరాన్ని తమదైన ఆటతో రక్తికట్టించి నరాలు తెగే ఉత్కంఠతో కూడిన ఎన్నో చిరస్మరణీయ మ్యాచ్‌లను క్రికెట్ ప్రేక్షకులకు అందించారు. దాయాదుల పోరు అంటే టీవీలకు అతుక్కుపోని క్రికెట్ అభిమాని ఉండడు అనేది అతిశయోక్తం కాదు. క్రికెట్‌లో 'గ్రేటెస్ట్ రైవల్రీ' అని ఈ రెండు జట్లు ఆడే మ్యాచ్‌లకు పేరుంది. కానీ ఇదంతా నిన్నటి మాట. కొన్నేండ్లుగా వార్ వన్‌సైడే అవుతున్నది. తాజాగా భారత టీ20 సారథి సూర్యకుమార్ యాదవ్ అయితే 'ఇకనుంచి ఆ జట్టును 'ప్రత్యర్థి' అనొద్దు' అని చెప్పడం చర్చనీయాంశమైంది.

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం



యూఏఈ వేదికగా జరుగుతున్న ఆసియా కప్‌లో భాగంగా సూపర్-4 దశలో ఆదివారం (సెప్టెంబర్ 21) పాకిస్థాన్‌తో మ్యాచ్ ముగిశాక పాత్రికేయులతో సూర్య మాట్లాడుతూ.. 'మీరు ఇకనుంచి పాకిస్థాన్‌తో మాకు జరిగే మ్యాచ్‌లకు ప్రత్యర్థి అనే పదం వాడొద్దు. నా వరకైతే రెండు జట్లు ఒక 15 మ్యాచ్‌లు ఆడాయని అనుకుందాం. అందులో ఇరు జట్లు 7-7తో సమంగా ఉంటేనో లేక 8-7తో ఉంటేనో వాళ్లు మెరుగైన క్రికెట్ ఆడారని అనుకోవచ్చు. కానీ 13-0, 10-1తో ఉంటే అది ఎంతమాత్రమూ మీరంటున్న వైరం కాదు' అని చెప్పాడు. సూర్య చెప్పింది అక్షర సత్యం. గణాంకాలను చూస్తే పాక్‌పై భారత్ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శిస్తున్నది. సరిహద్దు సమస్యలతో ఇరుజట్ల మధ్య 2012 నుంచి ద్వైపాక్షిక సిరీస్‌లు లేనందున ఐసీసీ, ఆసియా కప్ వంటి ఈవెంట్స్‌లో మాత్రమే భారత్, పాక్ తలపడుతున్నాయి. వాటిలో ఒకటి అరా తప్ప వార్ వన్‌సైడే.

మనదే ఆధిపత్యం..

వన్డే ప్రపంచకప్‌లో ఇరుజట్లు 8 సార్లు తలపడితే ఎనిమిదింటిలోనూ భారత్‌దే విజయం. టీ20 ప్రపంచకప్‌లో 8 మ్యాచ్‌లు ఆడితే భారత్ 6 గెలవగా పాకిస్థాన్ ఒకటి గెలవగా ఒక మ్యాచ్ డ్రా అయింది. చాంపియన్స్ ట్రోఫీలో ఆరు మ్యాచ్‌లు ఆడితే దాయాదులు తలా 3 మ్యాచ్‌ల్లో విజయాలు సాధించారు. 2007 నుంచి టీ20లలో 15 సార్లు తలపడితే టీమ్ఇండియా ఏకంగా 12 సార్లు గెలువగా పాక్ నెగ్గింది రెండే.

మియందాద్ కుప్పిగంతుల నుంచి కోహ్లీ సిక్సర్ వరకూ..

టెస్టుల్లో 1952 నుంచి దాయాదులు తలపడుతున్నా వన్డేల్లో 1978 నుంచి మొదలయ్యాయి. వన్డే ప్రపంచకప్‌లో చిరకాల ప్రత్యర్థులు ముఖాముఖి తలపడుతున్నది 1987 నుంచే.. 1992 వన్డే వరల్డ్ కప్‌లో ఈ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో భారత వికెట్ కీపర్ కిరణ్ మోరే శ్రుతిమించి అప్పీల్ చేస్తున్నాడని అతడిని వెక్కిరిస్తూ జావేద్ మియాందాద్ కుప్పిగంతులు వేయడం అభిమానులకు ఇప్పటికీ గుర్తే. 1996 ప్రపంచ కప్ క్వార్టర్స్‌లో భారత మాజీ పేసర్ వెంకటేశ్ ప్రసాద్‌ను పాక్ బ్యాటర్ అమీర్ సొహైల్ కవ్వించడం.. 1986లో జావేద్ మియందాద్ ఆస్ట్రల్ ఆసియా కప్‌లో ఆఖరి బంతికి సిక్స్ కొట్టడం.. 2003 వన్డే ప్రపంచకప్‌లో వసీం అక్రమ్, వకార్ యూనిస్, షోయబ్ అక్తర్ వంటి పేసర్లను చీల్చి చెండాడుతూ సచిన్ 98 పరుగుల ఇన్నింగ్స్.. 2010లో ఆసియా కప్‌లో ఆఖరి ఓవర్‌లో హర్భజన్ సిక్సర్.. ఇవన్నీ ఒకెత్తుఅయితే 2007 టీ20 ప్రపంచకప్ సమరం మరో ఎత్తు. గ్రూప్ స్టేజ్‌లో బాల్ అవుట్ ద్వారా ఫలితం తేలడం.. ఫైనల్‌లో మిస్బావుల్ హక్ ఇచ్చిన క్యాచ్‌ను శ్రీశాంత్ అందుకోవడం.. వంటి ఎన్నో మ్యాచ్‌లు దాయాదుల పోరుకు మరింత వన్నె తీసుకొచ్చాయి. 2022లో మెల్‌బోర్న్ వేదికగా విరాట్ కోహ్లీ (82*) చేసిన ఒంటరిపోరాటం మరో ఎత్తు. హరీస్ రౌఫ్ బౌలింగ్‌లో కొట్టిన రెండు సిక్సర్లు భారత అభిమానులెవరూ మరిచిపోరు.

వార్ వన్‌సైడే..

కానీ 2023 వన్డే ప్రపంచకప్, 2024 టీ20 ప్రపంచకప్‌తో ఈ ఏడాది ముగిసిన చాంపియన్స్ ట్రోఫీతో పాటు తాజాగా ఆసియా కప్‌లోనూ పాక్ ప్రదర్శన నానాటికీ తీసికట్టుగా మారుతున్నది. పాక్ ప్రదర్శనపై ఆ జట్టు సీనియర్లు అక్రమ్, అక్తర్ వంటివారయితే బహిరంగంగానే పాక్ ఆటగాళ్ల ఆటతీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

బలహీనంగా పాక్

గతంతో పోల్చితే పాకిస్థాన్ జట్టు బలహీనంగా తయారైంది. పాక్‌కు బౌలింగే బలం. ఇమ్రాన్ ఖాన్, వసీం అక్రమ్, వకార్, అక్తర్ వంటి హేమాహేమి పేసర్లను అందించిన పాక్‌కు ఇప్పుడు ఆ స్థాయి బౌలర్ లేడు. షహీన్ షా అఫ్రిది ఆరంభంలో ఆ కొరతను తీర్చుతాడని అనుకున్నా గత రెండేండ్లుగా అతడి ప్రదర్శన నానాటికీ దిగజారుతున్నది. రౌఫ్ ఎప్పుడు జట్టులో ఉంటాడో తెలియని పరిస్థితి. నిత్యం హెడ్‌కోచ్‌ల మార్పు, జట్టులో బంధుప్రీతి, స్టార్ ఆటగాళ్ల నిలకడలేనితనంతో పాటు దేశవాళీ క్రికెట్‌ను గాలికొదిలేసిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) నిర్వహణ వైఫల్యం వంటివి ఆ జట్టుకు శాపంగా మారాయి. ఒకవైపు టీమ్ఇండియా.. ఐపీఎల్, స్థానికంగా క్రికెట్ లీగ్‌లు, దేశవాళీలో సౌకర్యాలను మెరుగుపరుచుకుని యువ ఆటగాళ్లను ప్రోత్సహిస్తూ అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లుగా తీర్చిదిద్దుతుంటే పాక్ మాత్రం ఆ దేశ రాజకీయ, ఆర్థిక వ్యవస్థల్లాగే అనిశ్చితితో కొట్టుమిట్టాడుతున్నది.

నేటి నుంచి గోల్కొండ గోల్ఫ్ టోర్నీ



హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ గోల్ఫ్ కోర్స్ వేదికగా మంగళవారం నుంచి ప్రతిష్టాత్మక తెలంగాణ గోల్కొండ గోల్ఫ్ మాస్టర్స్ టోర్నీ నుంచి మొదలుకానుంది. ఈనెల 26వ తేదీ వరకు జరిగే టోర్నీలో మొత్తం 123 మంది జాతీయ, అంతర్జాతీయ గోల్ఫర్లు పోటీలో ఉన్నారు. భారత టాప్ గోల్ఫర్లు అర్జున్ ప్రసాద్, ఉదయన్ మానె, శౌర్య భట్టాచార్యతో పాటు శ్రీలంక, బంగ్లాదేశ్, యూరప్ దేశాలకు చెందిన ఇంటర్నేషనల్ స్టార్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. టోర్నీ కోసం కోటి రూపాయల ప్రైజమనీ ప్రకటించారు. ఇందులో ప్రపంచ గోల్ఫ్ ర్యాంకింగ్ పాయింట్లు కూడా ఉండటంతో ప్లేయర్ల మధ్య హోరాహోరీ పోరు జరుగనుంది. సోమవారం ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమంలో గోల్ఫర్లు అర్జున్ ప్రసాద్, స్టెఫాన్ డానెక్, పీజీటీఐ డైరెక్టర్ వికాస్‌సింగ్, కెప్టెన్ జస్విందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ లీగ్‌లో కేఎల్ రాహుల్

పనాజీ: ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్)లో భారత క్రికెటర్ కేఎల్ రాహుల్ భాగం కానున్నాడు. గోవా గార్డియన్స్ జట్టులో అతడు సహ యజమానిగా చేరాడు. హైదరాబాద్ వేదికగా అక్టోబర్ 2 నుంచి 26 దాకా జరుగబోయే పీవీఎల్ నాలుగో సీజన్‌లో గోవా జట్టు అరంగేట్రం చేయనుంది. కేఎల్ రాహుల్ కో ఓనర్ కాగా రాజు చేకూరి గోవా జట్టుకు వ్యవస్థాపకుడిగానే గాక యజమానిగానూ ఉన్నాడు.

డికాక్ యూటర్న్

జోహన్నస్‌బర్గ్: దక్షిణాఫ్రికా వికెట్ కీపర్ బ్యాటర్ క్వింటన్ డికాక్ తన నిర్ణయాన్ని మార్చుకున్నాడు. 2023 వన్డే ప్రపంచకప్ తర్వాత ఈ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన డికాక్.. సోమవారం ఆ నిర్ణయాన్ని వెనక్కితీసుకున్నాడు. సఫారీ జట్టు పాకిస్థాన్ పర్యటనకు రానుండగా వన్డే, టీ20 జట్లలో డికాక్ సభ్యుడిగా ఉన్నాడు.



మలేషియాలో జరిగిన ఫిబా అండర్-16 ఏషియన్ బాస్కెట్‌బాల్ టోర్నీలో భారత్ తరఫున సత్తాచాటిన తెలంగాణ యువ ప్లేయర్లు విహారెడ్డి, నేత్రను సోమవారం ఎయిర్‌పోర్ట్‌లో అభినందిస్తున్న రాష్ట్ర సంఘం అధ్యక్షుడు రావుల శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పృథ్వీశ్వర్‌రెడ్డి.

భారత పర్యటనకు బోల్ట్

ముంబై: జమైకన్ చిరుత ఉసేన్ బోల్ట్ భారత పర్యటనకు రానున్నాడు. వచ్చేనెల 1న అతడు ముంబైలో జరిగే ఒక పుట్‌బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్‌కు హాజరుకానున్నాడు. పూమా నిర్వహిస్తున్న ఈ ఈవెంట్‌లో బెంగళూరు పుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ), ముంబై సిటీ ఎఫ్‌సీ మధ్య జరుగబోయే మ్యాచ్‌కు బోల్ట్ హాజరవుతాడు.

అమెరికా సంస్థలకూ ట్రంప్ సెగ!

హెచ్-1బీ వీసా ఫీజు పెంపుతో అగ్రరాజ్య కంపెనీలపై ఏటా రూ.1.24 లక్షల కోట్ల భారం • న్యాయ పోరాటం చేసే దిశగా అడుగులు

న్యూయార్క్/న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్-1బీ వీసా ఫీజును ఏకంగా లక్ష డాలర్లకు పెంచిన విషయం తెలిసిందే. అయితే విదేశీ కంపెనీలతోపాటు స్వదేశీ సంస్థలనూ అగ్రరాజ్యాధినేత తీసుకున్న ఈ నిర్ణయం గట్టిగానే ప్రభావితం చేయనున్నది. ఇకపై నైపుణ్యం, ప్రతిభ కలిగిన విదేశీ ఉద్యోగులను పనిలో పెట్టుకోవాలంటే అమెరికాలోని సంస్థలు భారీ మొత్తాల్లో ఖర్చు చేయాల్సి వస్తున్నది మరి. ఇలా ఇతర దేశాల వర్కర్లను అమెరికాలోకి తెచ్చుకోవడానికి అక్కడి సంస్థలు ఏటా రూ.1.24 లక్షల కోట్ల (14 బిలియన్ డాలర్లు)ను హెచ్-1బీ వీసా దరఖాస్తు రుసుములుగా చెల్లించాల్సి ఉంటున్నది. అయితే అమెరికాలో ఉన్న దేశ, విదేశీ సంస్థలు స్థానికులనే ఉద్యోగాల్లోకి తీసుకోవాలనే ఈ నిర్ణయం అని ట్రంప్ సర్కారు సమర్థించుకుంటున్నా.. దీన్ని మాత్రం ఆర్థిక నిపుణులు విమర్శిస్తున్నారు. ఈ నిర్ణయం అమెరికా ఆర్థిక వ్యవస్థనూ దెబ్బతీయగలదని హెచ్చరిస్తున్నారు. అందుకు తగ్గట్టే యూఎస్ కార్పొరేట్లు పెద్ద మొత్తాల్లో వర్క్ పర్మిట్ల కోసం వెచ్చించాల్సిన పరిస్థితి రాబోతున్నదంటూ వారంతా అంచనాలు వేస్తుండటం గమనార్హం.



ఇదీ సంగతి..

అమెరికా సిటిజన్‌షిప్, ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) వివరాల ప్రకారం గత ఏడాది కొత్తగా 1,41,000కుపైగా హెచ్-1బీ వీసాలు జారీ అయ్యాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది కూడా ఇదే స్థాయిలో వీసాల కోసం నూతన దరఖాస్తులు వస్తే.. పెంచిన ఫీజు ప్రకారం అమెరికన్ కంపెనీలు 14 బిలియన్ డాలర్లు చెల్లించాల్సి రావచ్చని ఎక్స్‌పర్ట్స్ చెప్తున్నారు. విదేశీ ఇంజినీర్లు, సైంటిస్టులు, కోడర్స్‌పై సిలికాన్ వ్యాలీ పెద్ద ఎత్తునే ఆధారపడుతున్నది. అందుకే ఏటా వీరిని భారీగానే ఉద్యోగాల్లో అక్కడి కంపెనీలు నియమించుకుంటున్నాయి. ఈ క్రమంలో నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాలనూ అకౌంటెన్సీ, హెల్త్‌కేర్ తదితర రంగాలకు చెందిన కంపెనీలు విరివిగా వాడేస్తున్నాయని యూఎస్‌సీఐఎస్ తెలియజేస్తున్నది. అలాగే నిరుడు ఆమోదం పొందిన దాదాపు 4 లక్షలకుపైగా హెచ్-1బీ దరఖాస్తుల్లో ఎక్కువమంది తమ వీసాలను రెన్యువల్ చేసుకుంటున్నవారేనని తేలింది. మరోవైపు హెచ్-1బీ వీసా ఫీజు పెంపు అంశంపై చాలా అమెరికన్ సంస్థలు న్యాయ పోరాటం చేయాలని చూస్తున్నట్టు వాటి తరఫు న్యాయవాదులు చెప్తున్నారు. కోర్టుల్లో ట్రంప్ నిర్ణయాన్ని సవాల్ చేసే వీలుందంటున్నారు. ఇప్పటికే టారిఫ్‌ల రగడ కోర్టుల మెట్లెక్కిన నేపథ్యంలో ఇది మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది.

భారత్‌పై ప్రభావం తక్కువే: నాస్కామ్

హెచ్-1బీ వీసా కోసం కొత్తగా దరఖాస్తు చేసుకుంటేనే లక్ష డాలర్ల ఫీజు కట్టాల్సి ఉంటుందని, కాబట్టి దేశీయ సంస్థలపై ప్రభావం తక్కువగానే ఉంటుందని భారతీయ ఐటీ పరిశ్రమల సంఘం నాస్కామ్ చెప్తున్నది. ఇప్పుడున్న వీసాదారులపై ఎలాంటి భారం పడబోదని అంటున్నది. నిజానికి ఇప్పటికే అమెరికాలోని భారతీయ, వాటి అనుబంధ సంస్థలు హెచ్-1బీ వీసాలపై ఆధారపడటం తగ్గించేశాయని, స్థానికులనే ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నాయని నాస్కామ్ గుర్తుచేసింది.

- 2024లో భారతీయ సంస్థలకు జారీ అయిన హెచ్-1బీ వీసాలు 10,162కు తగ్గుముఖం. 2015లో ఇవి 14,792గా ఉన్నాయి.
- హెచ్-1బీ వీసాల్లో 70 శాతానికిపైగా భారతీయ టెక్నాలజీ రంగ నిపుణులే తీసుకుంటున్నారు.
- యూఎస్‌సీఐఎస్ లెక్కల ప్రకారం 2025లో జూన్ 30నాటికి అమెజాన్‌కు అత్యధికంగా 10,044 హెచ్-1బీ వీసాల ఆమోదం లభించింది.
- టాప్-10 కంపెనీల్లో భారత ఐటీ రంగ దిగ్గజం టీసీఎస్ (5,505) రెండో స్థానంలో ఉన్నది. తర్వాతి స్థానాల్లో మైక్రోసాఫ్ట్, మెటా, యాపిల్, గూగుల్, కాగ్నిజెంట్, జేపీ మోర్గాన్ ఛేజ్, వాల్‌మార్ట్, డెలాయిట్ కన్సల్టింగ్ ఉన్నాయి.
- టాప్-20లో ఇన్ఫోసిస్ (2,004), ఎల్‌టీఐ మైండ్‌ట్రీ (1,807), హెచ్‌సీఎల్ అమెరికా (1,728) ఉన్నాయి.

వాణిజ్య

రెడీమేడ్ వస్త్రాల ధరల తగ్గింపు

- సీఎంఆర్ షాపింగ్ మాల్ సీఎండీ మావూరి వెంకటరమణ

హైదరాబాద్, సెప్టెంబర్ 22: జీఎస్టీని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా రెడీమేడ్ వస్త్రాల ధరలను తగ్గించినట్టు సీఎంఆర్ షాపింగ్ మాల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మావూరి వెంకటరమణ తెలిపారు. రెడీమేడ్ వస్త్రాలపై గతంలో 12 శాతంగా ఉన్న జీఎస్టీని ప్రస్తుతం 5 శాతానికి తగ్గిస్తూ ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా రూ. 2500లోపు దుస్తుల ధరలను 6.25 శాతం వరకు తగ్గించినట్టు ఆయన పేర్కొన్నారు. జీఎస్టీ ప్రయోజనాలను కస్టమర్లకు చేరవేయడంలో సంస్థ ఎల్లప్పుడు ముందువుంటుందని, అలాగే దసరాకు ప్రత్యేక రాయితీలతో డిస్కౌంట్లు అందిస్తున్నట్టు చెప్పారు. రూ.999 కొనుగోలుపై స్పాట్‌గిఫ్ట్, వన్ ప్లస్ వన్ ఫార్లు, కాంబో ఆఫర్లు అందిస్తున్నట్టు చెప్పారు.

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి

- ఇటలీ పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్ బాబు వినతి

హైదరాబాద్, సెప్టెంబర్ 22(నమస్తే తెలంగాణ): దేశంలోనే అతిపెద్ద ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా దూసుకెళ్తున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఇటలీ పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. సోమవారం సచివాలయంలో ఇటలీ దేశానికి చెందిన ప్రముఖ ఏరోస్పేస్, డిఫెన్స్ పరిశ్రమల ప్రతినిధులతో మంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విడిభాగాల తయారీ, సరఫరా వ్యవస్థ, నిర్వహణ-మరమ్మత్తు, సమగ్ర పరిశీలన (ఎమ్మార్వో), అవియానిక్స్, రాడార్ అండ్ సెన్సార్ సిస్టమ్స్, న్యూ-స్పేస్ అండ్ చిన్న ఉపగ్రహాలు, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ అండ్ కంపొజిట్స్ తయారీలో తెలంగాణలో బోలెడె అవకాశాలున్నాయన్నారు. రాష్ట్రంలో ప్రత్యేక ఏరోస్పేస్ పార్కులు, సెజ్‌లు, భారీ ఎంఎస్ఎంఈ నెట్‌వర్క్, శక్తిమంతమైన ఆర్ అండ్ డీ, మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, అత్యుత్తమ ప్రతిభ గల మానవ వనరులు, పారిశ్రామిక ప్రోత్సాహక విధానాలతో కూడిన పటిష్ఠమైన ఎకో సిస్టమ్ రాష్ట్రంలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.


సీడీకే విస్తరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 22: ఆటోమోటివ్ రిటైల్ సాఫ్ట్‌వేర్ ప్రొవైడర్ సీడీకే..హైదరాబాద్‌లో ఉన్న కార్యాలయాన్ని మరింత విస్తరించింది. అదనంగా 50 వేల చదరపు విస్తీర్ణంలో నెలకొల్పిన ఈ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించినట్లు సీడీకే ఇండియా ఎండీ సందీప్ కుమార్ జైన్ తెలిపారు. అడ్వాన్స్ ఏఐ టెక్నాలజీతో అంతర్జాతీయ క్లయింట్లకు సేవలు అందించడానికి ఈ సెంటర్‌ను వినియోగించనున్నట్లు చెప్పారు.

ఆకాశమే హద్దుగా పుత్తడి

- రూ.2,200 పెరిగిన పదిగ్రాముల ధర
- రూ.1.16 లక్షలకు చేరుకున్న విలువ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22: బంగారం భగ..భగ మండుతున్నది. ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్న పుత్తడి సోమవారం మరో ఉన్నత శిఖరాలను అధిరోహించింది. పాలసీ నిర్ణయాలపై అమెరికా ఫెడరల్ రిజర్వు అధికారి కీలక వ్యాఖ్యలపై పెట్టుబడిదారులు వేచి చూసేదోరణి అవలంభించారు. ఫలితంగా గ్లోబల్ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు మరో రికార్డును సృష్టించాయి. దేశ రాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల పుత్తడి ధర మరో రూ.2,200 ఎగబాకి రూ.1,16,200 పలికింది. అంతకుముందు ఇది రూ.1.14 లక్షలుగా ఉన్నది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగి పుత్తడి ధర రూ.2,150 ఎగబాకి రూ.1,15,650కి చేరుకున్నది. గ్లోబల్ మార్కెట్లో బుల్లిష్ ట్రెండ్ కారణంతో బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయికి ఎగబాకాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. ప్రస్తుత సంవత్సరంలో బంగారం ధర రూ.37,250 లేదా 47.18 శాతం పెరిగింది. డిసెంబర్ 31, 2024న రూ.78,950గా ఉన్న గోల్డ్ ధర ప్రస్తుతం రూ.1.16 లక్షలు దాటింది.



రికార్డుస్థాయికి వెండి

బంగారంతోపాటు వెండి కూడా చారిత్రక గరిష్ఠ స్థాయిని తాకింది. కిలో వెండి ఏకంగా రూ.4,380 ఎగబాకి రూ.1,36,380కి చేరుకున్నది. అంతకుముందు ఇది రూ.1.32 లక్షలుగా ఉన్నది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి పెద్దగా కొనుగోళ్లు లేకపోయినప్పటికీ అంతర్జాతీయంగా భారీగా పుంజుకోవడం వల్లనే దేశీయంగా రికార్డు స్థాయికి ఎగబాకిందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుత ఏడాది ఇప్పటి వరకు కిలో వెండి రూ.46,680 లేదా 52.04 శాతం ఎగబాకింది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధర పుంజుకుంటున్నది. ఔన్స్ గోల్డ్ ధర ఒక్క శాతం ఎగబాకి 3,728.43 డాలర్లకు చేరుకోగా, వెండి 43.61 డాలర్లకు ఎగబకాఇంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.